

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సోమవారం | 29-9-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 165 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి సా.4:32 తదుపరి అష్టమి, నక్షత్రం: మూల పూర్తి, వర్జ్యం: మ.12:42-2:28, తె. 4:32-6:18, దుర్ముహూర్తం: మ.12:29-1:16, మ.2:51-3:39, అమృతఘడియలు: రా.11:15-1:01, రాహుకాలం: ఉ. 7:30-9:00, సూర్యోదయం: 6:08, సూర్యాస్తమయం: 6:02 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





శ్రీహరి రజత కాంతులు

● 16 ఏళ్ల నిరీక్షణకు తెర

● ఆసియా అక్వాటిక్స్ చాంపియన్‌షిప్స్

అహ్మదాబాద్: ఆసియా అక్వాటిక్ చాంపియన్‌షిప్స్‌లో భారత 16 ఏళ్ల పతక నిరీక్షణకు ఏస్ స్విమ్మర్ శ్రీహరి నటరాజ్ తెరదించాడు. పోటీలు ఆరంభమైన తొలి రోజే రెండు రజతాలతో సహా మూడు పతకాలతో మెరిశాడు. ఈ క్రమంలో ఓ ఈవెంట్‌లో రెండు అంతకంటే ఎక్కువ పతకాలు సాధించిన తొలి భారత స్విమ్మర్‌గానూ రికార్డులకెక్కాడు. ఆదివారం జరిగిన పురుషుల 200 మీ. ఫ్రీస్టయిల్‌లో శ్రీహరి ఒక నిమిషం 48.47 సెకన్ల టైమింగ్‌తో రజతం సొంతం చేసుకొన్నాడు. ఇక, 50 మీ. బ్యాక్ స్ట్రోక్‌లో 25.46 సెకన్ల టైమింగ్‌తో శ్రీహరి రెండో రజతం దక్కించుకొన్నాడు. 4x100లో దాస్, లిఖిత్ సెల్వరాజ్, బెనిసన్, శ్రీహరిల బృందం 3:40.87 సెకన్లలో పూర్తి చేసి కాంస్యం అందుకుంది. తెలంగాణకు చెందిన వ్రితి అగర్వాల్ మహిళల 1500 మీ. ఫ్రీస్టయిల్‌లో ఐదో స్థానంతో సరిపెట్టుకుంది.

అర్ష్‌దీప్‌పైనా పీసీబీ ఫిర్యాదు



దుబాయ్: ఆసియాకప్ ఫైనల్ మ్యాచ్‌కు ముందే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మరో వివాదానికి తెర లేపింది. ఇటీవల భారత కెప్టెన్ సూర్య కుమార్‌పై ఐసీసీకి ఫిర్యాదు చేసిన పీసీబీ.. తాజాగా పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను లక్ష్యంగా చేసుకుంది. అతను కూడా చేతిని గాల్లోకి విమానం ఎగురుతున్నట్టుగా చూపడంతో పాటు అసభ్యకరంగా సంజ్ఞలు చేశాడని పేర్కొంది. అయితే ఈ వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత ఆదివారం సూపర్-4 మ్యాచ్‌లో పాక్‌ను ఓడించాకే ఇది జరిగినట్టుగా సమాచారం. ఎందుకంటే అర్ష్‌దీప్ ఆ మ్యాచ్‌లో ఆడలేదు.

విరాట్ పోస్ట్ వైరల్



న్యూఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఐపీఎల్ తర్వాత బ్యాట్ పట్టలేదు. భార్య అనుష్క, పిల్లలతో కలిసి లండన్‌లో విరాట్ సేద తీరుతున్న విషయం తెలిసిందే. త్వరలో ఆస్ట్రేలియాతో జరుగబోయే వన్డే సిరీస్ కోసం అక్కడే సన్నద్ధమవుతున్నాడు. సోషల్ మీడియాలో అప్పుడప్పుడు అభిమానులను పలకరించే విరాట్ తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో అనుష్కతో కలిసి ఉన్న ఓ ఫొటోను 'చాలా కాలం తర్వాత' అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేశాడు. అంతే.. ఒక్క రోజులోనే దానికి 11 మిలియన్ల లైక్స్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేయడం విశేషం.

విజయ తిలకం!

తిలక్ వర్మ వీరోచిత పోరాటం

భారత్ ఖాతాలో ఆసియాకప్

విశేషంగా రాణించిన స్పిన్నర్లు



తిలక్ వర్మ (53 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 69 నాటౌట్)



కుల్దీప్(4/30)

ఇది కదా అసలు సిసలు మజా అంటే.. ఆసియాకప్ ఫైనల్లోనూ దాయాది పాకిస్థాన్ ప్రత్యర్థిగా నిలిచిన వేళ.. ముచ్చటగా మూడోసారీ టీమిండియా తిరుగులేని పంచ్ ఇస్తుంటే.. అంతకు మించిన ఆనందం భారత క్రీడాభిమానికేముంటుంది. అయితే 146 పరుగుల స్వల్ప ఛేదనలో సూర్య సేన ఓ దశలో 20/3 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దెబ్బకు అందరికీ ఫలితంపై ఏ మూలో సందేహం. కీలక ఫైనల్లో తడబాటు తప్పదా? అనిపించింది. కానీ క్లిష్టంగా మారిన పిచ్‌పై తెలుగు తేజం తిలక్ వర్మ చూపిన తెగింపు వహ్వా అనిపించక మానదు. ఆఖరి ఓవర్ వరకు పట్టుదలగా నిలిచిన తను భారత్ ఖాతాలో తొమ్మిదో టైటిల్‌ను వేసి దేశాన్ని సంబరాల్లో ముంచాడు..

దుబాయ్: ఆసియాకప్ టీ20 టోర్నమెంట్‌లో భారత క్రికెట్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. బౌలర్లు విశేషంగా రాణించిన చోట.. బ్యాటర్లు కాస్త తడబడినా తిలక్ వర్మ (53 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 69 నాటౌట్) అజేయంగా నిలిచాడు. తద్వారా పాకిస్థాన్‌కు వరుసగా మూడో ఓటమిని రుచి చూపిస్తూ భారత్ 5 వికెట్ల తేడాతో గెలిచింది. అలాగే టోర్నీలో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి కప్‌ను గెలవడం విశేషం. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 19.1 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు సాహిబ్‌జాదా ఫర్హాన్ (38 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 57), ఫఖర్ జమాన్ (35 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 46), సయీమ్ అయూబ్ (14) మాత్రమే ఫర్వాలేదనిపించగా.. ఎనిమిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. స్పిన్నర్లు కుల్దీప్‌నకు నాలుగు.. అక్షర్, వరుణ్, పేసర్ బుమ్రాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 150 పరుగులు చేసి గెలిచింది. దూబే (22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 33), శాంసన్ (21 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 24) సహకరించారు. అష్రాఫ్‌కు మూడు వికెట్లు దక్కాయి.

తిలక్ నిలబెట్టాడు..

పాక్ విధించిన స్వల్ప ఛేదనలో భారత్‌కు ఆరంభంలోనే గట్టి ఝలక్‌లు తగిలినా తిలక్ వర్మ ఎదురొడ్డి నిలిచాడు. అతడికి శాంసన్, దూబే సహకరించారు. తాజా టోర్నీలో ఎదురు లేకుండా సాగిన ఓపెనర్ అభిషేక్ (5)ను కట్టడి చేయడంలో ఈసారి పాక్ బౌలర్లు సఫలమయ్యారు. రెండో ఓవర్‌లో పేసర్ అష్రాఫ్ స్లోబాల్‌ను సిక్సర్‌గా మలిచే ప్రయత్నంలో తను క్యాచ్ అవుటయ్యాడు. ఇక తర్వాతి ఓవర్‌లోనే కెప్టెన్ సూర్య (1) క్యాచ్‌ను కెప్టెన్ సల్మాన్ అద్భుతంగా పట్టేశాడు. దీనిపై రివ్యూ కోరినా ఫలితం లేకపోయింది. పేసర్ షహీన్ ఈ వికెట్ తీశాడు. అటు పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న ఓపెనర్ గిల్ (12) ఈ క్లిష్ట పరిస్థితిలో నిలుస్తాడని ఆశించినా అతడూ నిరాశపరిచాడు. అష్రాఫ్ ఓవర్‌లోనే మిడాఫ్‌లో రౌఫ్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో తొలి నాలుగు ఓవర్లలోనే జట్టు 3 వికెట్లు కోల్పోయింది. అప్పటికి స్కోరు 20 పరుగులే కావడం గమనార్హం. అయితే ఈ దశలో తిలక్-శాంసన్ జోడీ ఆదుకునే ప్రయత్నం చేసింది. ఆరో ఓవర్‌లో తిలక్ 4,6తో 11 రన్స్ రావడంతో పవర్‌ప్లేలో జట్టు 36/3తో నిలిచింది. కానీ పిచ్ పరిస్థితిని బట్టి వీరు రిస్కీ షాట్లకు వెళ్లకుండా, అడపాదడపా బౌండరీలతో పరుగులను రాబట్టారు. తొమ్మిదో ఓవర్‌లో శాంసన్ క్యాచ్‌ను తలత్ జారవిడిచాడు. స్పిన్నర్లు అబ్రార్, సయీమ్ ఓవర్లలో వీరు చెరో సిక్సర్‌తో ఆకట్టుకున్నారు. కానీ చక్కగా కుదురుకున్న ఈ జోడీని 13వ ఓవర్‌లో అబ్రార్ విడదీశాడు. శాంసన్ క్యాచ్‌ను ఫర్హాన్ పట్టేయడంతో నాలుగో వికెట్‌కు 57 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. డెత్ ఓవర్లలో తిలక్-దూబే ద్వయం జోరు పెంచింది. 15వ ఓవర్‌లో అతడి 4,6.. దూబే 4తో 17 రన్స్ వచ్చాయి. తర్వాతి ఓవర్‌లోనే దూబే సిక్సర్ బాదగా తిలక్ 41 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. కానీ 17వ ఓవర్‌లో పేసర్ షహీన్ కేవలం ఆరు పరుగులే ఇచ్చి ఉత్కంఠ పెంచాడు. అయితే దూబే సిక్సర్‌తో 18వ ఓవర్‌లో 13 రన్స్ వచ్చాయి. 19వ ఓవర్‌లో దూబే అవుటైనా.. ఆఖరి ఓవర్‌లో 10 రన్స్ కావాల్సిన వేళ తిలక్ 6, రింకూ (4 నాటౌట్)తో మ్యాచ్‌ను అద్భుతంగా ముగించారు.

స్పిన్ ధాటికి విలవిల

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఇన్నింగ్స్ ఆరంభానికి, ముగింపునకు పొంతన లేకుండా సాగింది. ఓపెనర్లు ఫర్హాన్, ఫఖర్ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి పరుగులు రాబట్టడంతో 180+ స్కోరు ఖాయమనిపించింది. అటు పేస్, స్పిన్ తేడా లేకుండా ఫర్హాన్ స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడు. అయితే తొలి పది ఓవర్ల పాటు పాక్ ఆధిపత్యమే సాగినా..స్పిన్నర్లు సరైన సమయంలో వికెట్లను పడగొట్టి భారత్‌కు రిలీఫ్‌నందించారు. కుల్దీప్ అయితే తన చివరి రెండు ఓవర్లలో ఏడు పరుగులే ఇచ్చి నాలుగు వికెట్లు తీయడం విశేషం. ఫీల్డింగ్‌లోనూ భారత్ అదుర్స్ అనిపించుకుంది. హార్దిక్ లేకపోవడంతో శివమ్ దూబే కొత్త బంతితో బౌలింగ్ ఆరంభించాడు. అటు బుమ్రాను మాత్రం ఫర్హాన్ ఎప్పటిలాగే అవలీలగా ఆడేశాడు. అతడు వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో 4,6తో 13 రన్స్ రాబట్టాడు. దీంతో పవర్‌ప్లేలో పాక్ 45 రన్స్ సాధించింది. అనంతరం కుల్దీప్ రెండు వరుస ఓవర్లలో ఫర్హాన్ ఒక్కో సిక్సర్‌తో ఒత్తిడి పెంచడమే కాకుండా, 35 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే ఈసారి తను గన్ సెల్యూట్ సంబరాల జోలికి మాత్రం పోలేదు. ఇక పదో ఓవర్‌లో మరో సిక్సర్‌తో జోరు చూపిన ఫర్హాన్‌ను వరుణ్ దెబ్బతీశాడు. పుల్‌తో భారీ షాట్‌కు ప్రయత్నించిన తను డీప్ మిడ్ వికెట్‌లో తిలక్‌కు క్యాచ్ ఇచ్చాడు. అప్పటికే తొలి వికెట్‌కు 84 పరుగులు జత చేరాయి. వచ్చీ రాగానే సయీమ్ అయూబ్ రెండు ఫోర్లతో ఆకట్టుకోగా.. ఫఖర్ మరో ఫోర్‌తో పాక్ 12 ఓవర్లలో వంద పరుగులతో పటిష్టంగా కనిపించింది. అయితే 13వ ఓవర్ నుంచి స్పిన్నర్ల ఉచ్చులో చిక్కుకుని పాక్ బ్యాటర్లు విలవిల్లాడారు. కుల్దీప్, అక్షర్, వరుణ్ తమ వరుస ఓవర్లలో వికెట్లను పడగొడుతూనే పోయారు. 17వ ఓవర్‌లోనైతే కుల్దీప్ ఏకంగా ముగ్గురిని పెవిలియన్‌కు చేర్చాడు. మొత్తంగా స్పిన్నర్ల ధాటికి 33 రన్స్ వ్యవధిలో పాక్ చివరి 8 వికెట్లను కోల్పోయింది.

ఒకే ఆసియాకప్ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కుల్దీప్ యాదవ్

పాక్‌పై తొమ్మిది సార్లు ఛేదనకు దిగిన ప్రతీసారి భారత్ గెలవడం విశేషం.

2019, డిసెంబరు నుంచి శివమ్ దూబే పాల్గొన్న చివరి 34 టీ20 మ్యాచ్‌ల్లోనూ భారత్ ఓడిపోలేదు.

పురుషుల టీ20 టోర్నీలను ఓటమి లేకుండా భారత్ దక్కించుకోవడం ఇది నాలుగోసారి. 2016 ఆసియా కప్, 2023 ఆసియాగేమ్స్, 2024 టీ20 వరల్డ్‌కప్ లోనూ ఇలాగే గెలిచింది.

ఆపరేషన్ సింధూర్..

'మైదానంలో ఆపరేషన్ సింధూర్. అదే ఫలితం.. భారత విజయం. క్రికెటర్లకు అభినందనలు'
- ప్రధాని నరేంద్ర మోదీ

పైక్రాఫ్ట్‌ను మార్చేశారు..

దుబాయ్: భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన ఆసియాకప్ ఫైనల్ మ్యాచ్‌కు రెఫరీగా ఆండీ పైక్రాఫ్ట్‌ను మార్చారు. అతడి స్థానంలో రిచీ రిచర్డ్‌సన్ బాధ్యతలు నిర్వహించాడు. ఈ రెండు జట్ల మధ్య జరిగిన గ్రూప్, సూపర్-4 మ్యాచ్‌లకు రెఫరీగా పైక్రాఫ్ట్ వ్యవహరించాడు. అయితే ఈనెల 21న భారత్‌తో మొదటి మ్యాచ్ తర్వాత పాక్ జట్టు పైక్రాఫ్ట్‌పై ఫిర్యాదు చేసింది. టాస్ సమయంలో పాక్ కెప్టెన్ సల్మాన్‌తో సూర్యకుమార్ కరచాలనం చేయకపోవడం తెలిసిందే. ఫైనల్ మ్యాచ్‌కు మాత్రం ఎటువంటి వివాదం చోటు చేసుకోకుండా రిచీ రిచర్డ్‌సన్‌ను రెఫరీగా నియమించింది.

ఇద్దరు కెప్టెన్లు చెరొకరితో..



దుబాయ్: ఫైనల్ మ్యాచ్ టాస్ సమయంలో అరుదైన దృశ్యం చోటు చేసుకుంది. సహజంగా టాస్ పడ్డాక ఇరు జట్ల కెప్టెన్లు అక్కడున్న ప్రెజెంటర్‌తో తమ అభిప్రాయాలను పంచుకుంటారు. కానీ అంతర్జాతీయ క్రికెట్‌లో తొలిసారిగా టాస్ ఇంటర్వ్యూను ఇద్దరు మాజీ ఆటగాళ్లు నిర్వహించడం గమనార్హం. భారత కెప్టెన్ సూర్యకుమార్ రవిశాస్త్రితో మాట్లాడగా, పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా.. వకార్ యూనిస్‌తో సంభాషించాడు. వాస్తవానికి సూర్య తమతో షేక్‌హ్యాండ్ నిరాకరించడంతో పాకిస్థాన్ జట్టు భారత్‌పై ఎలాగైనా పైచేయి సాధించాలనే కసితో ఉన్నట్టుంది. అందుకే టాస్ అప్పుడు రెగ్యులర్ ప్రెజెంటర్ రవిశాస్త్రితో తమ కెప్టెన్ సల్మాన్ మాట్లాడడని తెగేసి చెప్పింది. దీంతో అతడి స్థానంలో తటస్థ వ్యక్తిని నియమించాలని ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) బీసీసీఐని కోరింది. కానీ అందుకు భారత క్రికెట్ బోర్డు ససేమిరా అంది. అందుకే మధ్యేమార్గంగా శాస్త్రితో పాటు పాక్ మాజీ పేసర్ వకార్ యూనిస్‌ను కూడా టాస్ సమయంలో పంపారు.

స్కోరుబోర్డు

పాకిస్థాన్ : ఫర్హాన్ (సి) తిలక్ (బి) వరుణ్ 57, ఫఖర్ జమాన్ (సి) కుల్దీప్ (బి) వరుణ్ 46, అయూబ్ (సి) బుమ్రా (బి) కుల్దీప్ 14, మహ్మద్ హారిస్ (సి) రింకూసింగ్ (బి) అక్షర్ 0, సల్మాన్ ఆఘా (సి) శాంసన్ (బి) కుల్దీప్ 8, హుస్సేన్ తలత్ (సి) శాంసన్ (బి) అక్షర్ 1, మహ్మద్ నవాజ్ (సి) రింకూసింగ్ (బి) బుమ్రా 6, షహీన్ షా (ఎల్బీ) కుల్దీప్ 0, ఫహీమ్ అష్రఫ్ (సి) తిలక్ (బి) కుల్దీప్ 0, హారిస్ రౌఫ్ (బి) బుమ్రా 6, అబ్రార్ అహ్మద్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు : 7; మొత్తం 19.1 ఓవర్లలో 146 ఆలౌట్ ; వికెట్లపతనం :** 1-84, 2-113, 3-114, 4-126, 5-131, 6-133, 7-134, 8-134, 9-141 ; **బౌలింగ్ :** దూబే 3-0-23-0, బుమ్రా 3.1-0-25-2, వరుణ్ 4-0-30-2, అక్షర్ 4-0-26-2, కుల్దీప్ 4-0-30-4, తిలక్ వర్మ 1-0-9-0.

భారత్ : అభిషేక్ (సి) రౌఫ్ (బి) ఫహీమ్ అష్రఫ్ 5, గిల్ (సి) రౌఫ్ (బి) ఫహీమ్ అష్రఫ్ 12, సూర్యకుమార్ (సి) ఆఘా (బి) షహీన్ షా 1, తిలక్ వర్మ (నాటౌట్) 69, శాంసన్ (సి) ఫర్హాన్ (బి) అబ్రార్ 24, దూబే (సి) షహీన్ షా (బి) ఫహీమ్ అష్రఫ్ 33, రింకూసింగ్ (నాటౌట్) 4 ; **ఎక్స్‌ట్రాలు : 2 ; మొత్తం 19.4 ఓవర్లలో 150/5 ; వికెట్లపతనం :** 1-7, 2-10, 3-20, 4-77, 5-137 ; **బౌలింగ్ :** షహీన్ షా 4-0-20-1, ఫహీమ్ అష్రఫ్ 4-0-29-3, మహ్మద్ నవాజ్ 1-0-6-0, హారిస్ రౌఫ్ 3.4-0-50-0, అబ్రార్ అహ్మద్ 4-0-29-1, అయూబ్ 3-0-16-0.

బీసీసీఐ కొత్త అధ్యక్షుడిగా మిథున్ ఏకగ్రీవం

● సెలెక్షన్ కమిటీలో ఆర్‌పీ సింగ్, ఓజా

● మహిళల కమిటీలో స్రవంతి నాయుడు



మిథున్ మన్హాస్



ఓజా



స్రవంతి

ముంబై: ప్రపంచంలోనే అత్యంత ధనిక బోర్డు బీసీసీఐ 37వ అధ్యక్షుడిగా ఢిల్లీ మాజీ క్రికెటర్ మిథున్ మన్హాస్ (45) ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఆదివారం జరిగిన బోర్డు 94వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో కొత్తగా ఎన్నికైన ఆఫీసు బేరర్లను ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా రాజీవ్ శుక్లా, కార్యదర్శిగా దేవజిత్ సైకియా కొనసాగనున్నారు. కోశాధికారిగా భారత మాజీ స్పిన్నర్ రఘురామ్ భట్ బాధ్యతలు అందుకోనున్నాడు. ఐపీఎల్ చైర్మన్ పదవిని అరుణ్ ధూమల్ తిరిగి దక్కించుకున్నాడు. ఇక హైదరాబాద్‌కు చెందిన ప్రజ్ఞాన్ ఓఝా, స్రవంతి నాయుడు పురుషుల, మహిళల సెలెక్షన్ కమిటీల సభ్యులుగా ఎంపికయ్యారు.

రేసులో ఒక్కడే..

బోర్డు అధ్యక్షుడిగా మన్హాస్ ఒక్కడే నామినేషన్ వేయడంతో.. అతడి ఎన్నిక లాంఛనమే అయింది. 70 ఏళ్లు నిండిన రోజర్ బిన్నీ బోర్డు రాజ్యాంగం ప్రకారం అనర్హుడు కావడంతో.. అతడి వారసుడిగా మిథున్ బోర్డు పగ్గాలు అందుకోనున్నాడు. ఈ క్రమంలో బోర్డు చీఫ్‌గా సౌరవ్ గంగూలీ, బిన్నీ తర్వాత వరుసగా మూడో ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ కూడా మన్హాస్ కావడం విశేషం. 1997-98 నుంచి 2016-17 వరకు 20 ఏళ్లపాటు మన్హాస్ దేశవాళీ క్రికెట్ ఆడాడు. మిడిలార్డర్ బ్యాటర్, పార్ట్‌టైమ్ వికెట్ కీపర్‌గా ఢిల్లీ జట్టుకు సుదీర్ఘ కాలం సేవలందించాడు. 157 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 9,714 పరుగులు సాధించిన మన్హాస్.. 130 లిస్ట్-ఎ మ్యాచ్‌లు, 55 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. ఇక మౌలిక వసతుల కమిటీ సభ్యుడిగా ఆంధ్ర క్రికెట్ సంఘం కార్యదర్శి సానా సతీష్‌ను తీసుకున్నారు. ఈ కమిటీకి చైర్మన్‌గా ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ వ్యవహరించనున్నాడు.

సెలెక్షన్ కమిటీలో మార్పులు..

టీమిండియా మాజీ ఆటగాళ్లు ఆర్‌పీ సింగ్, ప్రజ్ఞాన్ ఓజాలకు సీనియర్ సెలెక్షన్ కమిటీలో చోటు దక్కింది. ఇప్పటి వరకు ఒక సభ్యుడిగా ఉన్న ఎస్. శరత్‌ను జూనియర్ సెలెక్షన్ కమిటీకి తిరిగి పంపారు. దీంతో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీలో భారత మాజీ ఆటగాళ్లు శివ సుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్‌పీ సింగ్, ఓజా ఉన్నారు. మహిళల సెలెక్షన్ ప్యానెల్ చైర్మన్‌గా నీతూ డేవిడ్ స్థానంలో అమిత శర్మను ప్రకటించారు. కాగా 2005-2014 మధ్యకాలంలో భారత్‌కు ఆడిన హైదరాబాద్ ప్లేయర్ స్రవంతి నాయుడు కమిటీ సభ్యురాలిగా ఎంపికైంది. ఆమె ఒక టెస్టు, నాలుగు వన్డేలు, ఆరు టీ20ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఇక మహిళల ప్రీమియర్ లీగ్ కమిటీ తొలి స్వతంత్ర చైర్మన్‌గా కేరళ క్రికెట్ సంఘం అధ్యక్షుడు జయేష్ జార్జ్ ఎంపికయ్యాడు.

బీసీసీఐ ఆఫీసు బేరర్లు:
మిథున్ మన్హాస్ (అధ్యక్షుడు), రాజీవ్ శుక్లా (ఉపాధ్యక్షుడు), దేవజిత్ సైకియా (కార్యదర్శి), ప్రభ్‌జీత్ భాటియా (జాయింట్ సెక్రటరీ), రఘురామ్ భట్ (కోశాధికారి)

పురుషుల సెలెక్షన్ కమిటీ:
అజిత్ అగార్కర్ (చైర్మన్), శివ సుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్‌పీ సింగ్, ప్రజ్ఞాన్ ఓజా

మహిళల సెలెక్షన్ కమిటీ:
అమిత శర్మ (చైర్‌పర్సన్), శ్యామా డే, సులక్షణ నాయక్, జయ శర్మ, స్రవంతి నాయుడు

14 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడితే.. అదనంగా కోటి

దేశవాళీ క్రికెట్‌ను మరింతగా ప్రోత్సహించేందుకు బీసీసీఐ మరిన్ని చర్యలు తీసుకొంది. ఒక సీజన్‌లో 14 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడికి మ్యాచ్ ఫీజు కింద అదనంగా రూ. కోటి అందించనుంది. అంతేకాకుండా అండర్-19, అండర్-16 ఆటగాళ్లు ఐపీఎల్‌లో ఆడే అర్హత సాధించాలంటే.. కనీసం ఒక ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడాలనే నిబంధనను తీసుకువచ్చారు.



మనమ్మాయిలు వచ్చేశారు!

● రేపు ప్రారంభ మ్యాచ్..మహిళల వన్డే వరల్డ్ కప్

గువాహటి : వన్డే ప్రపంచ కప్ ఆరంభ మ్యాచ్‌లో తలపడేందుకు భారత, శ్రీలంక మహిళల జట్లు ఆదివారం ఇక్కడకు చేరుకున్నాయి. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న మెగా టోర్నీ ఈనెల 30న ప్రారంభం కానుంది. బెంగళూరులో వామప్ మ్యాచ్‌లు ముగించుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ సేన సాయంత్రం విచ్చేసింది. తొలి వామప్ మ్యాచ్‌లో భారత జట్టు 153 పరుగుల తేడాతో ఐదుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. అయితే వెంటనే పుంజుకున్న హర్మన్ సేన శనివారం న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వామప్ పోటీలో నాలుగు వికెట్ల తేడాతో నెగ్గిన సంగతి తెలిసిందే. ఇక..చమరి ఆటపట్టు సారథ్యంలోని శ్రీలంక మధ్యాహ్నం ఇక్కడ అడుగుపెట్టింది. సోమవారం మధ్యాహ్నం ఆ జట్టు సాధనలో పాల్గొననుంది. భారత జట్టు సాయంత్రం సాధన చేయనుంది. మూడో ప్రపంచ కప్‌లో ఆడుతున్న ఆటపట్టు తన కెప్టెన్సీలో జట్టుకు టైటిల్ అందించాలని పట్టుదలగా ఉంది. అయితే ప్రస్తుత జట్టులోని 15 మందిలో 11 మంది క్రికెటర్లు తొలిసారి ప్రపంచ కప్ బరిలో దిగుతున్నారు.

సూర్య చరిష్మాకు టైటిల్

ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్

రాజమహేంద్రవరం అర్బన్ (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సూర్య చరిష్మా ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ మహిళల టైటిల్‌ను కైవసం చేసుకుంది. రాజమహేంద్రవరంలో ఆదివారం ముగిసిన ఈ పోటీల్లో సూర్య చరిష్మా హరియాణాకు చెందిన జియా రావత్‌పై నెగ్గింది. ఇక పురుషుల సింగిల్స్‌లో హరియాణాకు చెందిన భరత్ రాఘవ్ తమ రాష్ట్రానికే చెందిన రవిపై విజయం సాధించి టైటిల్ గెల్చాడు. విజేతలకు శాప్ చైర్మన్ రవినాయుడు బహుమతులు అందజేశారు.



అనుష్క 'డబుల్'

● రెండో స్వర్ణం కొల్లగొట్టిన భారత షూటర్

● అడ్రియన్‌కు రజతం ● జూ. వరల్డ్ కప్ షూటింగ్





అనుష్క

న్యూఢిల్లీ : వర్ధమాన షూటర్ అనుష్క థోకర్ ఐఎస్‌ఎస్‌ఎఫ్ జూనియర్ ప్రపంచ కప్‌లో అదరగొడుతోంది. టోర్నమెంట్ ఆమె రెండో స్వర్ణ పతకం చేజిక్కించుకుని భళా అనిపించింది. మహిళల 50మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో అనుష్క టైటిల్ దక్కించుకుంది. ఇదే కేటగిరీ పురుషుల విభాగంలో అడ్రియన్ కర్మాకర్ రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఈ రెండింటితో కలిపి టోర్నీలో ఇప్పటి వరకు భారత్ సాధించిన పతకాల సంఖ్య 13కి చేరింది. ఇందులో నాలుగు స్వర్ణాలు, ఆరు రజతాలు, మూడు కాంస్యాలున్నాయి. ఆదివారం ఇక్కడ జరిగిన మహిళల 50మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్లో 18 ఏళ్ల అనుష్క 461 పాయింట్లతో పసిడి పతకం అందుకుంది. టోర్నమెంట్‌లో ఇంతకుముందు అనుష్క మహిళల 50మీ. రైఫిల్ ప్రోన్‌లో బంగారు పతకం నెగ్గిన సంగతి తెలిసిందే. దాంతో ఆమె ఖాతాలో రెండో స్వర్ణం చేరింది. న్యూట్రల్ అథ్లెట్లు అనస్టాసిలా సోరోనిక (454.9) రజతం, మారియా క్రుగ్లోవా (444) కాంస్య పతకం చేజిక్కించుకున్నారు. పురుషుల 50 మీ. త్రీపీ విభాగంలో ఐదుగురు భారత షూటర్లు సహా మొత్తం 12 మంది తలపడ్డారు. అడ్రియన్ కర్మాకర్ 454.8 పాయింట్ల స్కోరుతో రజత పతకం సాధించాడు. న్యూట్రల్ అథ్లెట్లు డిమిత్రి పిమెనోవ్ (459.9) స్వర్ణం, కమిల్ నురియా ఖెమ్బోవ్ (441) కాంస్య పతకం గెలుపొందారు.

రుజ్జి వరల్డ్ రికార్డ్

● పురుషుల షాట్‌పుట్‌లో ఆరో స్వర్ణం

● వరల్డ్ పారా అథ్లెటిక్స్

న్యూఢిల్లీ : బల్గేరియాకు చెందిన రుజ్జి పురుషుల షాట్‌పుట్ ఎఫ్55 విభాగంలో వరుసగా ఆరోసారి స్వర్ణ పతకం దక్కించుకున్నాడు. ఈ క్రమంలో అతడు కొత్త ప్రపంచ రికార్డు సైతం నెలకొల్పాడు. ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో భాగంగా ఆదివారం జరిగిన పురుషుల షాట్‌పుట్ ఎఫ్55 విభాగం ఫైనల్లో 34 ఏళ్ల రుజ్జి 12.94 మీ. గుండును విసిరి కొత్త ప్రపంచ రికార్డ్‌తో పసిడి పతకం అందుకున్నాడు. దాంతో 2023 పారిస్ వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో తానే నెలకొల్పిన 12.68 మీ. గత ప్రపంచ రికార్డును బల్గేరియన్ బద్దలుగొట్టాడు. సెర్బియాకు చెందిన నెబోజెసా డ్యూరిచ్ (12.52మీ.) రజతం, లెచ్ స్టోల్ట్‌మన్ (పోలెండ్, 12.02మీ.) కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. ఇక..రెండో రోజు పోటీలలో రుజ్జితో కలిపి మూడు ప్రపంచ రికార్డులు కొత్తగా నమోదయ్యాయి. మలేసియాకు చెందిన అబ్దుల్ లతీఫ్ పురుషుల లాంగ్‌జంప్ టీ20 విభాగంలో 7.67 మీ. నయా వరల్డ్ రికార్డ్‌తో పసిడి పతకం చేజిక్కించుకున్నాడు. వ్లోదిమిర్ పోనోమరెంకో (ఉక్రెయిన్) పురుషుల షాట్‌పుట్ టీ12లో 17.39 మీ. దూరం గుండును విసిరి కొత్త ప్రపంచ రికార్డ్‌తో విజేతగా నిలిచాడు. మహిళల డిస్కస్ త్రో ఎఫ్57 విభాగంలో నసీమా (అల్జీరియా) 34.54మీ. దూరంతో స్వర్ణం కైవసం చేసుకుంది. మహిళల ఐదు వేల మీటర్ల టీ54 పరుగులో డెబ్రూనర్ (స్విట్జర్లాండ్) పసిడి పతకం సాధించింది. పురుషుల ఐదు వేల మీ.టీ54 రేస్‌లో హనాక్ (బ్రిటన్) స్వర్ణం గెలుపొందాడు.

భారత్‌కు నిరాశ..

రెండో రోజు పోటీలలో భారత అథ్లెట్లు పూర్తిగా నిరాశ పరిచారు. పురుషుల లాంగ్‌జంప్ టీ47లో వికాస్, అజయ్ సింగ్, పురుషుల జావెలిన్ ఎఫ్37లో ప్రవీణ్ కుమార్, హేమ్‌చంద్ర, పురుషుల 100మీ. టీ37లో రాకేష్, శ్రేయాన్ష్ పూర్తిగా విఫలమయ్యారు.



రుజ్జి

ప్రపంచ కప్ ఆరంభోత్సవంలో గర్గ్‌కు సంగీత నివాళి

గువాహటి: ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్ ఆరంభోత్సవంలో.. ఇటీవలే మరణించిన అసోం ప్రముఖ సింగర్ జుబీన్ గర్గ్‌కు సంగీత నివాళులర్పించనున్నారు. అసోం క్రికెట్ సంఘం (ఏసీఏ) స్టేడియంలో మంగళవారం భారత్, శ్రీలంక మధ్య మెగా టోర్నీ ఆరంభ మ్యాచ్ జరగనుంది. ఈ సందర్భంగా జుబీన్ అభిమానుల కోసం ఐదువేల టిక్కెట్లను ఉచితంగా అందించనున్నట్టు ఏసీఏ అధికారి ఒకరు తెలిపారు. ఈ నెల 19న సింగపూర్‌లో సముద్రంలో ఈత కొడుతుండగా గర్గ్ మరణించాడు.

www.andhrajyothy.com
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 29-9-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



గరుడ వాహనంపై ఊరేగుతున్న మలయప్పస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

తిరువీధుల మెరసీ దేవదేవుడు

తిరుమలలో కన్నుల పండువగా గరుడోత్సవం

పరవశించిన భక్తకోటి 3

భారత్ విజయ 'తిలక'ం

పాక్‌కు పరాభవం

గెలిపించిన తెలుగోడు తిలక్ వర్మ

ఆసియా కప్ మనదే స్పోర్ట్స్ పేజీలో..



తిలక్ వర్మ



హైదరాబాద్‌లో తనను పరామర్శించేందుకు ఇంటికొచ్చిన సీఎం చంద్రబాబుకు ఆరోగ్యం గురించి వివరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్

సమర్థత, అనుభవం ఫలితమే

చార్జీల తగ్గింపు

- విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టాం.. రూ.1,000 కోట్లు ఆదా చేశాం
- తక్కువ ధరకు కరెంటు కొనుగోళ్లు, సమర్థ నిర్వహణతోనే సాధ్యమైంది
- 'యోగాంధ్ర'ను మించిన స్థాయిలో 'సూపర్ జీఎస్‌టీ.. సూపర్ సేవింగ్స్'
- అసెంబ్లీకి వైసీపీ డుమ్మా.. మండలిలో డ్రామా.. ఫేక్ ప్రచారమే ఆ పార్టీ రాజకీయానికి పునాది.. ఏ ఎన్నికలొచ్చినా కూటమే గెలవాలి: సీఎం
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్ 12

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

- త్వరగా కోలుకుని రండి.. పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు పరామర్శ
- 'ఆటోడ్రైవర్ల సేవలో'పై చర్చ.. స్త్రీశక్తిలాగే ఈ పథకానికీ జనం మన్ననలు
- డిప్యూటీ సీఎం ఆశాభావం.. ప్రధాని రాష్ట్ర పర్యటనపైనా ఇరువురి చర్చ

₹లక్ష కోట్ల భూములు

ఏమయ్యాయి?

13 ఏళ్లలో 1,82,270 ఎకరాలు కేటాయింపు

ఉమ్మడి రాష్ట్రంలో 2012లో ఆంధ్రప్రదేశ్ భూ కేటాయింపు విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి గత 13 ఏళ్లలో పెద్ద ఎత్తున భూములు ఇచ్చారు. ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు, సంస్థలు, వ్యక్తులకు 1,82,270 ఎకరాలు కేటాయించారు. వీటి విలువ దాదాపు లక్ష కోట్ల రూపాయలు. గత జగన్ ప్రభుత్వంలో అయితే కారుచౌకగా వేల ఎకరాలు కట్టబెట్టారు. ఈ మొత్తం భూముల్లో ఎంతవరకు సద్వినియోగం చేసుకున్నారు? దుర్వినియోగం ఎంత? అన్నది పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది.



- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు, రైల్వేకు
- ఏపీఐఐసీ, నెడ్‌క్యాప్‌కే లక్ష ఎకరాలకు పైగా
- విద్యుదుత్పత్తి ప్రాజెక్టులకు 42,084 ఎకరాలు
- జగన్ ప్రభుత్వంలో కారుచౌకగా కేటాయింపులు
- ఈ మొత్తం భూముల్లో సద్వినియోగం ఎంత?
- దుర్వినియోగం ఎంతన్న దానిపై సర్కారు పరిశీలన
- ఆ తర్వాత భూకేటాయింపు పాలసీలో మార్పులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

భూమి అత్యంత ఖరీదైన సహజ వనరు. ఏటా జనాభా పెరుగుతుంది కానీ భూమి మాత్రం ఎప్పటికీ అంతే ఉంటుంది. అవసరాలకు తగినట్టు ఎంత జాగ్రత్తగా వాడుకుంటే అంతగా ఫలితాలు ఉంటాయి. అలాంటి భూమిని నిర్దిష్ట ప్రయోజనాలను ఆశించి ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలకు కేటాయించాక వాటి ఫలితాలు వచ్చాయా? లేదా దుర్వినియోగం జరిగిందా? అంటే.. ల్యాండ్ బ్యాంక్ తరిగిపోతోంది కానీ వాటి ఫలితాలు ఆచరణలో ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో భూ కేటాయింపులు, వాటి ప్రయోజనాలు, దుర్వినియోగం వంటి అంశాలను కూలంకషంగా పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ భూకేటాయింపు విధానం-2012 అమల్లోకి వచ్చినప్పటి నుంచి

మిగతా 13వ పేజీలో...

ఎఫ్-1, ఓపీటీ విద్యార్థులు **లక్ష డాలర్లు కట్టనక్కర్లేదు**
హెచ్-1బీ కోసం.. 2

గ్యాస్ సిలిండర్‌కూ పోర్టబులిటీ!

» అభిప్రాయ సేకరణ చేస్తున్న పీఎన్‌జీఆర్‌బీ




న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: మీ వంట గ్యాస్ సిలిండర్ ఇచ్చే కంపెనీతో/ఏజెంట్‌తో ఇబ్బందులున్నాయా? అయితే, వారిని వెంటనే మార్చేసుకోండి. మొబైల్ నంబరును ఇష్టమొచ్చిన సర్వీస్ ప్రొవైడర్‌కు ఎలా మార్చుకోవచ్చో అలాగే ఇకపై గ్యాస్ ఏజెన్సీని కూడా మార్చేసుకోవచ్చు. ఈ సేవలు త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. గ్యాస్ ఏజెన్సీలను మార్చుకునేందుకు మొబైల్ పోర్టబులిటీ తరహా సేవలను త్వరలో అందుబాటులోకి తేనున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించి వినియోగదారులు, భాగస్వామ్య పక్షాల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు పెట్రోలియం మరియు సహజ వాయువు నియంత్రణ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) వెల్లడించింది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం 2013లోనే పైలట్ ప్రాజెక్టు కింద 24 జిల్లాలో పోర్టబులిటీ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఆ తర్వాత 2014లో 13 రాష్ట్రాల్లోని 480 జిల్లాల్లో ఈ పైలట్ ప్రాజెక్టును విస్తరించింది. ఆ పైలట్ ప్రాజెక్టులో కూడా గ్యాస్ ఏజెన్సీలను మార్చుకోగలరు కానీ, కంపెనీలను మార్చుకునే అవకాశం ఇవ్వలేదు. కానీ, ఇకపై ఏజెన్సీలతో పాటు కంపెనీలను కూడా మార్చుకునేలా ఇంటర్ పోర్టబులిటీ సేవలను అందుబాటులోకి తేవాలని పీఎన్‌జీఆర్‌బీ నిర్ణయించింది. ఈ మేరకు భాగస్వామ్య పక్షాలు, వినియోగదారుల నుంచి అభిప్రాయ సేకరణను మొదలుపెట్టింది. ఆ తర్వాత నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించి దేశ వ్యాప్తంగా ఎల్‌పీజీ పోర్టబులిటీ సేవల అమలుకు ఒక తేదీని నిర్ణయిస్తామని వెల్లడించింది.

రేబిస్‌కు ప్రతి 9 నిమిషాలకొకరు బలి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: రేబిస్ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా ప్రతి తొమ్మిది నిమిషాలకు ఒకరిని బలిగొంటోందని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. అత్యవసరంగా వ్యాక్సినేషన్, అవగాహన చేపట్టాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. ప్రపంచవ్యాప్త మరణాల్లో మూడో వంతు భారతదేశంలోనే జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దేశంలో వీధికుక్కల సంఖ్య కోట్లలో ఉండటమే దీనికి కారణం. రేబిస్ సంక్రమణను అడ్డుకునేందుకు కుక్కలకు సామూహికంగా వ్యాక్సినేషన్, పీఈపీ(పోస్ట్-ఎక్స్‌పోజర్ ప్రొఫైలాక్సిస్) సకాలంలో అందడం కీలకమని ప్రపంచ రేబిస్ దినోత్సవం(సెప్టెంబరు 28) సందర్భంగా డబ్ల్యూహెచ్‌వో పునరుద్ఘాటించింది. ఐడీఎస్‌పీ(ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్) కింద పార్లమెంటుకు సమర్పించిన సమాచారం మేరకు 2024 సంవత్సరంలో భారతదేశంలో 37 లక్షల కుక్క కాటు కేసులు, 54 అనుమానిత రేబిస్ మరణాలు సంభవించాయి. ఇక 2023లో 286 రేబిస్ సంబంధిత మరణాలు సంభవించాయని డీఏహెచ్‌డీ(పశు సంవర్ధక, డెయిరీ విభాగం) నివేదించింది. కాగా, 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా రేబిస్‌ను అంతమొందించాలనే లక్ష్యానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఎన్ఆర్‌సీపీ(జాతీయ రేబిస్ నియంత్రణ కార్యక్రమం) ద్వారా ప్రభుత్వం ప్రజల్లో అవగాహనను పెంపొందిస్తోందని, వ్యాక్సిన్ అందుబాటులో ఉండేలా చూస్తోందని పేర్కొన్నారు. కాగా, వ్యాక్సినేషన్ 70% సాధిస్తే.. రేబిస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేయొచ్చని పలు దేశాల్లో నిరూపితమైంది.

లోకం తీరు



ఎఫ్-1, ఓపీటీ విద్యార్థులు హెచ్-1బీ కోసం..

లక్ష డాలర్లు కట్టనక్కర్లేదు

» ఇప్పటికే అమెరికాలో ఉద్యోగం చేస్తున్నవారు మరో ఉద్యోగానికి మారినా మినహాయింపు

» హెచ్4 (డిపెండెంట్) వీసాపై ఉన్నవారికీ వర్తించదు

» కొత్తగా హెచ్-1బీ వీసా జారీ కోసమే లక్ష డాలర్ల ఫీజు

» స్పష్టత ఇచ్చిన అమెరికా ఇమిగ్రేషన్ నిపుణులు

అమెరికాలో ఎఫ్-1 వీసాతో చదువుతున్న విద్యార్థులు, ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)లో ఉన్న అభ్యర్థులు హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే లక్ష డాలర్ల ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని అమెరికా ఇమిగ్రేషన్ నిపుణులు వెల్లడించారు. కొత్తగా హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే ఆ ఫీజు వర్తిస్తుందని స్పష్టం చేశారు. శనివారం రాత్రి హైదరాబాద్ బేగంపేటలోని ప్రజాభవన్‌లో 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' కార్యక్రమంలో భాగంగా హెచ్-1బీ ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్-1బీ వీసాల కొత్త ఫీజుపై సందేహాలను యూఎస్‌ఏ ఇమిగ్రేషన్ నిపుణులు నివృత్తి చేశారు. భారత్ సహా ఇతర దేశాల నుంచి కొత్తగా అమెరికా హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారికి మాత్రమే లక్ష డాలర్ల ఫీజు వర్తిస్తుందని వారు స్పష్టత ఇచ్చారు. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగం చేస్తూ ఇతర సంస్థలకు మారితే ఈ ఫీజు వర్తించదని తెలిపారు. హెచ్-4 (డిపెండెంట్) వీసాపై ఇప్పటికే అమెరికాలో ఉన్న వారు హెచ్-1బీ కోసం దరఖాస్తు చేసుకుంటే లక్ష డాలర్ల ఫీజు నుంచి మినహాయింపు ఉంటుందని వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో అమెరికా నుంచి జూమ్ ద్వారా వర్జీనియా స్టేట్ సెన్సస్ కమిషనర్ శ్రీధర్ నాగిరెడ్డి, అమెరికా రిపబ్లికన్ పార్టీ నాయకుడు బంగారు రెడ్డి పాల్గొనగా.. ప్రజాభవన్‌లో అమెరికా ఇమిగ్రేషన్ అటార్నీ జాష్ డార్లింపెల్, ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ వినోద్ కుమార్, ఇమిగ్రేషన్ నిపుణుడు హరికృష్ణ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నక్సలైట్లపై కాల్పులు విరమించం

» వారి ప్రతిపాదనను అంగీకరించేది లేదు: అమిత్ షా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నామంటూ మావోయిస్టులు చేసిన ప్రతిపాదనను అంగీకరించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఒకవేళ వారు లొంగిపోయి, ఆయుధాలను అప్పగిస్తామంటే మాత్రం స్వాగతిస్తామని తెలిపారు. అలాంటప్పుడు భద్రతా బలగాలు వారిపై ఒక్క తూటాను కూడా పేల్చవని తెలిపారు. కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నామని దాదాపు పక్షం రోజుల క్రితం నక్సలైట్లు చేసిన ప్రకటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. నక్సల్ ముక్త్ భారత్‌పై ఆదివారం ఇక్కడ జరిగిన సదస్సు ముగింపు కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగిస్తూ "ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి ఇటీవల నక్సలైట్లు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంతవరకు జరిగిందంతా పొరపాటని అందులో పేర్కొన్నారు. కాల్పుల విరమణ ప్రకటించాలని, తామంతా లొంగిపోతామని చెప్పారు. నేనేమి చెబుతున్నానంటే కాల్పుల విరమణ ఉండబోదు. ఒక వేళ వారు లొంగిపోతే కాల్పుల అవసరమే రాదు. ఆయుధాలు అప్పగిస్తే ఒక్క తూటాను కూడా 'పేల్చం" అని విస్పష్టంగా చెప్పారు. నక్సలైట్లు లొంగిపోతే వారికి ఎర్ర తివాచీ పరుస్తామని, ఆకర్షణీయమైన పునరావాస పథకాన్ని కూడా అమలు చేస్తామని ప్రకటించారు. నక్సలైట్ల కాల్పుల విరమణ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. 2026 మార్చి 31నాటికి దేశం నక్సలిజం నుంచి విముక్తి పొందుతుందని పునరుద్ఘాటించారు.

లద్దాఖ్ ప్రజలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడి

» భయపెట్టే ధోరణి మానుకోవాలి: రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: లద్దాఖ్‌లో చోటుచేసుకున్న ఘటనలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. లద్దాఖ్ ప్రజలపై, వారి సంస్కృతీ సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నాయని ఆరోపించారు. "లద్దాఖ్ ప్రజలు తమ గొంతు వినిపించాలనుకున్నారు. సమాధానం ఆశించారు. కానీ, ఇందుకు సమాధానంగా బీజేపీ నలుగురు వ్యక్తులను చంపి, ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్‌ను జైల్లో పెట్టింది" అని 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు. ఈ హింసను వెంటనే ఆపాలని, భయపెట్టే ధోరణిని మానుకోవాలని డిమాండ్ చేశారు. లద్దాఖ్‌కు తమ వాణి వినిపించే అవకాశం ఇవ్వాలని, ఆ ప్రాంతాన్ని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని అన్నారు. కాగా, లేహ్‌లో ఆదివారం ఐదో రోజు కూడా కర్ఫ్యూ కొనసాగింది. అయితే పౌరుల రోజువారీ పనుల కోసం 4 గంటలపాటు సడలించారు.

నాకు మాటలు రావు.. చెవులు వినపడవు.. మెసేజ్ పంపినప్పుడు దయచేసి చూడండి!

» కస్టమర్‌కు జొమాటో డెలివరీ బాయ్ మెసేజ్.. వైరల్



డెలివరీ బాయ్ మెసేజ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: అంగవైకల్యంతో బాధపడుతున్నా.. కుటుంబ పోషణ కోసం ఫుడ్ డెలివరీ బాయ్ అంకిత భావం నెటిజన్ల హృదయాలను గెలుచుకున్నది. ఓ కస్టమర్‌కు ఆయన పంపిన టెక్స్ మెసేజ్ సోషల్ మీడియాలో వైరలైంది. కొద్ది సేపట్లోనే 9 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. 'జొమాటో' ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న వ్యక్తి తన కస్టమర్‌కు పంపిన టెక్స్ మెసేజ్ అందరినీ ఆలోచింప జేసింది. 'నేను మీ ఆర్డర్ తీసుకొస్తున్నా.. త్వరగానే మీకు అందజేస్తా' అని పేర్కొంటూ.. 'హలో.. నేను మూగవాడిని. ఇతరుల మాటలు వినలేని చెవిటి వాడిని. మీ చిరునామాకు వచ్చాక మెసేజ్ చేస్తాను. అది దయచేసి చూడండి' అని పెట్టిన టెక్స్ సందేశం స్క్రీన్‌షాట్‌ను స్తుతి అనే యూజర్.. 'కుటుంబం కోసం ఓ వ్యక్తి పడే కష్టాలు' అనే క్యాప్షన్‌తో 'ఎక్స్'లో పోస్టు చేశారు. దీనిపై స్పందించిన నెటిజన్లు.. ప్రతికూల పరిస్థితుల్లోనూ డెలివరీ భాయ్ తన డ్యూటీ పట్ల దృఢ నిశ్చయాన్ని కొనియాడారు.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురి మృతి

సౌత్‌పోర్ట్, సెప్టెంబరు 28: అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం రేపాయి. నార్త్ కరోలినాలోని ఓ బార్ వద్ద శనివారం రాత్రి జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, ఎనిమిది మంది గాయపడ్డారు. సౌత్‌పోర్టులోని వాటర్‌ఫ్రంట్ బార్ వద్దకు ఓ బోటు వచ్చింది. అందులోని వ్యక్తి ఒక్కసారిగా బార్‌పైకి కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ముగ్గురు మరణించగా, పలువురు గాయపడ్డారు. కాల్పుల అనంతరం నిందితుడు అదే బోటులో పారిపోయినట్లు అధికారులు తెలిపారు. సమీపంలోని ఓ ఐలాండ్ వద్ద నిందితుడిగా అనుమానిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

కల్లోల కరూర్..!

తొక్కిసలాటలో 40కి పెరిగిన మృతులు..ఆస్పత్రిలో 50 మందికి చికిత్స

» బాధితులకు సీఎం స్టాలిన్ పరామర్శ

» 2 లక్షల పరిహారం ప్రకటించిన మోదీ

» మృతుల కుటుంబాలకు 20 లక్షల చొప్పున అందజేస్తానన్న విజయ్


కరూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలు

చెన్నై, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): చెల్లాచెదురుగా పడి ఉన్న చెప్పులు.. చిరిగిన పార్టీ జెండాలు.. విరిగిన స్తంభాలు.. నలిగిపోయిన మంచినీటి బాటిళ్లు.. తమిళనాట కరూర్‌లోని వేలుచ్చామిపురం ప్రాంతంలో ఆదివారం నెలకొన్న పరిస్థితి ఇది. సినీనటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ పర్యటన సందర్భంగా శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో మృతుల సంఖ్య 40కి పెరిగింది. కరూర్ ప్రభుత్వాస్పత్రి అత్యవసర చికిత్సా విభాగంలో చికిత్స పొందుతున్న కవిన్(31) ఆదివారం మధ్యాహ్నం మృతిచెందినట్లు అధికారులు ప్రకటించారు. మరో 50మంది వరకూ క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ దుర్ఘటనలో మృతుల కుటుంబాలను కలుసుకుని ఓదార్చేందుకు, గాయపడినవారిని పరామర్శించేందుకు అనుమతించాలంటూ పోలీసులను విజయ్ కోరారు. ఈ ఘటన సమాచారం తెలియగానే సీఎం స్టాలిన్ శనివారం రాత్రి 11 గంటలకు సచివాలయానికి వెళ్లి అధికారులతో సమీక్షించారు. ఆదివారం వేకువజాము కరూర్ ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. పోస్టుమార్టం విభాగం వద్ద మృతులకు నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సీఎం పరామర్శించారు. కాగా, మృతులకు నివాళులర్పిస్తూ కరూర్‌లో వ్యాపారులు ఆదివారం స్వచ్ఛందంగా బంద్ పాటించారు.

నివేదిక కోరిన అమిత్‌షా

కరూర్ దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దీనికి సంబంధించిన సమగ్ర నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వు జారీ చేశారు. సభ కోసం స్థలం ఎంపిక, పోలీసులు కల్పించిన భద్రతా ఏర్పాట్లు, టీవీకే పార్టీకి విధించిన నిబంధనలు, తొక్కిసలాట జరగటానికి గల కారణాలు తదివివరాలతో సమగ్రమైన నివేదికను పంపాలని గవర్నర్ ఆర్ఎన్ రవి కూడా ప్రభుత్వాన్ని ఆదేశించారు.

ఎలా ఓదార్చాలో తెలియడం లేదు: విజయ్

కరూర్ పర్యటన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మృతి చెందినవారి కుటుంబ సభ్యులకు రూ.20లక్షలు, గాయపడినవారికి రూ.2లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు విజయ్ ప్రకటించారు. ఈ ప్రమాదం తనకు తీవ్ర దిగ్భ్రాంతిని, మనోవేదనను కలిగించిందని పేర్కొన్నారు. ఆత్మీయులను కోల్పోయి బాధపడుతున్నవారిని తలచుకుని తీవ్రంగా ఆవేదన చెందుతున్నానని, వారిని ఎలా ఓదార్చాలో తెలియక కన్నీటి పర్యంతమవుతున్నానని తెలిపారు. ఈ దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి ప్రకటించిన ప్రధాని మోదీ.. బాధిత కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున సాయం అందించనున్నట్లు ప్రకటించారు. ఇక తమిళనాడు కాంగ్రెస్ పార్టీ కూడా మృతుల కుటుంబీకులకు, క్షతగాత్రులకు కలిపి మొత్తం రూ.కోటి సాయం ప్రకటించింది.

రాజకీయాలు వద్దు: సీఎం స్టాలిన్

కరూర్ దుర్ఘటనపై రాజకీయపరమైన వ్యాఖ్యలు చేయదలచుకోలేదని, బాధితులను కాపాడటం, మృతుల కుటుంబాలను ఓదార్చి, వారిని అన్ని విధాలా ఆదుకోవడమే తన కర్తవ్యంగా భావిస్తున్నానని సీఎం స్టాలిన్ అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదనే విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా చెన్నై నీలాంగరైలోని టీవీకే నేత విజయ్ నివాసగృహాన్ని ఆదివారం ఉదయం డీఎంకే విద్యార్థి విభాగం కార్యకర్తలు ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా 50మంది కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, కరూర్‌లో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని, తగిన భద్రత కల్పించలేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు.

సీబీఐ విచారణకు ఆదేశించండి: టీవీకే పిటిషన్

కరూర్ దుర్ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించాలని టీవీకే కోరింది. చెన్నైలోని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ దండపాణి నివాసగృహానికి వెళ్లిన ఆ పార్టీ డిప్యూటీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశారు. విజయ్ పర్యటన సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నాయని, పోలీసులు తగినంత భద్రత కల్పించలేదని అందులో ఆరోపించారు. ఆ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి.. సోమవారం మధ్యాహ్నం హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో విచారణ జరిపేందుకు అంగీకరించారని నిర్మల్‌కుమార్ తెలిపారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కేంద్ర పరిశీలకులు!

» బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో జరగనున్న ఉప ఎన్నికలపై ఈసీ దృష్టి

» ఎన్నికల పరిశీలనకు 470 మంది అధికారులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికపై కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) దృష్టి సారించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఖాళీ అయిన ఈ స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ కసరత్తు చేస్తోంది. బిహార్‌తో పాటు జూబ్లీహిల్స్, ఖాళీగా ఉన్న మరికొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరగనున్న ఎన్నికలకు కేంద్ర పరిశీలకులను నియమిస్తున్నట్లు ఈసీ ఆదివారం ప్రకటించింది. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకే పరిశీలకులను నియమిస్తున్నట్లు వెల్లడించింది. బిహార్ శాసనసభ ఎన్నికలు; మరికొన్ని రాష్ట్రాల్లోని 7 అసెంబ్లీ స్థానాలతో పాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికలను పర్యవేక్షించేందుకు దేశవ్యాప్తంగా వివిధ సర్వీసులకు చెందిన 470 మంది సీనియర్ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపింది. వీరు ప్రధానంగా అభ్యర్థులు చేసే ఎన్నికల ఖర్చుపై ప్రత్యేక నిఘా పెడతారు. బిహార్ ఎన్నికలతోపాటు జూబ్లీహిల్స్; జమ్మూకశ్మీరులోని బుద్గాం, నౌగ్రోటా; రాజస్థాన్‌లోని అంటా; ఝార్ఖండ్‌లోని ఘాట్‌శిల; పంజాబ్‌లోని తరన్ తారన్; మిజోరంలోని దంప; ఒడిసాలోని నువాపడ నియోజకవర్గాల్లో జరిగే ఉప ఎన్నికల్లో ఈ పరిశీలకులు విధులు నిర్వహిస్తారని ఈసీ వెల్లడించింది. ఇదిలా ఉండగా, బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ ప్రత్యేక వ్యూహం రచిస్తోంది. 'మిషన్ బిహార్ విజయం' కోసం కొందరు కేంద్ర మంత్రులతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన 45 మంది ఎంపీలు, సీనియర్ నేతలను నియమించింది. రాష్ట్రంలోని 40 లోక్‌సభ స్థానాల్లో ఒక్కో సీటును వారికి అప్పగించారు. ప్రతి నాయకుడు ఆరేసి అసెంబ్లీ సెగ్మెంట్లను పర్యవేక్షిస్తారు.

భారత్‌ను సరిదిద్దాల్సిన అవసరం ఉంది

» అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: భారత్‌ను లక్ష్యంగా చేసుకొని అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ మరోసారి రెచ్చిపోయారు. భారత్‌ను సరిదిద్దాల్సిన అవసరం ఉందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తమ దేశ కంపెనీలకు భారతదేశం తన మార్కెట్లను తెరవాలని, అమెరికా ప్రయోజనాలకు భంగం కలిగించని విధంగా చర్యలు తీసుకోవాలని ఆదివారం ఆయన ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. స్విట్జర్లాండ్, బ్రెజిల్, భారత్ సహా అమెరికా వాణిజ్య భాగస్వాములైన కొన్ని దేశాలను సరిదిద్దాల్సి ఉందన్నారు. "ఇవన్నీ అమెరికా విషయంలో సరిగ్గా స్పందించాల్సి దేశాలు. మీ మార్కెట్లను తెరవండి. అమెరికా ప్రయోజనాలకు భంగం కలిగించే విధానాలు వెంటనే ఆపేయండి.ఇలాంటి వాటివల్లే మేము వారితో విభేదిస్తున్నాం"అని హోవార్డ్ తెలిపారు. అమెరికా వినియోగదారులకు భారత్ తన ఉత్పత్తులను విక్రయించాలని భావిస్తే అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయానికి అనుగుణంగా నడుచుకోవాలని తేల్చిచెప్పారు.

ట్రంప్‌కు పెట్టె చూపి.. బుట్టలోకి..!

» అమెరికా పెట్టుబడులకు పాక్ వ్యూహం

» గిఫ్ట్‌గా అరుదైన ఖనిజాల పెట్టె

వాషింగ్టన్, సెప్టెంబరు 28: అమెరికా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు వాషింగ్టన్‌తో ఇస్లామాబాద్ సంబంధాలను బలోపేతం చేసుకునే దిశగా పాకిస్తాన్ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను శ్వేత సౌధంలో కలిసిన పాక్ ప్రధాని షరీఫ్, ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్.. అరుదైన ఖనిజాలతో కూడిన ఓ చెక్క పెట్టెను ఆయనకు బహూకరించారు. ఆ పెట్టెలోని ఖనిజాలను చూపుతూ ఆసిం మునీర్ వివరిస్తుండగా.. ట్రంప్ ఆసక్తిగా తిలకించారు. దీనికి సంబంధించిన ఫొటోను తాజాగా విడుదల చేసిన శ్వేత సౌధం.. ఇది రెండు దేశాల మధ్య సానుకూల పరిణామంగా అభివర్ణించింది. అయితే కొద్దిరోజుల ముందే పాక్‌లో అరుదైన ఖనిజాల వెలికితీతకు అమెరికాకు చెందిన ఓ కంపెనీ 500 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు ఎంఓయూ కుదుర్చుకుంది.

ఇరాన్‌పై మళ్లీ 'స్నాప్‌బ్యాక్' ఆంక్షలు

దుబాయ్, సెప్టెంబరు 28: వివిధ రకాల ఆంక్షలు, అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో ఇప్పటికే కుదేలైన ఇరాన్‌పై ఐక్యరాజ్యసమితి మరోసారి ఆంక్షలు విధించింది. ఇరాన్ అణ్వాయుధాల తయారీకి వీలయ్యే స్థాయిలో యురేనియం శుద్ధి చేపడుతోందన్న కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. దాని ప్రకారం విదేశాల్లోని ఇరాన్ ఆస్తులన్నీ ఫ్రీజ్ అవుతాయి. ఆ దేశంతో అన్ని రకాల ఆయుధ ఒప్పందాలు నిలిచిపోతాయి. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి అభివృద్ధి కార్యక్రమాన్ని ఆపేయాల్సి ఉంటుంది. లేకుంటే మరిన్ని ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇరాన్‌పై స్నాప్‌బ్యాక్ ఆంక్షల విధింపు కోసం ఫ్రాన్స్, జర్మనీ, యూకే సుమారు నెల రోజుల కిందే ఐక్యరాజ్యసమితిలో ప్రతిపాదన తెచ్చాయి. దానిపై తాజా సమావేశాల్లో విస్తృతంగా చర్చ జరిగింది. తమపై ఆంక్షల విధింపును ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకించింది.

అవినీతి కేసులో చైనా మాజీ మంత్రికి మరణశిక్ష

» నిందితుడు నేరాన్ని ఒప్పుకోవడంతో రెండేళ్ల పాటు శిక్ష నిలిపివేత



బీజింగ్, సెప్టెంబరు 28: భారీ మొత్తంలో లంచాలు స్వీకరించిన కేసులో చైనా వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మాజీ మంత్రి టాంగ్ రెంజియన్‌కు ఆ దేశ కోర్టు ఆదివారం మరణశిక్ష విధించింది. కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా కూడా పనిచేసిన టాంగ్ 2007 నుంచి 2024 వరకు కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో నిర్వర్తించిన వివిధ పదవులను ఉపయోగించుకుని వ్యాపారాలు, ప్రాజెక్టు కాంట్రాక్టులు, ఉద్యోగ బదిలీలు వంటి విషయాల్లో ఇతరులకు సహకరించి, బదులుగా సుమారు రూ.334 కోట్ల విలువైన నగదు, ఆభరణాలు స్వీకరించారని కోర్టు తెలిపింది. టాంగ్ చేసిన నేరాలు దేశం, ప్రజల ప్రయోజనాలకు తీవ్రమైన నష్టం కలిగించాయని, అందువల్ల ఆయన మరణశిక్షకు అర్హుడని తీర్పులో పేర్కొంది. అయితే టాంగ్ తన నేరాలను అంగీకరించడంతో రెండేళ్ల పాటు శిక్షను నిలిపివేస్తూ ఉపశమనం కల్పించింది. 2012లో షీ జిన్‌పింగ్ చైనా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత చేపట్టిన ఇప్పటివరకు సుమారు 10 లక్షలకు పైగా అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

'స్వదేశీ'కి దన్ను!

2న ప్రతి ఒక్కరూ 'ఖాదీ' కొనండి: మోదీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: అమెరికా సుంకాల వేళ.. స్వదేశీ ఉత్పత్తులే కొనాలని ప్రధాని మోదీ మరోసారి దేశ ప్రజలకు పిలుపిచ్చారు. గాంధీ జయంతి (అక్టోబరు 2) నాడు ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేయాలని కోరారు. ఇవి దేశీయ ఉత్పత్తులని సగర్వంగా చెబుతూ.. సోషల్ మీడియాలో పోస్టు చేయాలని విజ్ఞప్తి చేశారు. దానికి 'స్థానిక ఉత్పత్తులకే ప్రాధాన్యం (వోకల్ ఫర్ లోకల్)' అనే హాష్‌ట్యాగ్ జోడించాలన్నారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి ఈ విజయదశమితో వందేళ్లవుతున్న సందర్భంగా ఆ సంస్థపై ప్రశంసలు కురిపించారు. క్రమశిక్షణ, నిస్వార్థ సేవే సంఘ్ బలమని తెలిపారు. ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమైన 'మన్ కీ బాత్' 126వ సంచికలో ప్రధాని ప్రసంగించారు. స్వాతంత్ర్యానంతరం ఖాదీ ఉత్పత్తుల కొనుగోలు వెలవెలబోయిందని.. గత 11 ఏళ్లలో తన పాలనలో దేశమంతా ఖాదీకి ఆకర్షితమవుతోందని తెలిపారు. చేనేత, హస్తకళల రంగాల్లో కూడా గుణాత్మక మార్పులు వస్తున్నాయని చెప్పారు.

సంఘ్ అసాధారణ ప్రయాణం..

స్వయంగా ఆర్ఎస్ఎస్ ప్రచారక్ అయిన మోదీ.. దసరాకు ఆర్ఎస్ఎస్ ఏర్పాటై నూరేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆ సంస్థను శతధా కొనియాడారు. సంఘ్ కార్యకర్తలకు 'దేశమే ఫస్ట్' అని స్పష్టంచేశారు. 'మేధో బానిసత్వం నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు 1925లో విజయదశమినాడు కేశవ్ బలిరాం హెడ్గేవార్ ఆర్ఎస్ఎస్‌ను నెలకొల్పారు. వందేళ్లుగా సంఘ్ జాతి సేవలో అవిశ్రాంతంగా నిమగ్నమైంది' అని తెలిపారు. ఆర్ఎస్ఎస్ ప్రస్తుత చీఫ్ సర్‌సంఘ్‌చాలక్ భాగవత్ నాయకత్వాన్ని ప్రధాని కొనియాడారు.

నేవీ అధికారిణులకు ప్రత్యేక ప్రశంస

మన్ కీ బాత్ ప్రసంగం సందర్భంగా ప్రధాని భారత నౌకాదళానికి చెందిన ఇద్దరు మహిళా అధికారులతో ప్రత్యేకంగా సంభాషించారు. లెఫ్టినెంట్ కమాండర్లు దిల్‌నా,రూప.. ప్రపంచ ప్రదక్షిణ నిమిత్తం 'నావికా సాగర్ పరిక్రమ'లో పాలుపంచుకోవడం ద్వారా నిజమైన ధైర్యసాహసాలను, మొక్కవోని సంకల్పాన్ని ప్రదర్శించారని కొనియాడారు. ఐఎన్ఎస్‌వీ 'తరిణి' నౌకలో వారి పరిక్రమ యాత్ర గత ఏడాది అక్టోబరు 2న గోవాలోని నేవల్ ఓషన్ సెయిలింగ్ నోడ్ నుంచి ప్రారంభమైంది. నాలుగు ఖండాలు, మూడు మహాసముద్రాలు, మూడు ద్వీపకల్పాలు, ప్రతికూల వాతావరణం, సవాళ్ల నడుమ 50 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఈ ఏడాది మే 29న తిరిగి గోవా తీరానికి చేరుకున్నారు.

స్పీడ్ పోస్టు చార్జీల పెంపు

» పోస్టల్‌లోనూ ఇక నుంచి ఓటీపీ ఆధారిత డెలివరీ

» అక్టోబరు 1 నుంచి అమల్లోకి



హైదరాబాద్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్టు చార్జీలు పెరిగాయి. పెరిగిన చార్జీలు అక్టోబరు 1(బుధవారం) నుంచి అమల్లోకి రానున్నాయి. స్పీడ్ పోస్టు చార్జీలను చివరిసారిగా 2012లో సవరించారని, అప్పటి నుంచి చూస్తే ప్రస్తుతం నిర్వహణ ఖర్చులు పెరిగాయని, అందుకు అనుగుణంగా చార్జీలను హేతుబద్ధీకరించామని పోస్టల్ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. అంతేకాకుండా లెటర్లు, పార్సిళ్ల డెలివరీలకు సంబంధించి పలు కొత్త సదుపాయాలు, సేవలను పోస్టల్ శాఖ ప్రారంభించింది. ఇందులో ముఖ్యమైనది ఓటీపీ ఆధారిత డెలివరీ. ప్రస్తుత అమెజాన్, ఫ్లిప్‌కార్టులు ఎలాగైతే ఓటీపీ చెప్తేనే డెలివరీ చేస్తున్నాయో పోస్టల్ అధికారులు కూడా అలాగే డెలివరీ చేయనున్నారు. ఇందుకు వినియోగదారులు రూ.5అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు డెలివరీ సమయంలో ఆన్‌లైన్ చెల్లింపుల వ్యవస్థ, ఎస్ఎంఎస్ ఆధారిత డెలివరీ నోటిఫికేషన్లు, ఆన్‌లైన్ బుకింగ్ సేవలు, రియల్ టైమ్ డెలివరీ అప్‌డేట్‌లను తీసుకువచ్చింది. రిజిస్ట్రేషన్ పేరుతో కొత్త సదుపాయాన్ని తీసుకువచ్చారు. రూ.5చెల్లించి రిజిస్ట్రేషన్ చేస్తే.. ఏ చిరునామాలో, ఎవరికి ఇవ్వాలని రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్నారో వారికే లెటర్/పార్సిల్‌ను డెలివరీ చేస్తారు. ఇదిలా ఉండగా, విద్యార్థులకు స్పీడ్ పోస్టు చార్జీలపై 10% తగ్గింపు వెసులుబాటు కల్పించారు.

బరువు-చార్జీ(రూ.ల్లో)	లోకల్	200 కి.మీ.లోపు	201-500 కి.మీ	501-1000 కి.మీ	1001-2000 కి.మీ	2000 కి.మీ+
50 గ్రాములు	19	47	47	47	47	47
51-250గ్రాములు	24	59	63	68	72	77
251-500గ్రాములు	28	70	75	82	86	93

దేశంలోని విస్కీ అమ్మకాల్లో 58% దక్షిణ భారతంలోనే

» 9% చొప్పున విక్రయాలతో తెలుగు రాష్ట్రాల జోరు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: దక్షిణ భారతదేశంలో ప్రజలు విస్కీని ఎడాపెడా తాగేస్తున్నారు. సీఐఏబీసీ(కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీస్) గణాంకాల మేరకు 2025 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరం(ఎఫ్‌వై-25)లో దేశంలోని ఐఎంఎఫ్ఎల్(ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్) అమ్మకాల్లో 58 శాతం దక్షిణభారతంలోనే జరిగాయి. దక్షిణాది రాష్ట్రాల్లో మొత్తం 23.18 కోట్ల కేసులు అమ్ముడుపోయాయి. ఎఫ్‌వై-24లో దేశవ్యాప్తంగా 39.62 కోట్ల ఐఎంఎఫ్ఎల్ కేసులు అమ్ముడుపోగా, ఎఫ్‌వై-25లో 40.17 కోట్ల కేసులు అమ్ముడయ్యాయని సీఐఏబీసీ డైరెక్టర్ జనరల్ అనంత్ ఎస్ అయ్యర్ చెప్పారు. దేశంలోని మొత్తం అమ్మకాలలో 17 శాతం సాధించి కర్ణాటక అగ్రస్థానంలో నిలిచింది. ఎఫ్‌వై-25లో తెలంగాణలో 3.71 కోట్ల కేసులు, ఏపీ 3.55 కోట్ల కేసులు అమ్ముడయ్యాయి. దేశవ్యాప్త అమ్మకాలలో ఇది సుమారు 9 శాతం. దేశంలోని మొత్తం అమ్మకాలలో ఉత్తర భారతం 20 శాతం సాధించింది. అందులో అత్యధికంగా 2.50 కోట్ల కేసులు ఉత్తరప్రదేశ్‌లో అమ్ముడయ్యాయి. దేశవ్యాప్తంగా 6వ స్థానంలో యూపీ నిలిచింది. దాని తర్వాతి స్థానాల్లో రాజస్థాన్(9), ఢిల్లీ(10), హరియాణా(11) నిలిచాయి. రాజస్థాన్‌లో 1.37 కోట్ల కేసులు, ఢిల్లీలో 1.18 కోట్ల కేసులు, హరియాణాలో 1.17 కోట్ల కేసులు అమ్ముడయ్యాయి. ఉత్తర భారతం కూడా ఎఫ్‌వై-25లో ఐఎంఎఫ్ఎల్ అమ్మకాల్లో ఒక శాతం వృద్ధి సాధించింది.



తిరుమల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం జరిగిన గరుడవాహన సేవను వీక్షిస్తూ గోవిందనామ స్మరణ చేస్తున్న భక్తజనం



గరుడ వాహనంపై మలయప్ప

తిరువీధుల మెరసీ దేవదేవుడు..

తిరుమలలో కన్నుల పండువగా గరుడోత్సవం

- వజ్రవైఢూర్యాభరణాలతో అలంకృతుడైన మలయప్ప
- తిలకించి పరవశించిన భక్తకోటి
- కిక్కిరిసిన కొండ

తిరుమల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన గరుడవాహనసేవ ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. వజ్రవైఢూర్యాభరణాల అలంకరణతో మలయప్ప తన ఇష్టవాహనమైన గరుడుడిని అధిరోహించి భక్తకోటికి దర్శనమిచ్చారు. తొలినాలుగురోజులూ పలుచగా కనిపించిన మాడవీధులు ఆదివారం కిక్కిరిసిపోయాయి. ఉదయం జరిగిన మోహినీ అవతారసేవ సమయంలోనే మాడవీధులు నిండిపోయాయి. 11 గంటల తర్వాత గేట్లను మూసివేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు గ్యాలరీల్లో అక్కడక్కడ ఉన్న ఖాళీలను నింపుతూ వచ్చారు. రాత్రి జరిగే గరుడసేవను వీక్షించడానికి సాయంత్రం 4 గంటలకే గ్యాలరీల్లోకి దాదాపు 2 లక్షల మంది చేరిపోయారు. సాయంత్రం 5 గంటల తర్వాత నాలుగు మాడవీధుల్లోని కార్నర్ పాయింట్ల నుంచి భక్తులను అనుమతించారు. ఇలా మొత్తం మీదుగా గ్యాలరీల నుంచి దాదాపు 2లక్షల మంది, అదనపు క్యూలైన్లు, ఆలయం ముందు రీఫిల్లింగ్ ద్వారా 30 వేల నుంచి 35 వేల మంది స్వామిని దర్శించుకున్నారు. సప్తగిరి వద్ద, నందకం వద్ద భక్తుల మధ్య స్వల్ప తోపులాటలు చోటుచేసుకున్నాయి.

అలిపిరిలోనే కార్లు ఆపివేత

గరుడోత్సవం సందర్భంగా తిరుమలలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలన్నీ ఉదయం 11 గంటలకే నిండిపోయాయి. దాదాపు 5 వేలకుపైగా కార్లు, ట్యాక్సీలు తిరుమలకు చేరుకున్నాయి. దీంతో అలిపిరి చెక్ పాయింట్ వద్ద 12 గంటల నుంచే ప్రైవేట్ వాహనాలను అనుమతించకుండా తిరుపతిలోని పార్కింగ్ ప్రదేశాలకు మళ్లించారు. ఈ వాహనాల్లోని భక్తులను ఆర్టీసీ బస్సుల ద్వారా తిరుమలకు తరలించారు. ఆర్టీసీ బస్సులు, పాసులున్న టీటీడీ అధికారుల వాహనాలు మాత్రమే కొండెక్కాయి.

3 కిలోమీటర్ల క్యూ

మూలవిరాట్టు దర్శనానికి కూడా భక్తులు భారీగా క్యూకట్టారు. పెరటాశి మాసం రెండో శనివారం రద్దీ జత కావడంతో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. అక్కడ నుంచి కృష్ణతేజ, శిలాతోరణం, బాటగంగమ్మ, ఆక్టోపస్ భవనం సర్కిల్ వరకు దాదాపు 3 కిలోమీటర్ల మేర క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. వీరికి దాదాపు 36 గంటల తర్వాత దర్శనం లభిస్తుందని టీటీడీ ప్రకటన చేసింది.

ఉదయం మోహినీ అవతారంలో విహారం

ఆదివారం ఉదయం మోహినీరూపుడై శ్రీకృష్ణ స్వామి సరసన మలయప్ప తిరువీధుల్లో విహరించాడు. బంగారు చిలుకను చేతపట్టుకుని, శ్రీవిల్లిపుత్తూరు మాలలను ధరించి, శ్వేతవస్త్రధారణతో దంతపల్లకిలో వినూత్నభంగిమలో ఆశీనుడై స్వామి దర్శనమిచ్చాడు. రోజూలా వాహనమండపంలో కాక, ఆలయంలోనే అలంకరణ పూర్తి చేసుకుని నేరుగా మాడవీధుల్లోకి ప్రవేశించి గ్యాలరీల్లోని భక్తులకు దర్శనమిచ్చారు.

మలయప్పకు మూలవర్ల ఆభరణాలు

గరుడుడిపై విహరించే శ్రీవారికి ఆలయంలో మూలవిరాట్టుకు అలంకరించే వజ్రాలతో పొదిగిన శంఖు, చక్రాలు, కౌస్తుభం, స్వర్ణ లక్ష్మీహారం, మకరకంటి, పచ్చ, సహస్రనామాలహారాన్ని అలంకరించారు. అంతకుముందు ప్రభుత్వం సమర్పించిన నూతన పట్టువస్త్రాలు, సారెను అర్చకస్వాములు వాహనమండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. సాయంత్రం 6.30 గంటలకు వాహనసేవను ప్రారంభించాల్సి ఉండగా, రద్దీ అధికమైన క్రమంలో 23 నిమిషాల ముందే వాహనసేవను మొదలుపెట్టారు. సరిగ్గా సాయంత్రం 6.07 గంటలకు వాహనమండపం తెరతీయగానే ఒక్కసారిగా భక్తులు చేసిన గోవిందనామస్మరణల మాడవీధులు మారుమోగాయి. కాగా, 7.20 గంటల సమయంలో వర్షం కురవడంతో కొద్ది సమయం ఘటాటోపం నీడలో వాహనాన్ని ముందుకు తీసుకెళ్లారు.

ఘోర ప్రమాదం



శివ



శ్రీను

- నడిచి వస్తున్న భవానీ మాలధారులను ఢీకొన్న కారు
- అక్కడికక్కడే ఇద్దరు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు
- తూర్పు గోదావరి జిల్లాలో ఘటన
- మృతులు అనకాపల్లి జిల్లావాసులు



భవానీ మాలధారులను ఢీకొన్న కారు

నల్లజర్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు బైపాస్‌లో ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కాలినడకన వెళ్తున్న భవానీ మాలధారులను వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు భవానీమాలధారులు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. నల్లజర్ల పోలీసులు తెలిపిన వివరాలు... అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం దోసలపాడు గ్రామానికి చెందిన పక్కుర్తి శివ (35), పక్కుర్తి శ్రీను (22), శేశీలు, కోనా గోవిందు ఈనెల 24వ తేదీ ఉదయం తమ స్వగ్రామం నుంచి విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధికి కాలినడకన బయల్దేరారు. ఆదివారం ఉదయానికి నల్లజర్ల మండలం పుల్లలపాడు బైపాస్ వద్దకు వీరు చేరుకున్న వీరిని విశాఖ నుంచి హైదరాబాద్ వెళుతున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన కారు ఢీకొట్టింది. కారు కిందపడి శివ, గాల్లోకి ఎగిరి పక్కనే ఉన్న బోదెలో పడి శ్రీను అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనలో పక్కుర్తి శేశీలుకు రెండు కాళ్లు విరిగిపోవడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరితోపాటు ఉన్న గోవింద్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కురుస్తున్న మంచుకు తోడు, అతివేగం ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై దుర్గాప్రసాద్ పేర్కొన్నారు.



కాళరాత్రి అలంకరణలో భ్రమరాంబికాదేవి

- శ్రీగిరిపై ఆది దంపతులకు గజ వాహనసేవ

శ్రీశైలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా ఉత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజు ఆదివారం భ్రమరాంబికా దేవి భక్తులకు కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా రాత్రి మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా దేవి గజవాహనంపై విహరించారు. ఎనిమిదో రోజు సోమవారం నాడు అమ్మవారు మహాగౌరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. రాత్రికి ఆది దంపతులు నందివాహనంపై విహరిస్తారు.



గంగా అన్నపూర్ణాదేవికి ఆరు కోట్ల కరెన్సీతో అలంకరణ

దేవీ శరన్నవరాత్రుల రోజువారి అలంకారాల్లో భాగంగా ఏడవ రోజైన ఆదివారం పల్నాడు జిల్లా నకరికల్లు మండలం నరసింగపాడు గంగా అన్నపూర్ణా సమేత మరకత లింగ చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో గంగా అన్నపూర్ణాదేవిని ఆరు కోట్ల కరెన్సీతో అలంకారం చేశారు. గంగా అన్నపూర్ణాదేవిని చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పమిడిమర్రు శ్రీనివాస శర్మ నిర్వహించారు. **–నకరికల్లు, ఆంధ్రజ్యోతి**

వివిధ
vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

ఒకే ఒక భైరప్ప

సమాజంలోని అన్ని వ్యవస్థల్లాగే రచయితలకు కూడా ఉత్థాన పతనాలు ఉంటాయి. కొంతకాలం నిరంతరంగా విస్తృతంగా రచనలు చేస్తూ వచ్చిన రచయిత ప్రయాణం ఏదో ఒక చోట ఆగిపోతుంటుంది. అది తాత్కాలికంగానైనా శాశ్వతంగానైనా. అలాంటి ఉత్థాన పతనాలు లేని రచయితలు అరుదు. అలాంటి అతికొద్ది రచయితల్లో ఎస్.ఎల్. భైరప్ప ఒకరు. 1931లో హాసన్ జిల్లాలోని సంతేశివర అనే వూళ్ళో భైరప్ప పుట్టినపుడు ఆ పసిపిల్లవాడు తన పేరునే ఇంటిపేరుగా చేసుకుని తనకు పేరు ప్రఖ్యాతలు తెస్తాడని సంతేశివర గ్రామం ఊహించి ఉండదు. తను పుట్టిన ఊరికి భారతీయ చిత్రపటంలో శాశ్వత స్థానం కల్పించిన ఆ రచయితే ఎస్. ఎల్. భైరప్పగా పిలువబడే సంతేశివర లింగణ్ణయ భైరప్ప.

రచయిత తను రాస్తున్న విషయం గురించో అనుభవాల గురించో సిద్ధాంతం గురించో ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ మమేకమై రాసినపుడు, రాసే విషయానికి సంబంధించిన దాని ఆత్మను పట్టుకోగలిగినపుడు ఆ ఆత్మ ఆ రచనను నడిపిస్తుంది. పదికాలాలపాటు నిలబెడుతుంది. రచయిత గుండె ల్లోంచో గుండె లోతుల్లోని తడిలో నుంచో ఉద్వేగాల జడిలో నుంచి కాకుండా



పాళీ నుంచి వచ్చిన రచన ఏదీ బతికి బట్టకట్టిన దాఖలాలు చరిత్రలో లేవు. ఈ కొలమానం నుంచీ నేపథ్యం నుంచీ చూసినపుడు భైరప్ప రాసిన 'వంశవృక్ష' 'గృహభంగ', 'దాటు', 'పర్వ', 'ఆవరణ', 'సాక్షి', 'యాన', 'ఉత్తర కాండ', 'మతదాన', 'గ్రహణ', 'మంద్ర' తదితర రచనలన్నీ ఆ కాల పరీక్షకు తట్టుకుని నిలబడగలిగినవే. చేసిన ప్రతి రచన ద్వారా సంచలనం సృష్టించిన అతికొద్దిమంది రచయితల్లో కూడా భైరప్ప ఒకడు.

సమాజపు పునాదులనే కూకటివేళ్ళతో పెళ్లగించి వేయగల కులం, మతం, మతాంతీకరణ, ఇతిహాసాలు, సంప్రదాయాలు తదితర అంశాలను ఇతివృత్తాలుగా తీసుకుని వాటిని విస్తృతమైన పరిశోధన, అనుభవాల మేళవింపుతో ఆసక్తిరమైన రచనలుగా మలచడంలో భైరప్ ప్రతిభకు 'దాటు', 'వంశవృక్ష', 'పర్వ'లు ఒక నిదర్శనం.

భైరప్ప రచనల్లో విలక్షణమైనదిగా ఆయనకు ప్రథమంగా గుర్తింపు తెచ్చిపెట్టింది 'వంశవృక్ష'. ఆచార సంప్రదాయాలకు, ఆధునిక భావజాలానికి మధ్య వారధిగా ఆయన సృష్టించిన శ్రీనివాసశ్రోత్రి పాత్ర చిరకాలం గుర్తుండిపోతుంది. సదాచార బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి వంశవృక్షానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చే శ్రీనివాసశ్రోత్రి తన పుట్టుక తాలూకూ మూలాలు తెలిసి ఖిన్నుడవుతాడు. ఏకైక కుమారుడు, భార్య చనిపోయినపుడు కూడా చలించకుండా ఆత్మనిగ్రహంతో ఉండగలిగిన శ్రోత్రి తన జన్మ రహస్యం తెలిసి ఒక్కసారిగా విరాగిగా మారిపోతాడు. "మరొకరి పాపపుణ్యాలను నిర్ణయించే అధికారం మనకు లేదు. అందులోనూ తల్లిదండ్రుల జీవితాలను తూచి చూడడం మహాపాపం," అనుకోగలిగిన జన్మ సంస్కారం కలిగిన శ్రీనివాస శ్రోత్రి కూడా తండ్రికి శ్రాద్ధక్రియలు నిర్వహించాల్సి వచ్చే సందర్భంలో మానసిక విచికిత్సకు లోనవుతాడు. ఎవరి వంశానికి తాను ధర్మబద్ధంగా ఇవ్వబడలేదో వారికి శ్రాద్ధకర్మలు చేసే రస విహీనమైన నాటకం ఆడడంలో అర్థం ఏముందని అనుకుంటాడు. తనను పట్టుకున్న ఆధారం అదృశ్యమై అంతులేని అగాధంలో పడిపోతున్నట్టు భావిస్తాడు. 'వంశవృక్ష' విశ్వనాథ సత్యనారాయణ 'వేయి పడగలు'ను తలపించే విశిష్ట నవల.

కౌరవులు, పాండవులు కురుక్షేత్ర యుద్ధానికి సన్నద్ధమవుతున్న సందర్భాన్ని నేపథ్యంగా తీసుకుని భైరప్ప రచించిన 'పర్వ' ఆధునిక మహాభారతానికి రక్త మాంసాలను అద్ది, ఆ పాత్రలను సజీవంగా కళ్ళముందు నిలబెడుతుంది. మహాభారతం చుట్టూ అలుముకున్న దైవిక భావజాలానికి విరుద్ధంగా దానికి ఒక హేతుబద్ధమైన రూపం ఇచ్చి, ఆయా పాత్రల అంతఃసంఘర్షణకు మనోవిశ్లేషణకు 'పర్వ' అద్దం పడుతుంది. కుంతి, ద్రౌపది, భీముడు, అర్జునుడు తదితర పాత్రల అంతరంగపు అట్టడుగు పొరల్లో నిక్షిప్తమైన నిజాలను వెలికి తీసే ప్రయత్నం చేస్తుంది.

"నువ్వు కళ్ళకు గంతలు ఎందుకు కట్టుకున్నావో నిజం చెప్పు" అని కృష్ణుడు గాంధారిని అడిగినపుడు "నాకు ఇష్టం లేకుండా గుడ్డివాడిని భర్తగా చేస్తే అతని మొహం కూడా చూడను అని శపథం చేసి మొదట కళ్ళకు గంతలు కట్టుకున్నాను. ధృతరాష్ట్రుడికి లేని చూపు తనకు ఎందుకని కళ్ళకు గంతలు కట్టుకున్నట్లు మిగిలిన వారు అంతా భావించి నన్ను ప్రశంసించినపుడు ఆ దేవీ పట్టం నుంచి దూరం కాకుండా ఉండేందుకు గంతలు కట్టుకోవడం కొనసాగించాను" అని అంటుంది గాంధారి. మహాభారతంలో బైటకు కనిపించని ఎన్నో చీకటి కోణాలని, యుద్ధాల పేరుతో జరిగే వినాశనాన్నీ, రాజుల అంతఃపురాలలో మగ్గిపోయే స్త్రీ జనపు కన్నీటి ఘోషనీ, పురుషులు స్త్రీల మధ్య పాటించే ద్వంద్వ ప్రమాణాలను అడుగడుగునా 'పర్వ' చెప్పకనే చెబుతుంటుంది. దాదాపు ఇరవై ఏళ్ళపాటు తనలో మహాభారత కథా వాస్తవాల పట్ల ప్రారంభమైన ఊహలు, ఆలోచనలకు పుస్తకరూపమే 'పర్వ' అంటారు భైరప్ప.

భైరప్ప నవలల్లో విశిష్ట ప్రాచుర్యం పొందడమే గాక వివాదాస్పదంగాను నిలిచిపోయిన నవల 'ఆవరణ'. అభ్యుదయ భావాలున్న అమీర్‌ను పెళ్ళి చేసుకున్న లక్ష్మి తన పేరును రజియాగా మార్చుకుంటుంది. అయితే అమీర్ తను అనుకున్నంత ఉన్నతుడు కాదని తెలుసుకుని అతనికి దూరం అవుతుంది. ఆ క్రమంలో చరిత్ర మీద ఆసక్తి కలిగి మొగలుల చరిత్ర గురించి అధ్యయనం చేయాలనుకున్న లక్ష్మికి ఆ పరిశోధనలో ఇస్లామిక్ పరిపాలన వల్ల మారిన హిందూ సమాజ స్వరూప స్వభావాలకు సంబంధించి కొన్ని చారిత్రక సత్యాలు వెల్లడవుతాయి. హిందూ సంస్కృతిని ధ్వంసం చేసి ఆ పునాదుల మీద మొగలులు సామ్రాజ్యాన్ని స్థాపించారని లక్ష్మి పరిశోధనా పత్రాలను తయారు చేసి ఒక సంచలనానికి కారణం అవుతుంది.

'ఆవరణ' నవలతో భైరప్ప సమాజాన్ని మతపరంగా విడగొట్టడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తాయి. 'సంస్కార' నవల రచయిత యు.ఆర్. అనంతమూర్తి కూడా 'ఆవరణ'ను ప్రమాదకరమైన నవలగా అభివర్ణించారు. అర్ధసత్యాలతో కూడిన ఇలాంటి రచనల వల్ల మత సమైక్యత దెబ్బతింటుందని ఇతర రచయితలు కూడా భైరప్పను తీవ్రస్థాయిలో విమర్శించారు. అయితే తను ఎంతో విస్తృతమైన పరిశోధన చేసి ఈ రచన చేశానని, ఇందులోనివన్నీ అక్షర సత్యాలని భైరప్ప అంటారు.

'పర్వ'లో మహాభారతంలాగే 'ఉత్తరకాండ'లో రామాయణంపై కూడా ఒక విభిన్న దృష్టికోణం నుంచి ప్రశ్నలు సంధిస్తారు భైరప్ప. సీత దృష్టికోణం నుంచీ రామాయణాన్ని నిర్వచించిన భైరప్ప రామాయణం అంతా ఒక్క మాటలో చెప్పాలంటే సీతకు చేసిన ద్రోహం అని, ఆమె తప్పు లేకుండానే ఆమెకు విధించిన శిక్ష అనీ అంటారు. కైకపై దశరథుడికి ఉన్న ప్రేమ, కైకేయి దురాశ, రాముడి శక్తి సామర్థ్యాలు, భరతుడి నిస్సహాయత, లక్షణుడి భ్రాతృప్రేమ లాంటి విషయాలన్నిటినీ పక్కనపెడితే రామాయణం సీత జీవితం తాలూకూ విషాదానికి, అర్థరాహిత్యానికి నిదర్శనమని అంటారు భైరప్ప. 'ఉత్తరకాండ' కూడా కన్నడ సమాజంలో ప్రకంపనలు సృష్టించింది.

> **తను సృష్టించిన పాత్రలపై రచయితకు సహానుభూతి ఉండాలి. ఆ పాత్రలను సంపూర్ణంగా అవగాహన చేసుకుని వాటిల్లోకి పరకాయప్రవేశం చేయగలిగి ఉండాలి. గతంలోని అనుభవాలను వర్తమానంతో బేరీజు వేసుకుని భవిష్యత్తును దిశానిర్దేశం చేయగలిగిన దార్శనికత కలిగి ఉండాలి. అలాంటి ఒక దార్శనికుడు భైరప్ప**

ఒక రచయిత విస్తృతంగా రాస్తూ పోయినపుడు కొంతకాలానికి అతను చెప్పాలనుకున్నదంతా చెప్పివేస్తాడు. అంతవరకూ ఉప్పెనలా ఎగసి వచ్చిన ఆలోచనా ప్రవాహం ఒక చోట ఇంకిపోయి ఒకలాంటి భావశూన్యత ఏర్పడుతుంది. ఏది రాద్దామనుకున్నా అది ఎప్పుడో ఒకప్పుడు ప్రస్తావించిన విషయమే అనిపిస్తుంది. భావాల పునర్ వ్యక్తీకరణగా అనిపించినపుడు అతని కలం ఒకచోట ఆగిపోతుంది. ప్రతి రచయితా ఏదో ఒక దశలో ఈ అనుభవానికి లోనవకుండా ఉండడు. అయితే దీనికి మినహాయింపుగా భైరప్ప అవిశ్రాంతంగా రచనలు చేస్తూనే వచ్చారు. ఇరవైనాలుగుకు పైగా నవలలతో సహా దాదాపు నలభై ఎనిమిది పైగా రచనలు చేశారు. ఈ విశిష్టత కారణంగానే భైరప్పను పద్మభూషణ్, పద్మశ్రీ, సరస్వతి సమ్మాన్, కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డులు వెతుక్కుంటూ వచ్చాయి.

తను రాసే వస్తువు పైనా, విషయం పైనా నిబద్ధత ఉన్నపుడు రచయిత విమర్శను కూడా అంతే నిబద్ధతతో అంగీకరించవలసి, ఎదుర్కొనవలసి ఉంటుంది. రచయిత ఎంత గొప్పవాడైనా, మేధావి అయినా విమర్శకుడు తనను సమర్థించనపుడు, తనకు సహాయంగా రానపుడు రచయిత నిస్సహాయుడిగా ఉండిపోవలసిందేనని ప్రముఖ ఆంగ్ల విమర్శకుడు మాథ్యూ ఆర్నాల్డ్ అంటారు. అయితే భైరప్ప ఎప్పుడూ అలా నిస్సహాయుడిగా ఉండిపోలేదు. నిబద్ధతనూ వదులుకోలేదు. తను సృష్టించిన పాత్రలపై రచయితకు సహానుభూతి ఉండాలి. ఆ పాత్రలను సంపూర్ణంగా అవగాహన చేసుకుని వాటిల్లోకి పరకాయ ప్రవేశం చేయగలిగి ఉండాలి. గతంలోని అనుభవాలను వర్తమానంతో బేరీజు వేసుకుని భవిష్యత్తును దిశానిర్దేశం చేయగలిగిన దార్శనికత కలిగి ఉండాలి. అలాంటి ఒక దార్శనికుడు భైరప్ప.

■ జి. లక్ష్మి
✆ 94907 35322

పదమై పలికింది జనహృదయం!

గోరటి వెంకన్న కంటే ముందు చాలామంది వాగ్గేయకారులు మనకు ఉన్నారు. తనతో పాటు ప్రయాణంలో ఉన్న సమాకాలీన వాగ్గేయకారులూ గణనీయ సంఖ్యలో ఉన్నారు. ఐతే వెంకన్న దారి వేరు. వెంకన్న పాటలో కవిత్వం నిండి వుండటం, అతని కవిత్వంలో పాట లక్షణాలు అమరిపోవడం అతన్ని ఇతరులకన్నా విభిన్నంగా ఉంచింది. చాలామంది వాగ్గేయకారుల పాటల్లో పాడుకోవటానికి అనుగుణమైన వాక్యాలు ఉంటాయి. కానీ వాటిలో కవిత్వం ఉండదు. కొంతమందిలో కవిత్వం ఉంటుంది కానీ గాన యోగ్యత తక్కువ. గద్దర్ గేయాల్లో రెండూ కలిసిపోయిన కళను చూస్తాం. ఈ కళ గోరటి వెంకన్నలో మరింత ఉన్నతంగా లోతుగా కనిపిస్తుంది. గాన యోగ్యతకూ కవిత్వ గాఢతకూ మధ్య పదిలమైన సమన్వయం ఉంటుంది. ఈ సమన్వయ నేర్పరితనమే ఇతన్ని ఇతర వాగ్గేయకారుల కన్నా పది మెట్లు పైన ఉంచింది.

గోరటి వెంకన్న దృష్టిలో కళ అనేది సౌందర్యంలో మాత్రమే ఉండదు. విషయాల్ని విభిన్నంగా చూడగలిగే దృష్టిలో నిజమైన కళ ఉంటుంది. వాస్తవాలనూ, పరిసరాలనూ, ప్రకృతిలోని జీవజాలాన్నీ మనం చూసే దృష్టికి విభిన్నంగా చూడటం ద్వారా, అదే దృష్టి నుంచి చిత్రించడం ద్వారా ఒక అనూహ్యతనీ, తాజాతనాన్నీ, గోరువెచ్చనితనాన్నీ సాధించగలిగాడు గోరటి వెంకన్న. వీటికి తోడు కథనాత్మకతా, వర్ణనా చాతుర్యం, ప్రదర్శనాత్మకతలు ఇతని కళాస్వభావంలో ఇమిడిపోయాయి.

ఏటిని నమ్ముకుని బతుకుతున్న 'కొంగమ్మ' గురించి రాస్తూ ఆ జీవిని చూసిన తీరు చూడండి: "ఒంటి కాలి మీద నిలిసి వొడుపుతో సేపను పట్టి/ గూటిలోని బిడ్డ కొరకు నోట కరుసుకొని పోతే/ దొంగ కొంగ జపమని నిందలంటగట్టె నరుడు/ ఏలెడంత పొట్ట మీద ఎందుకమ్మ ఇంత నింద/ నరుడు తప్ప పుడమిలోన కొంగమ్మా/ ఏ జీవి కపటమెరుగదమ్మ కొంగమ్మా/ కపటమున్న నరుడు కొంగమ్మా/ నీకు కపట మంటగట్టె కొంగమ్మా" – కొంగ ఆహారాన్వేషణకు మనిషి అంటగట్టిన స్వభావాన్ని ఉల్టాగా చూపటంలోని కళా కౌశల్యమిది.

పల్లెల్లో ఎక్కడ చూసినా కనిపించే నల్ల తుమ్మ మీద రాసిన పాటలో తుమ్మ చెట్టంటే ఉండే తేలిక భావాన్ని పోగొట్టి దాని పట్ల ఆత్మీయత కలిగేట్లు చేయడంలోనూ ఇదే కళా మర్మం ఉంది: "ఓ నల్ల తుమ్మ పసిడి పూల కొమ్మ/ నీవు లేక పల్లె చిరునామ లేదమ్మ/ / గులకరాళ్ళ సవుక నేలలో మొలిసేవు/ గుట్టలు రాల్లున్న గుబురుగ పెరిగేవు/ పెట్టిపోతల కొరకు పెట్టుకోవు బెంగ/ మేక పంచకముంటె అదె నీకు సురగంగ/

> **గొప్ప కవులు వాస్తవికతనీ పరిసరాలనీ కవిత్వంగా మలిచే క్రమంలో తమదైన కళా వ్యవస్థను ఏర్పరచుకుంటారు. ఆ వ్యవస్థ నిర్మాణంలోకి వస్తువును తేవటం ద్వారా దాన్ని గ్లోరిఫై చేస్తారు. ఒక కొత్త గ్రామర్‌నీ గ్లామర్‌నీ పరిచయం చేస్తారు. గోరటి వెంకన్న చేసిందదే. అందుకే జనం పల్స్‌ను ఇతరుల కంటే బాగా పట్టుకోగలిగాడు. జనం వినాలనుకునే రీతిలో, వారి ఉద్వేగోల్లాసాలను తాకే విధంగా తనదైన కళా వ్యవస్థను నిర్మించి నిలవగలిగాడు. గెలవగలిగాడు.**

కంచె లేకనే పెరిగి కంచె నీవయ్యేవు/ మంచెపై కాపుకు దాపు నీవయ్యేవు" – ఈ పాట పొందిన జనాదరణకు కారణం తుమ్మచెట్టు పట్ల వెంకన్న చూపిన భిన్నమైన దృష్టే. వెనకటికి జాన్ కీట్స్ అనే ఆంగ్ల కవి ఆకు రాలే కాలాన్ని అందమైన కాలంగా వర్ణించాడు. మేకల అరుపులలోనూ, క్రిమికీటకాల రొదలోనూ సంగీతాన్ని వినగలిగాడు. ఇక్కడ వెంకన్న ధోరణీ అదే.

తన అసాధారణ దృష్టితో 'జీవబంధం'లోని తాత్త్వికతను ప్రశ్నల రూపంలో పండించిన వైనం మరింత అబ్బురం: "జీవుల పొడిసే గద్దనెందుకో/ దేవుని మోసే వాహనమంటివి/ బరువులు మోసే గాడిద సేవను/ మరిసి చులకన లాడుచుంటివి// కాటు వేసే ఆ పాముకెందుకో/ నాగదేవతని పూజ చేసెదవు/ పాలనిచ్చే ఈ బర్రె నెందుకో/ బడితపూజతో బాద పెడతవు" – ఇక్కడ వెంకన్న ఉపయోగించిన లాజిక్ పోయెటిక్ లాజిక్. ఈ లాజిక్ ద్వారా తల్లకిందుల వాదనల్ని తుత్తునియలు జేసి ఆరోగ్యకరమైన తర్కాన్ని ప్రవేశపెడతాడు. ఓపికుంటే పై వాక్యాల సింబాలిక్ అర్థాన్ని కూడా రాబట్టవచ్చు. ఈ దేశంలో పొడిసే గెద్దలెవరో కరిచే పాములెవరో – గాడిద సేవ ఎవరిదో, పాలిచ్చే బర్రె ఎవరో తెలుసుకోవడం కష్టమేమీ కాదు.

వెంకన్న కవితా తర్కం అంటరానితనాన్ని ఎంత విభిన్నంగా కడిగిపారేసిందో ఇక్కడ చూడండి: "చాయ తాగితే గ్లాసులు/ మైలవడినవంటివి/ మొక్కినందుకే దేవుని/ మహిమ తొలిగెనంటివి/ గుడిలోకి వచ్చినరని/ గుడినే వెలి వేస్తివి/ గాలి పీల్చి వదిలిరి/ గాలిని వెలివేస్తవ/ వెలుగులో నడ యాడిరని/ పొద్దును వద్దంటవ/ నేలకు సెమటొచ్చిరని/ గింజల తిననంటవ" – ఇక్కడ కబీర్, తుకారం ధోరణిని పరాకాష్టకు తీసుకెళ్లాడు వెంకన్న.

అతని గేయ కవిత్వం – కవిత్వ గేయం అపారమైన వస్తు వైవిధ్యాన్నీ, విస్తృతినీ కలిగి ఉంది. దళిత బహుజన ఆకాంక్షలూ ఆరాటలూ పోరాటాలూ ఇతని అక్షరాల్లో ఒదిగిపోయాయి. వామపక్ష, విప్లవ ఉద్యమాల సానుకూలతా చోటు చేసుకుంది. గ్లోబలైజేషన్ తెచ్చిన ముప్పును పుక్కిటబట్టిన లెక్కలేనన్ని ఉదంతాలూ వెంకన్న వ్యక్తీకరణలో ఉన్నాయి. అన్నిటికీ మించి పల్లె తెలంగాణ స్వప్నలిపిని గొప్పగా రికార్డు చేయగలిగాడు: "తల్లీ తెలంగాణమా తనువెల్ల మాగాణమా/ పురి విప్పిన గానమా పూసిన పున్నాగమా/ గర్భానా సింగరేణి గళమున మధురవేణి/ తరుల పూలతోని కురులల్లుకున్న రాణి"– అని ఓ పక్క పలుకుతూనే –"సేతానామేడుందిరా/ తెలంగాణ సేలన్ని బీడాయెరా/ భూకంపమొచ్చి భూమి పగిలినట్టు/ రేగళ్ళు సవుకలు నెర్రెలొచ్చినాయి/



ఎర్రని దుక్కులు ఇసుక దుబ్బలాయె/ ఉసుక భూములన్ని ఉత్త దుమ్మయి పాయె/ మెదిమ గడ్డలు గూడరా తెలంగాణ/ లొట్టిమొద్దు లాయియెరా... ఓరన్న" – అని మరోపక్క వాపోయాడు.

వెంకన్న రాసిన 'పల్లె కన్నీరు పెడుతుంది' పాట అమితమైన జనాదరణ పొందింది. ప్రపంచీకరణ పల్లెటూళ్లను విధ్వంసం చేసిన తీరును కదిలించే రీతిలో కళ్ళకు కడుతుంది ఈ పాట. కులవృత్తులకు వచ్చిన ముప్పును గురించి నొచ్చుకుంటుంది. వృత్తుల విధ్వంసం పట్ల వెంకన్న ధోరణిని విమర్శించినవారు ఉన్నారు. గ్రామ వ్యవస్థల్లో కులవృత్తులను వైభవీకరించడమంటే కులపీడనను సపోర్ట్ చేయడమే. కులవృత్తులు పోకుండా కుల నిర్మూలన జరగదు. విద్యను సాధనంగా చేసుకుని తరువాతి తరాలను వృత్తుల కబంధ హస్తాల నుంచి కాపాడుకోవాలని అంబేద్కర్ చెప్పిన దానికి ఈ పాటలోని స్పిరిట్ వ్యతిరేకం అని విమర్శకులు అన్నారు. ఈపాట వచ్చిన కొత్తల్లో నేనూ అలాంటి విమర్శను చేశాను. అయితే వెంకన్న ఉద్దేశం వృత్తులు వుండాలని కాదు. తగిన ప్రత్యామ్నాయం లేకుండా వృత్తులు పోతే ఉపాధి పోయినట్లే అనేది తన ఉద్దేశం. అందుకే మగింపులో ఈ వాక్యాలు: "వృత్తులు కూలే ఉపాధి పాయె/ ప్రత్యామ్నాయ్యం లేకనె పాయె/ కూలిన బతుకులు నిలుపుటకైనా/ కుటీర పరిశ్రమలైన లేవు/ బహుళ జాతి కంపెనీల మాయలోన మాయన్నలారా/ భారత పల్లెలు నలిగిపోయి కుమిలె ఓ అయ్యలారా". ముగింపు ఇలా స్పష్టంగా ఉన్నప్పటికీ ఆ పాటలో కవి నడక ఫ్యూడల్ విలువల దిశగా వెళ్లినట్లే అనిపిస్తుంది.

'ఏకునాదం మోత' నుంచి 'వల్లంకి తాళం' వరకు ఐదు సంపుటాలుగా వెలువడిన వెంకన్న కవిత్వం అచ్చనైన దేశీయ కవిత్వం. లయ, ప్రాసలతో జనం భాషతో, పల్లె గోసతో, మేటి కళతో ఉత్తమ ప్రమాణాల్ని నెలకొల్పిన కవిత్వమిది. దున్న ఇద్దాసు, వేమన, వీరబ్రహ్మం, కృష్ణశాస్త్రి, జాషువాలు పెట్టిన ఒరవడిలో కబీరు, తుకారం లాంటి భక్తి కవుల మార్గంలో సమాకాలీన సమాజాన్నీ ప్రకృతినీ మేళవించి అలికిన పలుకుల వాన వెంకన్న కవిత్వం.

గొప్ప కవులు వాస్తవికతనీ పరిసరాలనీ కవిత్వంగా మలిచే క్రమంలో తమదైన కళా వ్యవస్థను ఏర్పరచుకుంటారు. ఆ వ్యవస్థ నిర్మాణంలోకి వస్తువును తేవటం ద్వారా దాన్ని గ్లోరిఫై చేస్తారు. ఒక కొత్త గ్రామర్‌నీ గ్లామర్‌నీ పరిచయం చేస్తారు. గోరటి వెంకన్న చేసిందదే. అందుకే జనం పల్స్‌ను ఇతరుల కంటే బాగా పట్టుకోగలిగాడు. జనం వినాలనుకునే రీతిలో, వారి ఉద్వేగోల్లాసాలను తాకే విధంగా తనదైన కళా వ్యవస్థను నిర్మించి నిలవగలిగాడు. గెలవగలిగాడు.

(గోరటి వెంకన్న రేపు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోనున్న సందర్భంగా)

■ జి. లక్ష్మీనరసయ్య

ఏమై... ఏమీ కాక...



1.
ఎక్కడెక్కడో వెతికి వచ్చాను
రాత్రి మరగ కాగి దట్టంగా కట్టిన
స్వప్నాల మీగడ పొరలకు ఆ వైపునా ఈ వైపునా
కళ్ళవెనక కీకారణ్యపు కోనకోనల్లోనూ
కలతనిద్ర ఎడారుల ఇసుకతెరల్లోనూ
అలసి సొలసి సొమ్మసిలిన నిద్ర నీరెండలో
ఆ రెండో నీడ నువ్వేనా...

2.
పాట వినబడుతూనే ఎక్కడో ఉసూరుమంటూ
క్రమం తప్పని దినచర్య
కొక్కానికి వేళ్ళాడుతున్న తపన
ప్రాణం పోసుకు సజీవమవుతుంది
పాటతోపాటే సాగిసాగి రెప్పవాలని సముద్రమవుతుంది
సముద్రమే పాటై పోటై హద్దులు చెరిపేసుకున్నవేళ
అణువణువునా శ్రుతిలయల హోరే

3.
ఆ రోజున స్తబ్ధంగా ఉదయించిన మౌనాన్ని
విసిగించి విసిగించి బేరాలాడిన చూపులు
ప్రశంసల మచ్చుజల్లి వశీకరించిన క్షణాన
కూకటివేళ్ళతో నన్ను పెకలించి వేసి
నీ జీవితాన నాటుకున్నప్పుడు
వేదమై నాదమై భూనభోతలాలమధ్య గానమై
నీ చుట్టూ ఇక సుడిగాలినై...

4.
పైపైన ఎక్కడో చూపానని
నీలి గాలి వయ్యారాల అలల్లోకి
సుళ్ళు తిరిగే దృశ్యాదృశ్య వృత్తాలమై
ఎవరికి తెలుసు ఏమయామో ఏమి కాలేదో...

■ స్వాతీ శ్రీపాద
✆ 82972 48988

గొగోల్‌ని కలిస్తే కథ చెప్పించుకుంటాను

చదువు ముచ్చట

సొలోమోన్ విజయ్ కుమార్



రీసెంట్‌గా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

అమెరికన్ రచయిత జేమ్స్ ఫ్రే రాసిన 'ది ఫైనల్ టెస్ట్‌మెంట్ ఆఫ్ ది హోలీ బైబిల్' అనే నవల ఇటీవల చదివాను. జీసస్ మెస్సయ్యగా వచ్చి పాపులందరికీ తీర్పు చెబుతాడని క్రైస్తవుల నమ్మకం. అయితే ఈ నవలలో జీసస్ మత సంబంధమైన మెస్సయ్యగా కాకుండా నేటి ఆధునిక ప్రపంచం హీనంగా చూసే కొన్ని జన సమూహాలను, నానా రకాల వ్యసనపరులను అర్థం చేసుకొని ఆదరించే మెస్సయ్యగా వస్తాడు. 'ప్రేమ, హాస్య చతురత, సంభోగం, బతుకుని మెరుగు పరుస్తాయి' అంటాడు ఓ చోట రచయిత. వీటన్నిటి వలన ఈ నవల చర్చ్ ఆగ్రహానికి, విమర్శలకు గురయ్యింది. ఐతే మతపు మూసల్ని దాటి జీసస్ ప్రేమ స్వరూపాన్ని, God is love అనే బైబిల్ సందేశాన్ని ఆవిష్కరించే విషయంలో రచయిత కళాత్మక అభివ్యక్తి గొప్పగా ఉంది. అందుకే ఈ నవల బాగా నచ్చింది.

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?


ఆర్మీనియన్ కథల తెలుగు అనువాదం 'కొండగాలి కొత్త జీవితం' ఇంటర్మీడియట్ రోజుల్లో చదివాను. అందులో పిండిమర పనివాడు గెగామ్, మూగ చెవిటి అమ్మాయి తుతీ మధ్య ప్రేమ గురించి రాసిన 'చరమ దశ' అనే కథ నా ఆల్ టైం ఫేవరేట్. 'కడవ భుజానపెట్టి నీటికెళ్లెను పడతి', 'గరుడ పర్వతంపైన', 'ఆకుపచ్చని లోయ', 'గుడ్ మార్నింగ్ జాక్', 'ఒంటెలు వెళ్లిపోతాయి పర్వతాలు ఉండిపోతాయి'... ఇట్లా ఆ సంకలనం లోని కథలన్నీ గొప్పవి. చిన్న పుస్తకమే అయినా అర్మీనియా ఆత్మనంతటినీ పొందుపరచిన విశిష్టమైన సంకలనం అది.

మీ నమ్మకాలనూ, దృక్పథాన్నీ ప్రభావితం చేసిన రచయిత?

అలా ఎవరూ లేరు కానీ సత్యం పక్షాన నిలబడిన మంటో, తమవైన మూలాలను తవ్వితీసిన అలెక్స్ హేలీ, చినువా అచెబె, నాలుగే నాలుగు లైన్లలో కథ రాసి ముగించిన హంగేరియన్ రచయిత ఓర్కనీ, తెలుగులో తమ తమ మాండలికాలకు పట్టం కట్టి రాసిన గోరటి వెంకన్న, శిష్టా ఉమామహేశ్వరరావు, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు వీళ్లంటే నాకు గౌరవం. వీళ్ల రచనలు నా దృష్టికి విలువైనవి.

సాహిత్యంలో మీకు బాగా నచ్చిన పాత్ర ఏది, ఎందుకు?

జమీల్యా! ఎందుకంటే కుసుమ కోమల కావ్య నాయికల్లాగా తీర్చి దిద్దిన శృంగార దేవత కాదు జమీల్యా. పెళ్లైన వెంటనే యుద్ధంలో మాయమైన భర్త, ఊరిలో పోకిరీల వెకిలి చేష్టలు, ఇంట్లో కఠినమైన సాంప్రదాయాలు, ఎవరితో ఏమీ చెప్పుకోలేని ఒంటరితనం, వీటితోపాటు పగలు రాత్రి తేడా లేకుండా ఎండా వానల్లో వ్యవసాయ క్షేత్రపు గొడ్డు చాకిరీకి అంకితమైన బతుకు. అయితే వీటన్నిటి మధ్యనా పాటలు పరవశాలు కలలు తాదాత్మ్యాలతో కూడిన మనోహరమైన ఆత్మలోకం జమీల్యాది. దనియార్ కూడా తన



వంటి మనస్తత్వం కలవాడేనని గ్రహించాక వాడు బికారి, అవిటివాడు అనేది లెక్కచేయకుండా అతడితో వెళ్లిపోయింది. నవల ఆఖరి పేజీ చివరి అక్షరం వరకూ ఆ ఇద్దరి మధ్యనా కించిత్తు ప్రేమ కలాపం కనపడదు. చదువుతున్న మనల్ని మాత్రం ప్రతి పుటలోనూ ప్రేమ జల్లులు తడుపుతుంటాయి. చిత్రకారుడు కాబోతున్న కుర్రాడి దృక్కోణం నుంచి నవల నడుస్తుంది కనుక రచయిత చింగిజ్ ఐత్మాతోవ్ జమీల్యాని పాఠకుడి గుండెలమీద శాశ్వతమైన రంగులతో చిత్రించాడు.

ఏ గత కాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఏం మాట్లాడతారు?

ఈ ప్రశ్నకు నాకు కలిగే వింతైన ఆలోచనల్లోంచి జవాబు చెబుతాను. మార్క్వెజ్ 'వందేళ్ల ఏకాంతం' నవలలో 'అందాల రెమెడియోస్'తో కలిసి ఆకాశానికి ఎగిరిపోయినట్టు, ఆర్కాడియో శవ యాత్రలో ఆకాశం కురిపించిన పసుపు పూల వానలో తడిసినట్టు అనిపిస్తుంది. చనిపోయిన గొగోల్‌ని కలిసి ఎందుకయ్యా పిచ్చి ముదిరి 'మృత జీవులు' రెండో భాగం ప్రతుల్ని కాల్చేసి మాకు కాకుండా చేశావు, కనీసం వినిపించవా అని అడగాలనుంది. కాఫ్కా గురించి జమ్సా (మెటామార్ఫసిస్ కథలో పురుగుగా మారే వ్యక్తి) నోట వినాలనుంది. మహాశ్వేతాదేవి 'బషాయి టుడు' కోసం అడవుల్లో వెతుకుతున్నట్టు, 'అంటరాని వసంతం' పాత్రలన్నీ కళ్లముందు మెదిలినట్టు, 'మోటర్ సైకిల్ డైరీస్'లో లాటిన్ అమెరికా దేశాలన్నీ తిరుగుతున్నట్టు ఉంటుంది. ఈ అమేజింగ్ అనుభూతులన్నీ ఆయా రచయితలతోనూ వారు సృష్టించిన పాత్రలతోనూ జరుపుతున్న మానసికమైన సంభాషణలే కదా!

రచన విషయంలో మీకు దొరికిన మంచి సలహా?

సాహిత్యం అంటూ నీ జీవితానికి మించినది బైట ఎక్కడో ప్రత్యేకంగా లేదు. నీ అనుభవాలను, నీ తప్పొప్పులను, నువ్వు ప్రేమించేవాళ్ల జీవితాలను నిజాయితీగా నిర్భయంగా రాయగలిగితే అదే గొప్ప సాహిత్యం అవుతుంది అన్నారు ఓసారి కె. శ్రీకాంత్. లోతుగా నాటుకున్న ఆ మాటలే నేనేది రాస్తున్నా గీటురాళ్లుగా పని చేస్తుంటాయి.

✆ 83413 36828

'గరం గరం చాయ్' కథలు

పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో ఆర్.సి. కృష్ణస్వామి రాజు రాసిన ఏభై పొట్టి కథల 'గరం గరం చాయ్' పుస్తక ఆవిష్కరణ అక్టోబర్ 1 సా.4.30కు వేమన విజ్ఞాన కేంద్రం, యశోద నగర్, తిరుపతిలో జరుగనున్నది. ఈ పుస్తకాన్ని ఎం.పి. నరసింహరాజు, ఉపకులపతి, దమ్మ దీప అంతర్జాతీయ బౌద్ధ విశ్వవిద్యాలయం, త్రిపుర ఆవిష్కరిస్తారు. జి. శైలమ్మ, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం సమీక్ష చేస్తారు. ముఖ్య అతిథులు తిరునగరి శరత్ చంద్ర, ఎన్. ధర్మయ్య. వివరాలకు: 93936 62821.

జి.ఎస్.ప్రసాద్

కథలు, కవితల పోటీ

ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం – ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ సౌజన్యంతో, మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ నిర్వహణలో కథలు, కవితల పోటీ జరుగుతుంది. సమకాలీన సామాజిక సమస్యల్ని, ప్రశార్థకమౌతున్న మానవతా విలువల్ని స్పృశిస్తూ కథల్ని, కవితల్ని ఆహ్వానిస్తున్నాం. వీటిని డీటీపీ చేసి గానీ, యూనికోడ్ ఫాంట్‌లో గాని మాత్రమే పంపాలి. రూ.5వేల చొప్పున 8 ఉత్తమ కథలు, వెయ్యి చొప్పున 10 కన్సొలేషన్ కథలు; రూ.2,500ల చొప్పున 8 ఉత్తమ కవితలు, ఐదు వందల చొప్పున 10 కన్సొలేషన్ కవితలను ఎంపిక చేస్తారు. 3 – 5 పేజీలు మించని కథలను, నలభై లైన్లకు మించని కవితలను అక్టోబరు 15లోపు ఈమెయిల్: malleteegasss@gmail.comకు పంపాలి. వివరాలకు: 92464 15150.

కలిమిశ్రీ





ఇంద్రకీలాద్రికి గండ దీపాలతో వస్తున్న భక్తులు



కంపార్టమెంట్లలో వేచి ఉన్న భక్తులు



దర్శనానికి వెళ్తున్న భక్తులు

ఆదివారం రాత్రి ఒంటిగంటకు కంపార్టమెంట్లలో పోటెత్తిన భక్తులు





ప్రత్యేక పూజలు, హోమాలు, నగరోత్సవం, సాంస్కృతిక ప్రదర్శనలతో ఇంద్రకీలాద్రి దేదీప్యమానంగా వెలిగిపోతోంది. భక్తుల జయ జయధ్వానాలకు తన్మయత్వం చెందుతోంది. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కోసం మహాలక్ష్మి, మహాకాళీ, మహా సరస్వతి త్రిశక్తి స్వరూపిణిగా ఉద్భవించిన మహాచండీగా కనకదుర్గమ్మ ఆదివారం దర్శనమిచ్చారు. అనేక మంది దేవతలు కొలువై ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని పరవశించారు. విద్య, కీర్తి, సంపదలను ప్రసాదించే తల్లీ.. చల్లగా చూడమ్మా అంటూ మనసారా చండికాదేవిని వేడుకున్నారు.



చల్లగా చూడమ్మా.. మహాచండికా..



ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

- మహాచండీదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ
- నిమిషానికి 100 మంది భక్తులకు దర్శనం
- ఆదివారం అర్ధరాత్రి భారీగా వస్తున్న భక్తులు


(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. కనక దుర్గమ్మ ఆదివారం మహాచండీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే భక్తులు క్యూల్లోకి చేరుకున్నారు. పోలీసులు, దేవస్థాన అధికారులు గడచిన మిగతా 8లో..





గానం ఆలపిస్తున్న సంగీత దర్శకుడు రామ్ మిర్యాల →

నేడు అమ్మవారికి ముఖ్యమంత్రి పట్టువస్త్రాల సమర్పణ



ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వతీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారికి సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. సీఎం రాక సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. ఆదివారం ఇంద్రకీలాద్రిపై మీడియా పాయింట్ నుంచి పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, ఈవో శీనానాయక్‌తో కలిసి మాట్లాడారు. కృష్ణానదికి వరద పెరిగిన దృష్ట్యా భక్తులు ఘాట్లలోకి దిగవద్దని సూచించారు. పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ భక్తుల రద్దీ నేపథ్యంలో అదనంగా ఏపీఎస్పీ ప్లటూన్లను రప్పిస్తున్నామని తెలిపారు. రెండు శాతం మంది మాత్రమే మిగతా 8లో..

పటిష్ట ఏర్పాట్లు

నేడు మూలా నక్షత్రం

- సరస్వతీదేవిగా దర్శనం ఇవ్వనున్న దుర్గమ్మ
- 2.50 లక్షల మంది వస్తారని అంచనా
- 50 డ్రోన్లతో నిరంతరం నిఘా



దుర్గగుడి మీడియా పాయింట్ నుంచి మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, పక్కన పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, ఈవో శీనానాయక్

శరన్నవరాత్రుల్లో కీలక ఘట్టం సోమవారం ఆవిష్కృతం కానుంది. అమ్మవారి జన్మ నక్షత్రం మూలా రోజున దుర్గమ్మను సరస్వతీదేవిగా అలంకరిస్తారు. అమ్మ మంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. దీంతో అర్ధ రాత్రి ఒంటి గంట నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : మూలా నక్షత్రం రోజున అమ్మవారిని దర్శించుకోవడానికి దేశ నలు మూలల నుంచి భక్తులు భారీగా వస్తారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచి అత్యధికంగా భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకుంటారు. ఇలా వచ్చిన భక్తుల కోసం దేవస్థాన అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు వ్యూహాత్మక బందోబస్తును సిద్ధం చేశారు. ఆదివారం రాత్రి దర్శనాన్ని వినాయకుడి ఆలయం వద్ద రాత్రి 9.30-10 గంటలకు ఆపేశారు. ప్రధానాలయం మూసివేసిన తర్వాత క్యూలైన్లలోకి భక్తులను అనుమతించారు. క్యూలు నిండిన తర్వాత వీఎంసీ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన కంపార్టుమెంట్లలోకి భక్తులను పంపారు. భక్తుల కోసం రెండు హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. వీఎంసీ ఎదురుగా 30 కంపార్టుమెంట్లు, వీఎంసీకి వెనుక వైపున 30 కంపార్టుమెంట్లు ఏర్పాటు చేశారు. వినాయకుడి ఆలయం నుంచి వచ్చిన వారిని వీఎంసీ ముందు నుంచి వెనుక వైపున ఉన్న కంపార్టుమెంట్లలోకి పంపుతారు. అక్కడి నుంచి వీఎంసీ ఎదురుగా ఉన్న కంపార్టుమెంట్లలోకి పంపుతారు. అక్కడి నుంచి క్యూల్లోకి వదులుతారు. ఇలా హోల్డింగ్ పాయింట్లలో ఉండే భక్తుల కోసం లక్ష బిస్కెట్లను, మంచినీళ్ల సీసాలను పోలీసు శాఖ సిద్ధం చేసింది. మొత్తం 2.50 లక్షల మంది భక్తులు ఈసారి మూలా నక్షత్రం రోజున దర్శనానికి వస్తారని అధికారులు అంచనా వేశారు. భక్తుల రద్దీని గగనతలం నుంచ ప్రత్యక్షంగా వీక్షించి అంచనా వేయడానికి 50 డ్రోన్లను రంగంలోకి దింపారు. శరన్నవరాత్రి మిగతా 8లో..

4 లక్షల లడ్డూలు సిద్ధం

మూలానక్షత్రం సందర్భంగా భక్తులందరికీ ఉచిత లడ్డూ ప్రసాదం అందించనున్నారు. మొత్తం నాలుగు లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. లడ్డూ పరిమాణం 20 గ్రాములు మాత్రమే ఉంటుంది. కొండమీదకు వచ్చిన ప్రతి భక్తుడికి దర్శనం చేసుకుని వెళ్లే సమయంలో లడ్డూలను అందిస్తారు. పెద్ద లడ్డూలను మాత్రం లక్ష వరకు సిద్ధం చేసి ఉంచారు. అమ్మవారి అన్నదానం కూడా ప్రతి రోజూ 25 వేల నుంచి 35 వేల వరకు జరుగుతోంది. మూలానక్షత్రం రోజున మాత్రం లక్ష మంది అన్న ప్రసాదం స్వీకరించే అవకాశం ఉన్నందున ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, చిత్రంలో ఎంపీ కేశినేని చిన్ని తదితరులు



ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

ఆ దిశగా డబుల్ ఇంజన్ సర్కార్ కృషి

విజయవాడ ఉత్సవ్ - 2025 వేడుకల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

విజయవాడ సిటీ , సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ డబుల్ ఇంజన్ సర్కార్ ఏపీని ఆనంద ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ అన్నారు. భవానీపురం పున్నమి ఘాట్‌లో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్‌కు ఆదివారం రాత్రి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దసరా సందర్భంగా విజయవాడ ఉత్సవ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ కృషి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి జిల్లాలోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా 8లో..

అవనిగడ్డలో డయేరియా కలకలం

వాంతులు, విరేచనాలతో పదిమంది ఆస్పత్రిపాలు


అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు



అవనిగడ్డ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

అవనిగడ్డ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన అవనిగడ్డలో డయేరియా కలకలం రేపుతోంది. మూడు రోజులుగా డయేరియా లక్షణాలతో పది మంది ఆస్పత్రి పాలయ్యారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అవనిగడ్డ పంచాయతీలోని 7, 8 వార్డుల్లో గడిచిన మూడు రోజులుగా డయేరియా కేసులు నమోదవుతున్నాయి. శనివారం రాత్రికి పది మందికిపైగా రోగులు అవనిగడ్డ ఏరియా ఆస్పత్రిలో చేరారు. ఆదివారం ఉదయానికి అవనిగడ్డ ఆసుపత్రిలో 10 మంది రోగులు డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతుండగా, మరో ఇరువురు విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురు పిల్లలు బయట మిగతా 8లో..

ప్రకాశం బ్యారేజీకి మళ్లీ భారీ వరద



ఎగువ నుంచి 6.57 లక్షల క్యూసెక్కుల రాక

- రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- ముక్త్యాల, రావిరాల గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద

విజయవాడ/జగ్గయ్యపేట రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీకి మళ్లీ వరద పోటెత్తుతోంది. నిన్నటి వరకు లక్ష క్యూసెక్కుల వరకు వచ్చిన వరద ఇప్పుడు ఒక్కసారిగా పెరిగింది. తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో వరద ప్రవాహం పెరిగింది. పులిచింతల, పాలేరు, కీసర నుంచి 6,57,473 క్యూసెక్కుల నీరు వస్తోంది. బ్యారేజీ 69 గేట్లను పూర్తిస్థాయిలోకి ఎత్తి 6,46,821 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా పరిధిలోని కాల్వలకు 10,652 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇప్పుడు బ్యారేజీ వద్ద రెండో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సోమవారం వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పులిచింతల ప్రాజెక్టుకు నాగార్జున సాగర్ నుంచి 5,73,470 క్యూసెక్కుల నీరు వస్తోంది. దాని నుంచి 6,36,592 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మున్నేరు నుంచి 7,171 క్యూసెక్కుల నీరు వస్తోంది. కృష్ణానదికి వరద పోటెత్తటంతో తీరగ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో ముక్త్యాల, రావిరాల గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరటంతో రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీటమునిగాయి. వేదాద్రి వద్ద కృష్ణానది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రం పులిచింతల ప్రాజెక్ట్, కట్లేరు, వైరాయేరు, మునేరు ఇతర వాగుల నుంచి వరద పోటెత్తడంతో పలుచోట్ల లోతట్టు ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి.

సమసమాజ నిర్మాణ స్ఫూర్తి ప్రదాత గుర్రం జాషువా

8లో



మహా చండీ..



ఇంద్రకీలాద్రి భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవు కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఏడోరోజు దుర్గమ్మ మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 4 గంటలకే క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. వీఐపీల తాకిడితో సామాన్యులకు ఇబ్బందులు తప్పలేదు.



దుర్గమ్మ సేవలో..



ఆదాయం రూ.38.90 లక్షలు

ఇంద్రకీలాద్రి: దుర్గగుడిలో దసరా మహోత్సవాలలో ఆరోరోజైన శనివారం దేవస్థానానికి రూ. 38,90,856 ఆదాయం వచ్చినట్టు ఈవో శీనానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 15 లడ్డు ప్రసాద విక్రయం ద్వారా రూ 4,24,500, రూ. 100 లడ్డు ప్రసాద విక్రయం ద్వారా రూ.31,05,000 వచ్చినట్టు తెలిపారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన సేవ ద్వారా రూ.39 వేలు (టికెట్ రూ 3000), పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన ద్వారా రూ.20 వేలు (టికెట్ రూ 5000), చండీ హోమం ద్వారా రూ. 8 వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన ద్వారా రూ.30,696 పుస్తకాలు, ఫొటోలు, కాలెండర్లద్వారా రూ 13,345, తలనీలాల సమర్పణ రుసుం ద్వారా రూ.92,360, ఇతరత్రా ఆదాయం రూ5,500, యూపీఐ ద్వారా రూ.1,52,455 ఆదాయం సమకూరింది



ఈవోకు బంగారు ఆభరణాలను అందజేస్తున్న రాజేష్ కుటుంబసభ్యులు

కనకదుర్గమ్మకు బంగారు హారం, పట్టీలు కానుక

ఇంద్రకీలాద్రి : కనకదుర్గమ్మకు అలంకరణ నిమిత్తం బెంగుళూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సీఎం రాజేష్ భార్య ప్రకృతి పేరిట రూ.10 లక్షల విలువైన 90 గ్రాముల పట్టీలు, హారం కానుకగా సమర్పించారు.కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దుర్గమ్మను దర్శించుకున్న రాజేష్ ఈవో శీనానాయక్‌కు ఆభరణాలను అందజేశారు. గొల్లపూడికి చెందిన శ్రీమంజూష దేవస్థాన బోర్డు ఛైర్మన్ రాధాకృష్ణను కలిసి ఉచిత ప్రసాదం పంపిణీకి రూ. లక్ష విరాళం అందజేశారు.





జస్టిస్ కిరణ్మయి దంపతులు



రిటైర్డ్ జడ్జిలు కృపాసాగర్, సునీల్ చౌదరి దంపతులు



అజయ్ జైన్ దంపతులు, విజయానంద్



మహారాష్ట్ర ఎంపీ షిండే



నక్కా ఆనందబాబు, జ్యోతిసురేఖ

ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక రంగాలకు ప్రాధాన్యం

- మంత్రి కందుల దుర్గేష్

ఇంద్రకీలాద్రి,సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా పర్యాటక రంగాలకు పెద్దపీట వేస్తున్నట్టు మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం ఇంద్రకీలాద్రిపై మహాచండీ అలంకారంలో కనకదుర్గమ్మను కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా.. అమ్మవారి దర్శనం అనంతరం వేదపండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం మంత్రిర మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా పర్యాటక రంగాలకు కూటమి ప్రభుత్వంలో పెద్దపీట వేస్తున్నట్టు తెలిపారు. దసరా ఉత్సవాలలో ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయన్నారు. ఎంపీ కేశినేని చిన్ని, 'సొసైటీ ఫర్ విజయవాడ వైబ్రంట్' పేరిట విజయవాడలో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్‌కు పర్యాటక శాఖ తోడ్పాటునందిస్తోందన్నారు.

దుర్గమ్మ ఆశీస్సులతో అభివృద్ధి పథంలో..

- మంత్రి సవిత



కనకదుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. ఆదివారం కనకదుర్గమ్మకు చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణితో కలిసి పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గమ్మ చల్లని దీవెనలతో సీఎం చంద్రబాబునాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు.

వీఐపీల పేరుతో అడ్డదారిలో..

- కొండపై గేట్ల వద్ద గుమిగూడుతున్న జనం
- పోలీసులతో వాగ్వాదం.. తోసుకుంటూ ముందుకు పోతున్నవైనం

ఇంద్రకీలాద్రి,సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మదర్శనానికి వీఐపీల పేరిట విపరీతమైన తాకిడి నెలకొంది. ఘాట్ రోడ్డుమీదుగా ఓం మలుపు వద్ద పోలీసు బ్యారికేడింగ్, కొండపైన చినరాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన మీడియా పాయింట్ గేటు వద్ద, మరో పోలీసు బారికేడింగ్‌ల వద్ద జనం గుమిగూడుతున్నారు. వారిలో ఎవరు వీఐపీలో తెలియని పరిస్థితి. వీఐపీలకు స్లాట్‌లు ఇచ్చినప్పటికీ బేఖాతర్ చేస్తూ ఇష్టారాజ్యంగా వస్తున్నారు. గంటల తరబడి క్యూలలో సామాన్య భక్తులు పడిగాపులు పడుతుంటే వీరు మాత్రం అడ్డదారిలో దర్శనాలకు పంపాల్సిందేనని పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్నారు. వీరిని కట్టడి చేయడం ఎవరి తరం కావడం లేదు.

స్వీయ నియంత్రణ పాటించండి..

- ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)



విజయవాడ : మూలా నక్షత్రం రోజు ఎటువంటి పాసులకు అనుమతి ఉండదని, వీఐపీ దర్శనానికి వచ్చేవారు స్వీయ నియంత్రణ పాటిస్తే సామాన్య భక్తులు సత్వరమే దర్శనం చేసుకోగలుగుతారని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. ఆదివారం మహాచండీ అలంకరణలో అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, భక్తుల రద్దీకనుగుణంగా ఆలయ, ఇతర శాఖలకు చెందిన అధికారులు ఏర్పాట్లు చేశారన్నారు. కనకదుర్గమ్మ జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం రోజున అమ్మవారి దర్శనానికి సుమారు రెండు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశమున్నట్టు దేవస్థాన అధికారులు తెలిపారన్నారు. సామాన్య భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు నిరంతరం సమీక్షిస్తున్నారన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మహా చండీదేవిని వేడుకున్నానన్నారు.



వీఐపీల పేరుతో ఓం టర్నింగ్ వద్ద పోలీసు బీట్ బ్యారికేడ్లను తోసుకుంటూ వస్తున్న జనం, మీడియా పాయింట్ గేట్ వద్ద..

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం దసరా మహోత్సవాలలో ఆదివారం మహాచండీ అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారందరికీ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు. ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి విజయానంద్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్‌లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. జస్టిస్ మండవ కిరణ్మయి దంపతులు, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్ దంపతులు, మహారాష్ట్ర ఎంపీ శ్రీకాంత్ షిండే, రిటైర్డ్ జడ్జి కృపాసాగర్ దంపతులు, రిటైర్డ్ జడ్జి సునీల్ చౌదరి దంపతులు, తణుకు ఎమ్మెల్యే ఎ. రాధాకృష్ణ, నక్కా ఆనందబాబులు, మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి శేషవస్త్రం,ప్రసాదం, ఆశీస్సులు, చిత్రపటం ఆలయ అధికారులు అందజేశారు.



రామవరప్పాడు రింగ్ నుంచి డ్రోన్ కెమెరాతో భక్తుల రద్దీని పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీసీపీ తిరుమలేశ్వర్ రెడ్డి, అధికారులు

డ్రోన్ కెమెరాతో ట్రాఫిక్ సమస్యకు చెక్

గుణదల : ఇంద్రకీలాద్రికి ఆదివారం రాత్రి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానుండటంతో డ్రోన్ కెమెరా ద్వారా ట్రాఫిక్ సమస్యకు డీసీపీ తిరుమలేశ్వర్ రెడ్డి చెక్ పెట్టారు. రామవరప్పాడు రింగ్ నుంచి డ్రోన్ కెమెరాద్వారా సిబ్బందితో కలిసి రద్దీని క్రమబద్ధీకరిస్తున్నారు. మూలా నక్షత్రం కావడంతో సోమవారం దుర్గమ్మను సరస్వతిదేవి అలంకారంలో దర్శించుకునేందుకు భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రానున్న సందర్భంగా ఆయన ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. డీసీపీతో పాటుగా సీఐ సురేష్ కుమార్, ఆర్ఎస్ఐ ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

గుండె ఆరోగ్యానికి కొత్త భవిష్యత్తు ప్రెసిషన్ రీజనరేటివ్ మెడిసిన్

- భవిష్యత్తులో మనిషి జీవనకాలం పెంచే అవకాశం
- వ్యక్తిగత జీన్స్ ఆధారంగా చికిత్స రేపటి వైద్య విప్లవం
- చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రమేష్ బాబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గుండెను కాపాడుకోవటానికి మంచి జీవనశైలి అలవాటు చేసుకుంటే.. ప్రెసిషన్ మెడిసిన్, రీజనరేటివ్ మెడిసిన్స్ ద్వారా మానవ జీవితాన్ని వందేళ్లకు పైగా ఆరోగ్యవంతంగా ఉంచవచ్చని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ పోతినేని రమేష్ బాబు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మిలియన్ల మంది గుండెజబ్బులతో ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రెసిషన్ మెడిసిన్ రీజనరేటివ్ మెడిసిన్ వంటి సరికొత్త వైద్య సాంకేతికతను పూర్తిగా మార్చేశక్తి కలిగి ఉన్నాయని ఆయన అన్నారు. 'వరల్డ్ హార్ట్‌డే' సందర్భంగా గుండె ఆరోగ్యానికి సంబంధించి ఆయన పలు కీలక విషయాలు ఆదివారం మీడియాతో పంచుకున్నారు. గుండె జబ్బుల కారణంగా ప్రాణాలు కోల్పోయేవారికి వ్యక్తిగత జీన్స్ ఆధారంగా చికిత్సనందించటం రేపటి వైద్య విప్లవంగా అభివర్ణించారు. జీనోమిక్ డేటా, జీవనశైలి, పరిసరాల ఆధారంగా ప్రత్యేక చికిత్సలు నిర్వహించటం అన్నది ప్రెసిషన్ మెడిసిన్ కిందకు వస్తుందన్నారు. ఒకే మందు అందరికీ కాకుండా ప్రతి వ్యక్తి జీన్స్‌కు తగిన చికిత్సే భవిష్యత్తు అని చెప్పారు. శరీర కణజాల పునర్నిర్మాణమే రీ జనరేటివ్ మెడిసిన్ అని, దెబ్బతిన్న అవయువాలను తిరిగి పునరుద్ధరించడం కోసం ఇది ఉపయోగపడుతుందన్నారు. అవయువ పునసృష్టికి ఇండ్యూస్డ్ ప్లూరిపోటెంట్ స్టెమ్ సెల్స్ (ఐపీఎస్‌సీ) దోహదపడుతుందని తెలిపారు. సైన్స్, జెనోమిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కలిసినపుడు మానవ ఆరోగ్యానికి సరికొత్త పటం ఆవిర్భవిస్తుందని చెప్పారు.

కృష్ణాకు వరద ఉధృతి

- గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం
- పలుచోట్ల నిలిచిన రాకపోకలు
- నీట మునిగిన పంట పొలాలు

జగ్గయ్యపేట రూరల్/కంచికచర్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదికి వరద పోటెత్తటంతో తీరగ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో ముక్త్యాల, రావిరాల గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరటంతో రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీటమునిగాయి. వేదాద్రి వద్ద కృష్ణానది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. పులిచింతల నుంచి ఐదు గేట్లలో 6.27 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు నాగార్జునసాగర్, మూసీ వరదతో పాటు వాగులు, వంకలు పొంగి కృష్ణానదిలో కలుస్తున్నాయి. 6.10లక్షల నుంచి 6.50 లక్షల క్యూసెక్కులకు పైగా వరద పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పరీవాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. ముక్త్యాలలో రక్షణ గోడను తాకుతూ కృష్ణమ్మ ప్రవహిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రావిరాల వద్ద కృష్ణానది, పాలేటి వరద తాకిడికి ఒడ్డున ఉన్న గృహాల వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. వరద పెరిగితే ఏ క్షణంలోనైనా తరలివెళ్లేందుకు సిబ్బంది ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కృష్ణా పరివాహక గ్రామాల్లో అధికారులు హైఅలెర్ట్ ప్రకటించారు. వరద నీటితో ముక్త్యాల వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. చంద్రమ్మ కయ్య పొంగి పొర్లుతుండటంతో జగ్గయ్యపేట-ముక్త్యాల రహదారిని మూసివేశారు. తెలంగాణాలోని పలు సిమెంట్ కర్మాగారాలు, పులిచింతలకు వెళ్లే ప్రధాన రహదారి కావటంతో వాహనాలు నిలిచిపోయాయి. రావిరాల గ్రామంలోని కనిగడ్డ కయ్య ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి, కంది, తదితర పంటలు 30 ఎకరాల మేర పంటలు నీట మునిగాయని రైతులు పేర్కొన్నారు. చిల్లకల్లు, జగ్గయ్యపేట ఎస్ఐలు తోట సూర్య శ్రీనివాస్, రాజు, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శివాజీ, రెవెన్యూ అధికారులు పరిస్థితిని పరిశీలించారు.



రావిరాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద



కోతకు గురైన కృష్ణానది తీరం



ముక్త్యాల వద్ద చంద్రమ్మ కయ్యపై ప్రవహిస్తున్న నీరు

లోతట్టు ప్రాంతాలు జలమయం..

ఆదివారం సాయంత్రం పులిచింతల ప్రాజెక్టు, కట్లేరు, వైరాయేరు, మునేరు ఇతర వాగుల నుంచి వరద పోటెత్తడంతో పలుచోట్ల లోతట్టు ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. ముఖ్యంగా మున్నలూరు లంకభూముల్లో మున్నలూరు, మొగులూరు, ఏటూరు గ్రామాల్లో మినుము, కంద, చేమదుంప, ఇతరత్రా పంటలు నీటమునిగాయని, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని సర్పంచ్ కొంగర మురళి పేర్కొన్నారు. గనిఆత్కూరు లంక భూముల్లో కంద, అరటి, పసుపు పంటలు ముంపునకు గురయ్యాయి. లంకల్లో నివాసముంటున్న వారిని పడవల ద్వారా సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చామని పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ మూరకొండ ఏడుకొండలు తెలిపారు. గనిఆత్కూరు గ్రామం మధ్యలో ఉన్న వాగు వంతెనపై రెండఅడుగుల ఎత్తున వరద ప్రవహిస్తున్నది. చెవిటికల్లు గ్రామం వద్ద లక్ష్మయ్య వాగుకు వరద పోటెత్తింది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక అధికారులు అందుబాటులో ఉంటే తక్షణ చర్యలు తీసుకోవటానికి వీలుపడుతుందని తీరగ్రామాల ప్రజలు చెబుతున్నారు. అయితే ఎక్కువ మంది స్థానిక అధికారులు దుర్గగుడి ఉత్సవాల విధుల్లో ఉన్నారు.



వరద నీటిలో మినప చేను

ముంపు వాకిట లంక గ్రామాలు!

- పులిగడ్డ ఆక్విడెక్ట్‌ను తాకుతూ ప్రవహిస్తున్న కృష్ణానది
- సీతాయిలంక వద్ద పంట పొలాల్లోకి వరద నీరు

అవనిగడ్డ: ఎగువన భారీ వర్షాల కారణంగా వరద పోటెత్తడంతో దివి ప్రాంతంలోని కృష్ణా పరివాహక ప్రాంతంలోని లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి 6.40 లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీటిని ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేయటంతో వరద నీరు ఆక్విడెక్ట్‌ను తాకుతూ ప్రవహిస్తున్నది. మండల పరిధిలోని సీతాయిలంక వద్ద వరదనీరు పంట పొలాల్లోకి ప్రవేశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తీర గ్రామాల ప్రజల్లో ఆందోళన

వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఇప్పటికే కోతకు గురై నదిలో పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్ల గురించి ఎడ్లంక వాసులు ఆందోళన చెందుతున్నారు. నాగాయలంక మండల పరిధిలోని దివి గ్రామాల సమూహమైన ఎదురుమొండి దీవుల్లోని గొల్లమంద సమీపంలో మళ్లీ నదీ కోత మొదలైందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.



పాత ఎడ్లంక వదరదతో కోతకు గురవుతున్న గృహాలు



పులిగడ్డ ఆక్విడెక్ట్‌ను తాకుతున్న వరద నీరు

కారు ఢీకొని మహిళ మృతి

వన్‌టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బందరురోడ్డులోని ఒక హోటల్ ముందు ఆదివారం వేకువజామున ఆటోలో నుంచి కిందకు దిగుతున్న ప్రకాశం జిల్లాకు చెందిన రాగిపిండి విజయదుర్గ(35)ను వేగంగావచ్చిన కారు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో ఈమేరకు కేసు నమోదైంది. పామూరు మండలం మార్కొండపురానికి చెందిన విజయదుర్గ, ఆమె భర్త చిరువ్యాపారం చేసుకుని జీవిస్తున్నారు. ఆమె కుమారుడు తాడిగడపలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. దసరా సెలవులకు కుమారుడ్ని ఊరికి తీసుకువెళదామని గేట్‌వే హోటల్ సమీపంలో బంధువుల ఇంటికి వచ్చారు. అక్కడ ఆటో దిగుతుండగా బెంజిసర్కిల్ వైపునుంచి వేగంగా వచ్చిన కారు ఆమెను ఢీకొనగా అక్కడికక్కడే మృతిచెందింది. ఆటోడ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. కళ్లెదుటే భార్య విగత జీవురాలవడం పట్ల భర్త చంద్రశేఖరరెడ్డి తీవ్ర ఆవేదనకు గురయ్యాడు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

నేడు బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారుల సమావేశం

గుణదల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారుల సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు విజయవాడ బీఎస్‌ఎన్‌ఎల్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చుట్టుగుంటలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో వినియోగదారుల సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. వినియోగదారులు పాల్గొని బిల్లింగ్, ఇతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

వివిధ రూపాల్లో అమ్మ దర్శనం


ఆటోనగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో..


మహాచండీదేవిగా కాళీమాత


కృష్ణలంకలో సిద్దేశ్వరీ అమ్మవారు

లబ్బీపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఉత్సవాల్లోఆదివారం అమ్మవారు మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాణిగారితోటలోని మహాశక్తి ఆలయంలో అమ్మవారు మహచండీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్పొరేటర్ అడపా శేష ఆధ్వర్యంలో ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఆటోనగర్‌లో..

ఆటోనగర్: ఆటోనగర్ అభయాంజనేయస్వామి దేవాలయంలో అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, దీపాలంకరణసేవలు చేశారు. పంచహారతులు నిర్వహించారు.

భారతీనగర్: కరెన్సీనగర్ కాలనీలోని దాసాంజనేయ దేవస్థానంలో రామభక్తి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో అమ్మవారిని శ్రీమహచండీదేవిగా అలంకరించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

గుణదల మద్దిరావమ్మతల్లి దేవస్థానంలో..

గుణదల పాత పంచాయతీ కార్యాలయం సమీపంలోని మద్దిరావమ్మతల్లి దేవస్థానంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో మద్దిరావమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్‌ఆర్ గార్డెన్‌లోని మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మవారిని మహచండీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పటమట దర్శిపేటలోని రాజరాజేశ్వరి లలితా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మహాచండీదేవిగా అలంకరించారు. పటమట దత్తపీఠంలోని శ్రీమరకత రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని శ్రీ శక్తి దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కృష్ణలంక: త్రిశక్తి పీఠంలోని కాళీమాత అమ్మవారు భక్తులకు మహా చండీదేవిగా దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి అభిషేకం, కుంకం పూజలు, హోమాలు నిర్వహించారు. అలంకారానికి భారతుల విజయ్‌కిరణ్, లలిత దంపతులు పట్టుచీర సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో అమ్మవారు మహా చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సీఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుళ్లు సాంబయ్య, సత్యనారాయణ, కానిస్టేబుల్ మురళి, హోంగార్డు వెంకట్ పాల్గొన్నారు.

మహా చండీదేవిగా సిద్ధేశ్వరీ అమ్మవారు

కృష్ణలంక పాత పోస్టాఫీసు రోడ్డులోని సిద్ధేశ్వరీ పీఠ మహాసంస్థాన్ నందు పీఠదేవత సిద్ధేశ్వరీ అమ్మవారు మహా చండీదేవిగా దర్శనమిచ్చారు.

వారాహిమాత అవతారంలో..

రామలింగేశ్వరనగర్ : దేవీ భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వాహకులు వీరంకి మోహన్‌రావు, చిట్టిబొమ్మ బాల గంగాధరరావు, మోర్ల సుబ్బారావు ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారు వారాహీమాత అవతారంలో దర్శనమిచ్చారు.

మొగల్రాజపురం: మొగల్రాజపురం ధనకొండ మీద అమ్మవారిని చండీమాతగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కర శర్మ అధ్వర్యంలో పూజలు నిర్వహించారు. విశ్వమాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుంకర అక్కయ్యనాయుడు, ప్రసన్న వైట్ల తదితర కమిటీ సభ్యుల పర్యవేక్షణలో సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న వేడుకల్లో అమ్మవారిని శ్రీచండీ మాతగా అలంకరించారు. రుద్రాభిషేకం,చండీ హోమం, అమ్మవారికి కల్యాణం, చిత్రాన్నంతో నివేదన పూజలు చేశారు. సాయంత్రం లలితాపారాయణం, నీరాజన మంత్రపుష్పం, బతుకమ్మ ఆట, దశవిధ హారతులు, వేదస్వస్తి నిర్వహించారు. గాయత్రీనగర్, మొగల్రాజపురంలో అమ్మవారిని కాళరాత్రి దేవిగా ఊరేగించారు.


కరెన్సీనగర్ దాసాంజనేయస్వామి ఆలయంలో..


రామలింగేశ్వర నగర్‌లో వారాహిమాతగా..


ధన కొండపై చండీదేవి అలంకారంలో..

రేబీస్ నివారణ కోసం బాధ్యతతో పనిచేద్దాం

● జిల్లా వైద్యశాఖాధికారి సుహాసిని

విజయవాడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుక్క కాటు ద్వారా వచ్చే రేబీస్‌ను అరికట్టడానికి సమాజంలో అందరం ఉమ్మడి బాధ్యతతో పనిచేయాలని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని పిలుపునిచ్చారు. ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా "ఇప్పుడే వ్యవహరించండి.. మీరు, నేను సమాజం" అనే థీమ్‌తో ఆదివారం రేబీస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జీజీహెచ్‌లో పారిశుధ్యం, భద్రతా సిబ్బందికి రేబీస్ టీకాలైన పోస్ట్ ఎక్స్‌పోజర్ ప్రొఫిలాక్సిస్, ప్రీ ఎక్స్‌పోజర్ ప్రొఫిలాక్సిస్ మోతాదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జేడీ, ఐడీఎస్‌పీ డాక్టర్ మల్లేశ్వరి, ఐడీఎస్‌పీ డాక్టర్ పద్మజ, సీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ పద్మావతి పాల్గొనారు.

నగరవాసులను ఆకర్షిస్తున్న లేపాక్షి

కృష్ణలంక, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్వర్యంలో నగరంలోని లేపాక్షి దుకాణాల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శన, విక్రయాలకు విశేష స్పందన వస్తోందని మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ విశ్వ తెలిపారు. ఉడ్ కార్వింగ్, బొబ్బిలి వీణ, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, కలంకారి చీరలు, బెడ్‌షీట్స్ ఇత్తడి విగ్రహాలు, లోహ కళాఖండాలు, రాగి వస్తువులు, ఇంకా మరెన్నో సరికొత్త డిజైన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిసౌంట్ సేల్స్‌లో భాగంగా అక్టోబరు 1వ తేదీ వరకు ప్రతి వస్తువు కొనుగోలుపై ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తున్నట్లు తెలిపారు. గాంధీనగర్, ఐలాపురం ఎదురుగా ఉన్న లేపాక్షి షోరూమ్‌ను ప్రతి ఒక్కరూ సందర్శించి ప్రదర్శనలలో ఉన్న అపురూప కళాఖండాలను కొనుగోలు చేసి హస్త కళాకారులు జీవనోపాధికి సహకరించాలని కోరారు.

గురుకుల పాఠశాలను తరలించొద్దు

రామలింగేశ్వరనగర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలను ఆగిరిపల్లికి తరలించొద్దని పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎస్.మహాలక్ష్మి, ఉపాధ్యక్షుడు రామకృష్ణ కోరారు. పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్‌తో కలిసి భవానీనిపురం ఐరన్‌యార్డు సమీపంలోని పాఠశాలను సందర్శించారు. 211 మంది బాలికలున్న గురుకుల పాఠశాలను ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామానికి తరలించడం వలన ఆ ప్రాంతంలో సరైన భద్రత ఉండదన్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేని ఆ ప్రాంతంలో విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులు కూడా అనేక ఇబ్బందులు పడతారన్నారు. ఇక్కడే పాఠశాలను కొనసాగించాలని విద్యార్థుల తల్లిండ్రులు కోరుతున్నారు. ఇదే విషయంపై ఎంఎస్ బేగ్ పాఠశాల జాయింట్ సెక్రటరీ ఉబెదుల్లాకు సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమస్యను ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ బెవరసాయి సుధాకర్, టీడీపీ నేతలు తారిఖ్, అజీజ్, బూర కనకారావు, బంకా సుధాకర్ పాల్గొన్నారు.

యువత సన్మార్గాన్ని ఎంచుకోవాలి

అజిత్‌సింగ్‌నగర్ : యువత సన్మార్గాన్ని ఎంచుకోవాలని ఆల్ ఇండియా బాప్టిస్ట్ తెలుగు సంఘాల (బీసీటీసీ) జనరల్ సెక్రటరీ మంగలపూడి జోసెఫ్ అన్నారు. బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో యూత్ కాన్ఫరెన్స్ కార్యక్రమంపై ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన క్రీస్తు బోధనలు యువత సన్మార్గంలో నడవడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఆలపర్తి రాజేంద్రప్రసాద్, కోలా శ్రీమ్, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

తోటివారికి సాయం చేయాలి

సత్యనారాయణపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఉన్నదాంట్లో కొంత సాయం చేయాలని బేతేలు బైబిల్ కాలేజీ వ్యవస్థాపక డైరెక్టర్ నల్లూరి జయకుమార్ బాబు అన్నారు. ఆదివారం బేతేలు ప్రార్థన మందిరంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా కంటి చేస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ సల్మాన్ రాజు ఆధ్వర్యంలో 600మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 50మందికి కంటి ఆపరేషన్లు చేయాల్సిందిగా గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో యలవర్తి ఆంజనేయులు, మాదాసు నరేంద్ర, నల్లూరి విజయకుమారి, కటారి కృష్ణ పాల్గొన్నారు.

చెప్పుల స్టాండ్ కాదు.. ఫుట్‌పాతే



పాత రాజరాజేశ్వరిపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో ఆదివారం వినాయకుడి గుడి ప్రాంతం చెప్పుల స్టాండ్‌గా మారిపోయింది. ఆదివారం భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. వినాయకుడి గుడి వద్ద నుంచి క్యూలైన్లు ప్రారంభం కావడంతో దర్శనానికి వెళ్లే భక్తులు ఫుట్‌పాత్ పైనే చెప్పులు విడిచి దర్శనానికి వెళ్తున్నారు. దీంతో ఆ ప్రాంతం అంతా చెప్పుల స్టాండ్‌లా మారిపోయింది.

అసమానతలపై కలమెత్తిన జాషువా

జయంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్


గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి పలువురి నివాళి

గవర్నర్‌పేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక అసమానతలపై తన కవిత్వ కరవాలాన్ని ఝుళిపించిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా స్మరణీయులని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. కవికోకిల జాషువా జయంతిని పురస్కరించుకుని ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దగల జాషువా విగ్రహానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జల్లి విల్సన్ మాట్లాడుతూ సమాజంలోని కులాల అంతరాలపై జాషువా కలమెత్తారని అన్నారు. వివక్ష లేని సమసమాజాన్ని కాంక్షించిన జాషువా జీవితాన్ని అధ్యయనం చేయాలని కోరారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు బుట్టి రాయప్ప,అనపర్తి గుప్తా, అన్నవరపు నాగేశ్వరరావు, సంగుల పేరయ్య, కొడాలి ఆనందరావు, నజీర్, ఈదులూరి రాధాకృష్ణ, ఆర్.పిచ్చయ్య, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్: కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని తిరగబడ్డ గొప్ప కవి, ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించిన వ్యక్తి గుర్రం జాషూవా అని ప్రముఖ సాహితీవేత్త వేముల హజరత్తయ్య గుప్తా కొనియాడారు. తెలుగు కళారత్నాలు, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా కళావేదికలో గుర్రం జాషూవా జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక, సాహిత్య, కళా సేవ చేస్తున్న హజరత్తయ్య గుప్తా తదితరులను నిర్వాహకులకు ఘనంగా సత్కరించారు. కళాకారులు ఆలపించిన గీతాలు ఆహూతులను ఆలరించాయి. జి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా ఉందాం

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దె రామ్మోహన్



వృద్ధులను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దె రామ్మోహన్

సత్యనారాయణపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : వయోవృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యత అని ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహనరావు అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అరవింద్ ఉషా కటారియా, రోహిత్ సంగీత కటారియా సహకారంతో దుర్గాపురం విజయ్ నగర్‌సింగ్ కళాశాలలో ఆదివారం శతాధికవృద్ధుల సత్కారం జరిగింది. 14మంది శతాధిక వృద్ధులను సత్కరించి వారి నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. ట్రస్టుచైర్మన్ డాక్టర్ చల్లా హరీకుమార్, వైస్‌చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా దాతల సహకారంతోనిత్యావసర సరుకులు అందించడంతో పాటు ఉచితంగా వైద్యపరీక్షలు, మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీలు తట్టి అర్జునరావు, అమర ఉమామహేశ్వరరావు, ఎన్‌వీయూ సతీష్‌కుమార్, కె.మధుసూదనరావు, పి.లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


డ్రిల్‌లో ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే

ఉయ్యూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి గల పౌరులుగా ఎదిగేందుకు ఎన్‌సీసీ ఎంతో ఉపయోగ పడుతుందని కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే అన్నారు. 17వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ ఆర్మీవింగ్ వార్షిక శిక్షణ-2లో భాగంగా శ్రీవిశ్వశాంతి స్కూల్ ఆవరణ లో జరుగుతున్న ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ కార్యక్రమానికి ఆదివారం ఆయన హాజరై మిలటరీ సంబంధింత పలు అంశాలపై ఎన్‌సీసీ కేడెట్లకు అవగాహన కల్పించారు. మూడు జిల్లాలకు చెందిన వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 619 మంది కేడెట్లు పాల్గొనగా ఫైరింగ్, మ్యాప్‌రీడింగ్, డ్రిల్, ఫీల్డ్‌క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్, సైబర్ సెక్యూరిటీ, ఫైర్ ఫైటింగ్, ప్రకృతి వైపరీత్యాలపై ఎన్‌డీఆర్‌ఎఫ్‌చే అవగాహన కల్పించారు. డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ అజిత్ సింగ్‌తోమర్, క్యాంప్ ఎడ్జుడెంట్ కెప్టెన్ నవీన్‌కుమార్, వివిధ కళాశాలల ఎన్‌సీసీ ఆఫీసర్లు, ఆర్మీ పీఎం స్టాఫ్, సివిలియన్ స్టాఫ్ పాల్గొన్నారు.

గంజాయి మత్తులో కారు డ్రైవర్ వీరంగం

● వరుసగా రెండు ప్రమాదాలు
● ఆటోను ఢీకొనడంతో మహిళ దుర్మరణం

విజయవాడ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో కారు డ్రైవర్ నగరంలో వీరంగం సృష్టించాడు. వరుసగా రెండు ప్రమాదాలు చేసి ఒక మహిళను బలి తీసుకున్నాడు. ఈ ఘటన ఎంజీ రోడ్డులో శనివారం అర్ధరాత్రి జరిగింది. చెన్నుపాటి పెట్రోల్ బంక్ వీధికి షాబాజ్ హలీం సెంటర్ నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి గంజాయి మత్తులో కారు నడుపుతూ చెన్నుపాటి పెట్రోల్ బంకు వద్ద బుల్లెట్‌పై వెళుతున్న వ్యక్తిని ఢీకొట్టాడు. ఘటనలో అతడికి నడుము భాగంలో ఎముకలు విరిగాయి. ఇక్కడి నుంచి వేగంగా కారు నడుపుకొంటూ గేట్వే వద్దకు చేరుకున్నాడు. అక్కడ ఆటోను ఢీకొట్టాడు. ఆటో దిగుతున్న మహిళ ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. మృతురాలు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మహిళగా పోలీసులు గుర్తించారు. విజయవాడలో చదువుతున్న తన కుమారుడిని చూసేందుకు ఆమె వచ్చినట్టు తెలిసింది. కేసును కృష్ణలంక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సంగీత ఝరి.. నృత్య మయూరి

● విజయవాడ ఉత్సవ్‌లో ఉర్రూతలూగించిన సాంస్కృతిక ప్రదర్శనలు





ఆంధ్రజ్యోతి, విజయవాడ కల్చరల్: సంగీత ఝరి.. నృత్య ఝుడితో విజయవాడ ఉత్సవ్‌కు వచ్చిన ప్రేక్షకులు ఆనందసాగరంలో మునిగి తేలుతున్నారు. విజయవాడ ఉత్సవ్ 7వ రోజున కూచిపూడి నృత్య ప్రదర్శనలు, సంప్రదాయ సంగీత ప్రదర్శనలు, కళాకారుల నృత్యాలు, మిమిక్రీ, మ్యాజిక్ షో, హాస్యరసపు నాటికలు, పౌరాణిక నాటకాలు ఇలా.. నవరసాల పరవళింపుల గుభాళింపులతో తేలియాడారు.

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..

విజయవాడకు చెందిన విష్ణుబట్ల సంగీత కచేరీ సంగీతకృతులతో సభను హోరెత్తించింది. ఈ బృందం వినాయకుడి కీర్తన గిరిరాజపుత్ర కీర్తనతో ప్రారంభించి త్యాగరాజ స్వామి అర్చించిన కృతి సామజవరగమన, గరుడ గమన పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. కోనసీమకు చెందిన పీ వీరబాబు ప్రదర్శించిన వీరనాట్య ప్రదర్శన సందర్శకులను ఆహ్లాదపరిచింది. అయాచితుల ఫౌండేషన్ బృందం ప్రదర్శించిన పెళ్లిచూపుల నాటిక హాస్యాన్ని పండించింది. పెద్దాపురానికి చెందిన వనపర్తి కోటేశ్వరరావు తోలుబొమ్మలాట రామాయణ ఇతివృత్తంపై చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నగరానికి చెందిన వెంకట్ మ్యాజిక్ షో వీక్షకులను అబ్బురపరిచింది. హైదరాబాద్‌కు చెందిన స్నేహలతా బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యోత్సవాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలకు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ చైర్మన్ తేజస్వి పొడపాటి, ఏపీ నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ విచ్చేశారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో అద్భుత ప్రదర్శనలిచ్చిన వారిని ఎంపీ కేశినేని చిన్ని ఘనంగా సత్కరించారు.

ఘంటసాల సంగీత కళాశాలలో.. విజయవాడకు చెందిన యామిని, మోహన, బాలశ్రీ కలిసి ప్రదర్శించిన కూచిపూడి నృత్యం కన్నుల పండువగా సాగింది. కూచిపూడి నృత్య ప్రదర్శనలో పల్లవి, చంద్రిక, వర్షిణి పాల్గొన్నారు. విజయవాడకు చెందిన జీవీఆర్ సంగీత కళాశాల విద్యార్థులతో సంగీత కచేరీ కన్నుల పండువగా సాగింది. గాత్రం సీ లాస్యప్రియ, ప్రణాదలు అందించగా మృదంగం ఇందు వర్ధన్, వయోలిన్ మనసిజ సహకారం అందించారు. గుంటూరుకు చెదిన శివకుమార్ మిమిక్రీషో ప్రజలకు కళలపై మక్కువ తెచ్చింది.

ఇంద్రకీలాద్రి వేదికపై..

దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై అమ్మవారు మహాచండీదేవి అలంకారంలో దర్శనమిస్తుండగా ఆదివారం కొండ దిగువన కనకదుర్గానగర్‌లో దేవస్థానం ఏర్పాటు చేసిన కళా వేదికపై సంగీతం, నృత్యం వంటి లలిత కళలు ప్రదర్శన జరుగుతుంది. నగరానికి చెందిన ఎస్ ప్రసాద్ మృదంగ లయ విన్యాసం, బుర్రా నీలకంఠ శాస్త్రి భక్తి సంగీతం, రామచంద్రాపురానికి చెందిన వై శిఖామణి గానం చేసిన పార్వతీ కల్యాణం హరికథ, విజయవాడకు చెందిన ఆనంద్, ఫణీంద్ర కుమార్, కే శ్రీనివాస్ బృందాల కూచిపూడి నృత్యాలు భక్తులను ఆధ్యాత్మిక పారవశ్యంలో నడిపించాయి. శ్రీ కాళహస్తికు చెందిన మోహన్ తరుణీ, కంకిపాడుకు చెందిన అరుణ కల్యాణి నృత్యాలు, నగరానికి చెందిన రేవతి, రోహిణి బృందాల కోలాట ప్రదర్శనలు అలరించాయి.

పవిత్ర సంగమంలో..

పాడుతా తీయగా ఫేమ్ రసూల్ బాబు బృందం సినీ, భక్తి సంగీత విభావరి అలరించింది. లక్ష్మణ్ నాయక్, మల్లేశ్వరి, లక్ష్మీ తులసి శ్రావ్యంగా గానం చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఉషా మాధవి బృందం నగరానికి చెందిన శైలజ శ్రీ బృందం ప్రదర్శించిన కూచిపూడి, జానపదం నృత్యంశాలు, ఆకట్టుకున్నాయి. ముందుగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. విజేతలకు కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చిట్టిబాబు కమిషనర్ రమ్య కీర్తన బహుమతులు ప్రదానం చేశారు.

- అలరించిన రామ్ మిర్యాల టీమ్
- ఆకట్టుకున్న వీరబాబు వీరనాట్యం, శివకుమార్ మిమిక్రీ, వెంకట్ మ్యాజిక్ షో
- హాస్యపు విరిజల్లుల్లో ఓలలాడిన ఆహూతులు



రామ్ మిర్యాల రచ్చ

ఇబ్రహీంపట్నం: రామ్ మిరియాల లైవ్ మ్యూజిక్ కన్సర్ట్ గొల్లపూడి ఎగ్జిబిషన్‌లో ఆదివారం యువతను ఉర్రుతలూగించింది. యువతి, యువకులు, ఆడియన్స్ కుర్చీలు వదిలి స్టేజ్ వద్దకు చేరుకొని సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు. సుమారు గంటన్నర పాటు సాగిన రామ్ మిరియాల షో ప్రేక్షకులను కట్టిపడేసింది. కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం గరికపర్రుకు చెందిన రాజీవ్ బ్రదర్స్ వారు చేసిన డప్పు అండ్ డాన్స్ షో గొల్లపూడి ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజయవాడ ఎక్స్‌పో (గొల్లపూడి ఎగ్జిబిషన్)కు యాంకర్‌గా వ్యవహరించిన రేణుక రామ్ మిర్యాల షో ప్రారంభానికి ముందు అల్లరి అల్లరి చేసింది. స్టేజ్ వదిలి ఆడియన్స్ గ్యాలరీలోకి వచ్చి యువతతో పాటలు పాడించారు. ఎగ్జిబిషన్‌కు వచ్చిన ఆడియన్స్, భక్తులకు మంచి రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌కు మంచి ఆదరణ లభించింది. టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి.. రామ్ మిరియాల షోను ఎంజాయ్ చేశారు. ఆమె పక్కనే జడ్పీ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ కూర్చొని షోను ఎంజాయ్ చేశారు.

అపూర్వ కళా వైభవం..

డీఆర్‌డీవో శాస్త్రవేత్త సతీష్ రెడ్డి

విజయవాడ సిటీ: మరిచిపోయిన ఎన్నో మన కళాఖండాలను విజయవాడ ఉత్సవ్ నేటితరానికి పరిచయం చేస్తూ యువతను ఝుమరిపిస్తోందని డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) శాస్త్రవేత్త సతీశ్ రెడ్డి ప్రశంసించారు. పున్నమి ఘాట్ లో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్ ఆదివారం ఏడవ రోజుకు చేరుకుంది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. 11 రోజులు పాటు 5 ప్రాంతాల్లో వివిధ కళారూపాలను నేటితరం కళ్ల ముందు ఇస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. సినీ ఆధ్యాత్మిక గీతాలు, సినిమా పాటలతో సినీ సంగీత దర్శకుడు సాకే త్, ప్రణతి బృందం ప్రేక్షకులను అలరించారు. ఈ పాటలకు వేదిక కింద యువత స్టెప్పుల తో హోరెత్తించారు. సత్య మాస్టర్ బృందం చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



విజయవాడ ఉత్సవ్‌లో నేటి ప్రదర్శనలు

విజయవాడ: విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా 8వ రోజు సెప్టెంబర్ 29న సోమవారం నగరంలోని విజయవాడ ఉత్సవ్ వేదికల్లో జరిగే ప్రదర్శనలు సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమవుతాయి.

గొల్లపూడి ఎగ్జిబిషన్‌లో

సాంస్కృతిక ప్రదర్శనలు, మెలోడి బ్రహ్మ మణిశర్మ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్. భవానీపురం పున్నమి ఘాట్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు, చామేలెన్స్ స్వాప్ ది బీట్ లైవ్ కన్సర్ట్, దాండియా డీజే.

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో

శ్రీ లలిత ఐశ్వర్యాంబికా నృత్య కళాక్షేత్రం శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన, సంగీత కచేరీ ప్రదర్శన, విజయవాడకు చెందిన రాజీవ్ సోదరులతో డప్పుల ప్రదర్శన, కాకినాడకు చెందిన తోట అన్నవరం బృందంతో తోలుబొమ్మలాట, టీజీవీ కళాక్షేత్రం, కర్నూలు వారి పౌరాణిక పద్య నాటకం జగదేకసుందరి సామా.

ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో

విజయవాడకు చెందిన కావ్య శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన, సంగీత కచేరీ ప్రదర్శన, శ్రీకాకుళంకు చెందిన శెట్టి రాజు బృందంతో తప్పెట గుళ్ల ప్రదర్శన, కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన గొర్రెల రాము బృందంతో బుర్రకథ, ఆరాధన ఆర్ట్స్, గుంటూరు వారి సాంఘిక నాటికం పాప దొరికింది వంటి ప్రదర్శనలు జరుగుతాయి.

సమసమాజ నిర్మాణ స్ఫూర్తి ప్రదాత గుర్రం జాషువా

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్

కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కలాన్ని ఆయుధంగా వాడుకొని సమాజంలోని రుగ్మతలను రూపుమాపిన వ్యక్తి మహాకవి గుర్రం జాషువా అని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో నిర్వహించిన పద్మభూషణ్ గుర్రం జాషువా 130వ జయంతి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ తొలుత ఈ వేడుకలను మంత్రి దుర్గేశ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నవయుగ కవి చక్రవర్తి జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యం కోసం కృషి చేస్తున్న డాక్టర్ కనకదుర్గప్రసాద్ రావు, డాక్టర్ పాలపర్తి శ్రీధర్, మీసాల లక్ష్మణ్, పొట్లూరి హరికృష్ణ, కే గురువమ్మకు కవికోకిల పద్మభూషణ్ గుర్రం జాషువా 2025 పేరిట ఒక్కొక్కరికి రూ.50వేల నగదు పురస్కారాలను మంత్రి దుర్గేశ్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తొలుత సమావేశ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గుర్రం జాషువా చిత్రమాలికను మంత్రి దుర్గేశ్ పరిశీలించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు రచించిన విశ్వనరుడు పుస్తకాన్ని, కళారత్న డాక్టర్ పాలపర్తి శ్రీధర్ రచించిన ముక్తామణి పద్యశతకం పుస్తకాన్ని మంత్రి కందుల దుర్గేశ్ ఆవిష్కరించారు. అలాగే డిసెంబరు 27, 28న జరిగే ప్రపంచ తెలుగు కవుల మహాసభల పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని తన పాండిత్యంతో పరవశింపజేసిన మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా అన్నారు. అలాంటి విశ్వనరుడు పద్మభూషణ్ గుర్రం జాషువా 130వ జయంతి వేడుకల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గుర్రం జాషువా నడయాడిన శాసనమండలి నుంచే తన రాజకీయ జీవితం ప్రారంభమైందని మంత్రి గుర్తుచేసుకొన్నారు. భావితరాలకు ఆయన భావజాలాన్ని ముందకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ గొప్ప కవి గురించి ఈ తరానికి తెలియకపోవడం బాధాకరమన్నారు. సామాజిక రుగ్మతలను కలంతో రూపుమాపిన వ్యక్తి గుర్రం జాషువా అని కొనియాడారు. నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ సామాన్య మనుషులకు సైతం అర్థమయ్యే రీతిలో రచనలు చేసిన వ్యక్తి జాషువా అన్నారు. పురస్కార గ్రహీతలు కవికోకిల గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆయన ప్రస్థానాన్ని, కవిత్వాన్ని, సాహిత్య పాండిత్యాన్ని తమదైన శైలిలో వివరించారు. సాంస్కృతిక, సృజనాత్మక సమితి డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జునరావు, కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు సుమన్, శ్రీనివాస్, రంగస్థల, సినీ నటుడు మీసాల లక్ష్మణ్, నంది అవార్డు గ్రహీత డాక్టర్ కనకదుర్గా ప్రసాదరావు, కత్తి గురువమ్మ, డాక్టర్ శ్రీధర్, జానపద కళల అకాడమీ మాజీ చైర్మన్ పొట్లూరి హరికృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి దుర్గేశ్



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ పూర్వ ముఖ్య కార్యదర్శి పీవీ రమేష్

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమైన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీపీపీ విధానాన్ని (పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్) మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ పీవీ రమేష్ కోరారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన ప్రజారోగ్య వేదిక, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఆరోగ్యమనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా ఆరోగ్య హక్కు చట్టాన్ని తేవాలని, అభివృద్ధి చెందిన దేశాల్లోనూ వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ప్రజారోగ్యంపై పెట్టే ఖర్చులను భవిష్యత్తు కోసం పెట్టే ఖర్చుగా భావించాలన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఎక్కువ ప్రైవేట్ కళాశాలలు మనదేశంలోనే ఉన్నాయని, ప్రైవేట్ వైద్యం వ్యాపార దృక్పథంతోనే నడుస్తోందని ఆరోపించారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణయ్య మాట్లాడుతూ పీపీపీ పద్ధతిలో జరిగే వైద్య కళాశాల ప్రైవేటీకరణతో ఆ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లో పేద ప్రజలకు వైద్యం ఉచితంగా అందదన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ నియోలిబరలైజేషన్ ప్రపంచ వ్యాప్తంగా అంతిమ దశకు వచ్చిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం దాన్నే పట్టుకుని వేలాడుతున్నారన్నారు. సామాజిక కార్యకర్త కుర్రా వసుంధర మాట్లాడుతూ ప్రమాదకరమైన పీపీపీ విధానంపై న్యాయపోరాటం చేయాలన్నారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి టీ కామేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, వివిధ సంఘాల నేతలు ఐషె గోష్, జీ విజయ్, మాధవరావు, మాల్యాద్రి, వైద్యులు డాక్టర్ వీ రవీంద్ర, సురేష్‌చంద్రా రెడ్డి, సుమ పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులందరికీ 10 నుంచి 14 శాతం కంట్రీబ్యూషన్ పెంచాలి

● ఏపీసీపీఎస్ఈఏ

గాంధీనగర్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానంలో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు మాత్రమే కాదు ప్రతి ఒక్క సీపీఎస్ ఉద్యోగికి 10 నుంచి 14 శాతానికి కంట్రీబ్యూషన్ పెంచాలని లేదంటే సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీసీపీఎస్ఈఏ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.సతీష్, సీఎం.దాస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇతర ఉద్యోగులకు పెంచకుండా కేవలం ఆలిండియా సర్వీసెస్ అధికారులకు మాత్రమే పెంచడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. గతంలో 1338 జీవోను ఖండిస్తూ రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులందరికీ 14శాతం ప్రభుత్వ కంట్రీబ్యూషన్ పెంచాలని తాము చేసిన డిమాండ్‌ను పెడచెవిన పెట్టి ఇప్పుడు 1798 జీవో జారీ చేయడం అన్యాయమన్నారు. ఉద్యోగులందరినీ ప్రభుత్వం ఒకేలా చూడాలన్నారు. తక్షణమే ప్రభుత్వం ఐఏఎస్ అధికారుకు ప్రభుత్వ వాటాను 10 నుంచి 14 శాతానికి పెంచిన విధంగానే సీపీఎస్ ఉద్యోగులకు కూడా 2019 ఏప్రిల్ 1 నుంచి 14 శాతం పెంచాలని, మెమో 57 పరిధిలోకి వచ్చే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రపంచదేశాల్లో యోగాకు ప్రత్యేక గుర్తింపు

● జాతీయ యోగాసన పోటీల ప్రారంభోత్సవంలో ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, ఎంపీ కేశినేని



పోటీలను ప్రారంభిస్తున్న ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచదేశాల్లో భారతీయ యోగాకు ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనత మన ప్రధాని నరేంద్ర మోదీ అని ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు కొనియాడారు. పీబీ సిద్ధార్థ ఇండోర్ స్టేడియంలో జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న 6వ జాతీయ జూనియర్ సీనియర్ యోగాసన చాంపియన్ షిప్ పోటీల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా అనేది మనస్సుకు శరీరానికి సంబంధించిందన్నారు. మానసిక ఆరోగ్యానికి, శారీరక ఆరోగ్యానికి ప్రతి ఒక్కరు యోగా సాధన చేయాలన్నారు. విశిష్ట అతిథి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ యోగాసన పోటీలకు విజయవాడ వేదికవడం గర్వకారణమన్నారు. యోగా దినోత్సవం మన రాష్ట్రంలో విశాఖలో జరగడం గిన్నీస్ రికార్డు సాధించడం గుర్తు చేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ భారతీయ జీవన విధానంలో యోగా ఒక అద్భుతమని అందుకే ప్రపంచ దేశాలన్నీ నేడు యోగాను అనుసరిస్తున్నాయన్నారు. యోగా పోటీలకు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి 1,500 మంది వచ్చారని యోగాసన రాష్ట్ర సంఘం గౌరవాధ్యక్షులు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ చెప్పారు. అతిథులు క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ పోటీలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షరాలు ఏ రాధిక, కార్యదర్శి పీ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం రాజశేఖర్ రెడ్డి, యోగాసన భారత్ స్పోర్ట్స్ కన్సల్టెంట్ శ్రేయాస్ మార్కండేయ, ఎన్టీయార్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షుడు కొంగరసాయి పాల్గొన్నారు.

గాంధీహిల్‌కు పూర్వవైభవం తీసుకొస్తాం

వన్‌టౌన్: విజయవాడ వెస్ట్ రైల్వేబుకింగ్ వద్ద ఉన్న గాంధీహిల్‌కు పూర్వవైభవాన్ని తీసుకొస్తామని, ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆదివారం ఆయన గాంధీహిల్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను గాంధీహిల్ ఫౌండేషన్ చైర్మన్ కేపీసీ గాంధీ, వైస్ చైర్మన్ జంధ్యాల శంకర్‌తో కలిసి పర్యవేక్షించారు. అక్టోబరు 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా రానుండడంతో అందుకవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తన చిన్నతనం నుంచి గాంధీహిల్‌పై దేశంలోనే రెండో ప్లానిటోరియం ఉండేదన్నారు. అయితే పర్యవేక్షణ లోపం కారణంగా రూపం కోల్పోయిందన్నారు. కృష్ణా నది, కొండపల్లి బొమ్మలు, మూడు కాలువలు ఇలా ఎన్నో ప్రత్యేకతలు విజయవాడకున్నాయన్నారు. ఏ ఇజమూ లేదు, ఓన్లీ టూరిజం అని సీఎం చంద్రబాబు అంటుంటారని, ఆ మేరకు విజయవాడను ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందన్నారు. గాంధీ హిల్ అభివృద్ధికి అవసరమైతే ఎంపీ నిధులను కేటాయిస్తామన్నారు. కేపీసీ గాంధీ మాట్లాడుతూ గాంధీ హిల్‌ను 4 దశల్లో అభివృద్ధి చేయడానికి కృషి జరుగుతోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశోధకులు ఇక్కడికి వచ్చి మహాత్ముడి జీవన విధానంపై రీసెర్చ్ చేయడానికి అవసరమైన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో వంద గదులతో అతిథిగృహం నిర్మించాలని ప్రతిపాదించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ హిల్ చరిత్రను ఆయన వివరించారు.



గాంధీ హిల్‌పై ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీ శివనాథ్, గాంధీహిల్ ఫౌండేషన్ చైర్మన్ కేపీసీ గాంధీ, వైస్ చైర్మన్ జంధ్యాల శంకర్

పటిష్ట ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

ఉత్సవాలకు 42 డ్రోన్లను ఇప్పటికే ఉపయోగిస్తున్నారు. తాజాగా మరో 8 డ్రోన్లను తీసుకొచ్చారు. మొత్తం 17 ప్రదేశాలపై వాటితో గగనతలం నుంచి నిఘా పెడుతున్నారు. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, సీతమ్మవారి పాదాలు, పున్నమిఘాట్, కుమ్మరిపాలెం, ఇంద్రకీలాద్రి వెనుక వైపు ప్రాంతాల్లో డ్రోన్లను నిరంతరం గగనతలంలో ఉంచుతారు. మూల నక్షత్రం కారణంగా ఇంద్రకీలాద్రితోపాటు దిగువ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఘాట్ రోడ్డు మీదకు కేవలం వీవీఐపీల వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.

నేడు అమ్మవారికి ముఖ్యమంత్రి పట్టువస్త్రాల సమర్పణ

(5వ పేజీ తరువాయి)

వీఐపీలు ఉంటారని చెప్పారు. ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ సోమవారం మూడున్నర నుంచి నాలుగున్నర గంటల మధ్య సీఎం చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని తెలిపారు. కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణార్చన చేయించుకునే భక్తులకు భవానీ ఘాట్, గాంధీ మ్యూజియం నుంచి ఏర్పాటు చేసిన వాహనాల్లో రావాలని, మిగతా ఏ వాహనాలను అనుమతించడం లేదన్నారు

అవనిగడ్డలో డయేరియా కలకలం

(5వ పేజీ తరువాయి)

అల్పాహారం తిన్నట్లుగా చెబుతున్నారని, వారి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని అవనిగడ్డ ఏరియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సుమంత్ తెలిపారు. డయేరియా లక్షణాలు కనిపించిన ప్రాంతం వేకనూరు పీహెచ్‌సీ పరిధిలో ఉంది. 3 రోజులుగా పీహెచ్‌సీ సిబ్బంది ఎవరు ఆ ప్రాంతాన్ని సందర్శించి ప్రజలను అప్రమత్తం చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. 3 రోజుల క్రితం పంచాయతీ సిబ్బంది వచ్చి సున్నం చల్లి వెళ్లిపోయారని చెబుతున్నారు. వేకనూరు పీహెచ్‌సీ వైద్యాధికారిని వివరణ కోరగా, తమ సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. ఆ ప్రాంతంలో పారిశుధ్య చర్యలు ప్రారంభించామని చెప్పారు. అవసరాన్ని బట్టి 7, 8 వార్డుల్లో ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేస్తామని వివరించారు.

ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించారని తెలిపారు. చంద్రబాబు ఆలోచనలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, భాజపా సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో చేపట్టిన విజయవాడ ఉత్సవ్ అంగరంగ వైభవంగా జరుగుతోందన్నారు. ప్రభుత్వ సహకారంతో విజయవాడ ఉత్సవ్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తామని చెప్పారు. ప్రముఖ శాస్త్రవేత్త, డిఫెన్స్ ఎండ్ సైన్స్ ప్రభుత్వ సలహాదారుడు సతీష్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో విజయవాడ పరిసర ప్రాంతాల్లో డిఫెన్స్‌కు సంబంధించి పెద్ద ఎత్తున పరిశ్రమ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ యనమలకుదురు శివాలయం సమీపంలో భవాని ద్వీపం తరహాలో శివానీ ద్వీపంగా అభివృద్ధి చేస్తే నగరానికి మంచి ఆకర్షణగా ఉంటుందని తెలిపారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, తుని ఎమ్మెల్యే యనమల దివ్య మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ వంటి ఎన్నో కార్యక్రమాలు భవిష్యత్తులోనూ చేపట్టాలని ఆకాంక్షించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి ప్రసంగించారు.

చల్లగా చూడమ్మా..మహాచండికా..

(5వ పేజీ తరువాయి)


ఏడాది ఉత్పన్నమైన పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తిరుమల తరహా కంపార్టుమెంట్ల విధానాన్ని అమలు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో వస్తే వారిని నియంత్రించడానికి వీఎంసీ ఎదురుగా, వీఎంసీ వెనుక వైపున తాత్కాలికంగా కంపార్టుమెంట్లను ఏర్పాటు చేయించారు. ప్రతి కంపార్టుమెంట్‌కు చుట్టుపక్కల బారికేడ్లు ఏర్పాటు చేశారు. వినాయకుడి ఆలయం నుంచి ఇంద్రకీలాద్రిపై వరకు 1.08 కిలోమీటర్లు ఉన్న క్యూలైన్లు నిండిపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను ఈ కంపార్టుమెంట్లలోకి పంపారు. భక్తులను కూర్చోబెట్టడానికి మొత్తం 30 కంపార్టుమెంట్లు ఏర్పాటు చేశారు. వచ్చిన భక్తులను వచ్చినట్టుగా కంపార్టుమెంట్లలోకి పంపారు. క్యూలైన్లు ఖాళీ అవుతుండగా ఒక్కో కంపార్టుమెంట్ నుంచి భక్తులను క్యూలైన్లలోకి పంపారు. ఆదివారం నిమిషానికి 100 మంది భక్తులకు దర్శనం పూర్తయిందని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులతో కనిపించిన కంపార్టుమెంట్లు 3 గంటలకు ఖాళీ అయ్యాయి. ఆ సమయానికి ఒక కంపార్టుమెంట్‌లో మాత్రమే భక్తులు ఉన్నారు. ఆ తర్వాత వచ్చిన భక్తులు నేరుగా క్యూలైన్లలోకి చేరుకున్నారు. రాత్రి ఏడు గంటల సమయానికి 1,01,400 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 34,339 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు దర్శన సమయం 2.14 గంటలు పట్టింది. 3,829 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. 2,37,607 లడ్డూలను భక్తులు కొనుగోలు చేశారు. దర్శనానికి వచ్చి తప్పిపోయిన నలుగురు చిన్నారులను చైల్డ్ ట్రేసింగ్ ట్యాగ్ ద్వారా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కనకదుర్గమ్మ సోమవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. అమ్మవారి జన్మనక్షత్రం మూల రోజున ఈ అలంకారంలో కనిపిస్తారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



మూలానక్షత్రం సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి నుంచే ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి అలంకరణ నిమిత్తం క్యూలైన్లను ఆపినప్పటికీ భక్తుల రాక మాత్రం తగ్గలేదు. కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న తాత్కాలిక కంపార్టుమెంట్లన్నీ నిండిపోయాయి. ఆదివారం అర్ధరాత్రి దాటాక క్యూలైన్లు వదిలినప్పటికీ భక్తుల రాకపోకల్లో ఏమాత్రం మార్పు లేదు. తండోపతండాలుగా తరలివచ్చిన వారిని నియంత్రించడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

జనప్రవాహం

ఇంద్రకీలాద్రికి అర్ధరాత్రి పోటెత్తిన భక్తజనం



ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు దాటాక

కనకదుర్గ ఫ్లై ఓవర్ పక్కన కిక్కిరిసిన భక్తులు









కంపార్టుమెంట్లలో జనమే జనం



ఆదివారం ఉదయం క్యూలైన్లలో భక్తులు



ఆదివారం అర్ధరాత్రి కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న కపార్టుమెంట్లలో భక్తుల రద్దీ



ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పరిస్థితి




మూలా నక్షత్రం సందర్భంగా సోమవారం దుర్గమ్మను దర్శించుకునేందుకు ఆదివారం రాత్రికే చేరుకుని కంపార్టుమెంట్లలో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి కిటకిట..

రికార్డు స్థాయిలో తరలివచ్చిన భక్తులు.. అమ్మను దర్శించుకున్న 1.2లక్షల మంది

- మహాచండీదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ
- భక్తులతో నిండిన 30 తాత్కాలిక కంపార్టుమెంట్లు
- నేడు మూలానక్షత్రం.. భారీగా తరలివస్తున్న భక్తులు

విజయవాడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రి భక్తులతో పోటెత్తింది. శరన్నవరాత్రుల్లో ఏడోరోజు దుర్గమ్మ మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం సెలవు కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దిగువ నుంచి కొండపై వరకు క్యూలన్నీ తెల్లవారుజామున 4 గంటలకే నిండిపోయాయి. క్యూలైన్లు దాటిపోయి ఉన్న భక్తులను నియంత్రించి, తోపులాట లేకుండా చేయడానికి పోలీసులు, దేవస్థాన అధికారులు ముందే హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. వీఎంసీకి ఎదురుగా మొత్తం 30 తాత్కాలిక కంపార్టుమెంట్లు ఏర్పాటు చేశారు. ఈవన్నీ ఉదయం 10 గంటలకే నిండిపోయాయి. రాత్రి 10.30 గంటల సమయానికి 1,20,000 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



మహాచండీదేవి అలంకారంలో కనకదుర్గమ్మ

నేడు మూలానక్షత్రం.. సరస్వతీదేవి అలంకారం

కనకదుర్గమ్మ సోమవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. అమ్మవారి జన్మనక్షత్రం మూల రోజున ఈ అలంకారంలో కనిపిస్తారు. ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈసందర్భంగా భారీగా భక్తులు తరలి వస్తున్నారు.



మహాచండీదేవి అలంకారంలో అమ్మవారి దర్శనం కోసం కొండ కింద క్యూలైన్లలో భక్తులు

నేడు సీఎం పట్టువస్త్రాల సమర్పణ

కనకదుర్గమ్మకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 3.20 గంటలకు ఉండవల్లి నుంచి రోడ్డు మార్గంలో ఇంద్రకీలాద్రిపైకి చేరుకుంటారు. 3.30 నుంచి 4.30 గంటల మధ్య పట్టువస్త్రాలను సమర్పిస్తారు.

దక్షిణ కొరియాలో మంత్రుల పర్యటన

సియోల్‌లో హాన్ నదీ పరీవాహక ప్రాంతాల పరిశీలన

అమరావతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అమరావతితో పాటు సుస్థిర నగరాల నిర్మాణంపై అధ్యయనం, పెట్టుబడుల సాధన లక్ష్యంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ బృందం దక్షిణ కొరియాలో పర్యటిస్తోంది. దక్షిణ కొరియా రాజధాని సియోల్ నగరాన్ని చీల్చుతూ వెళ్లే హాన్ నదీ పరీవాహక ప్రాంతాన్ని మంత్రులు పి.నారాయణ, బీసీ జనార్దనరెడ్డి సందర్శించారు. ఆర్అండ్‌బీ, మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి కృష్ణబాబు, మునిసిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి కన్నబాబు తదితరులు ఈ బృందంలో ఉన్నారు. సియోల్ అభివృద్ధిలో అంతర్భాగంగా హాన్ నదీ పరీవాహక ప్రాంతం ఉండటాన్ని మంత్రుల బృందం గుర్తించింది. ఆహ్లాదకర వాతావరణంలో పర్యాటకులను ఆకర్షించేలా ఈ ప్రాంతం ఉంది. రాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతి నిర్మాణంలో సైతం ఇటువంటి ఆహ్లాదకరవాతారణానికి అనువుగా కృష్ణా నదీ తీర ప్రాంతం ఉందని మంత్రులు విశ్లేషించారు. అమరావతిలోనూ హాన్ నదీ తీరప్రాంతంలో అభివృద్ధి చేసినట్లుగానే.. ఉద్యానవనాలు, సైక్లింగ్ ట్రాక్‌లు, ఆధునిక సాంకేతికతతో కూడిన బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టాలని మంత్రులు నిర్ణయించారు. రాష్ట్రంలోని నదీతీర ప్రాంతాల్లో ఇలాంటి నగరాలను అభివృద్ధి చేయాలన్న అభిప్రాయం మంత్రుల బృందం వ్యక్తం చేసింది.



దక్షిణ కొరియా పర్యటనలో నామీ ద్వీపం సీఈవో మిన్ క్యోంగ్ వూతో భేటీ అయిన మంత్రి నారాయణ

నామీ ద్వీపం సీఈఓతో నారాయణ భేటీ

నామీ ద్వీపం సీఈఓ మిన్‌క్యోంగ్ వూతో మంత్రి భేటీ అయ్యారు. దక్షిణ కొరియాలో ఉన్న నామీ ద్వీపం సహజ సిద్ధమైన, సాంస్కృతిక, సంప్రదాయక పర్యాటక ప్రదేశంగా ఉంది. సియోల్‌లో ఉన్న అతి పెద్ద పర్యాటక ప్రాంతమిది. అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్లతో ఏడాది పొడవునా సంగీత ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తోందీ ద్వీపం. 4.60 లక్షల చ.మీ విస్తీర్ణంలో అందమైన చెట్లు, పూల మొక్కలు ఉన్నాయి.



శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎంజీబీఎస్ నుంచి బస్సులు ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మూసీ వరదతో జలదిగ్బంధంలో చిక్కుకున్న హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ స్టేషన్(ఎంజీబీఎస్) ఆదివారం తేరుకుంది. నీటి ప్రవాహం తగ్గడంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పారిశుధ్య సిబ్బంది శ్రమించి ప్లాట్‌ఫాంలు, బస్ స్టేషన్ ఆవరణలో బురదను తొలగించారు. ఆదివారం ఉదయం పదకొండు తర్వాత బస్సుల రాకపోకలు ప్రారంభమయ్యాయి. కాగా, మూసారంబాగ్ బ్రిడ్జి కింద అలీ కేఫ్ చౌరస్తా సమీపంలో మూసీలో కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు జంట జలాశయాల నుంచి నీటిని విడుదల చేయడంతో మూసీ వరద ప్రవాహానికి కొండచిలువ కొట్టుకు వచ్చి ఉంటుందని భావిస్తున్నారు.

12 కిలోల గంజాయి స్వాధీనం

కేరళకు చెందిన 11మంది విద్యార్థుల అరెస్టు

బెంగళూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా కేంద్రం మంగళూరులోని ఓ ఫ్లాట్‌లో ఏకంగా 12 కిలోల గంజాయిని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో మంగళూరు దక్షిణ విభాగ పోలీసులు అత్తావర కాపిగుడ్డ కింగ్స్‌కోర్టు అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో సోదాలు చేయగా 12 కిలోల గంజాయి పట్టుబడింది. ఇందుకు సంబంధించి కేరళకు చెందిన 11 మంది విద్యార్థులను అరెస్టు చేశారు. ముగ్గురు విద్యార్థులు గంజాయి కొనుగోలు చేసి తీసుకురాగా, ప్యాకెట్లుగా మార్చి విక్రయించాలని నిర్ణయించారు. పట్టుబడిన గంజాయి విలువ 2.45లక్షలు ఉంటుందని, దీనిని ఒడిశా నుంచి తెప్పించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రెండు డిజిటల్ తూనికలు, 11 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు కమిషనర్ సుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన విద్యార్థులంతా మంగళూరులోని ఓ కళాశాలలో బీబీఏ సెకండియర్ చదువుతున్నారు. గతవారం ఉడుపిలో ఇద్దరు బిజినెస్ మేనేజిమెంట్ విద్యార్థులు గంజాయి విక్రయిస్తూ అరెస్టు అయ్యారు. వారు ఇచ్చిన సమాచారంతోనే దాడి జరిగినట్లు తెలుస్తోంది.

రెండు డీఏలు ప్రకటించండి

- రెవెన్యూ అధికారుల సంఘం డిమాండ్

విజయవాడ (గాంధీనగర్), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వాటిని పరిష్కరిస్తారనే నమ్మకంతో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టేందుకు వారు కృషి చేశారని రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్ రవీంద్రరాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన చేస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఐఆర్ ప్రకటిస్తారని ఉద్యోగులు ఎంతో ఆశించారని, కనీసం నాలుగు పెండింగ్ డీఏలను కూడా విడుదల చేయలేదని ఆరోపించారు.

వీఆర్ఏల వేతనాలు పెంచాలి: బొప్పరాజు

వీఆర్వోలు, వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. వీఆర్ఏల జీతాలు తక్షణమే పెంచాలని, అర్హత కలిగిన వారికి వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు.

బిజినెస్

స్విట్జర్లాండ్‌లో రుద్రాక్షకు భలే డిమాండ్



న్యూఢిల్లీ: భారతీయ ఆధ్యాత్మికతకు ప్రతీక అయిన రుద్రాక్షలు ఇప్పుడు అంతర్జాతీయ వెల్‌నెస్ మార్కెట్‌లో కీలక స్థానం ఏర్పడింది. ప్రధానంగా స్విట్జర్లాండ్‌లో భారతీయ ప్రవాసులే కాకుండా, స్థానిక ప్రజలు కూడా రుద్రాక్షల కోసం విపరీతమైన ఆసక్తి కనబరుస్తున్నారు. ఇదిభారత ఎగుమతిదారులకు అద్భుతమైన అవకావమని అధికారులు చెబుతున్నారు. వచ్చే నెల 1 నుంచి అమలులోకి రానున్న ఇండియా-ఈఎఫ్‌టీఏ వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టీఈపీఏ).. ఇందుకు ప్రధాన దోహదకారి కానుందని అధికారులంటున్నారు. 2024-25లో భారత్ రూ.0.97 కోట్ల విలువైన రుద్రాక్షను ఎగుమతి చేసింది. ప్రవాస భారతీయులే కాకుండా స్థానిక స్విస్ ప్రజల్లో వెల్‌నెస్, యోగాపై పెరుగుతున్న ఆసక్తిని ఆసరా చేసుకుని జ్యూరిచ్‌లోని యోగా ఆన్‌లైన్ స్టోర్లు, వెల్‌నెస్ దుకాణాలు శరీరాన్ని చల్లబరిచే శక్తి కలిగిన ఉత్పత్తులుగా రుద్రాక్షకు ప్రచారం కల్పిస్తున్నాయి. ఒక్కో మాలను 50 స్విస్ ఫ్రాంకులకు (దాదాపు రూ.4,659) విక్రయిస్తున్నాయి.

ఆటుపోట్లకు అవకాశం

దేశీయ స్టాక్ మార్కెట్ ఈ వారం తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే అవకాశముంది. ఇప్పటికే ఏడు వరుస సెషన్లలో ప్రధాన సూచీలు పతనమవుతూ వచ్చాయి. ఒకవైపు ట్రంప్ టారిఫ్ ప్రకటనలు, మరోవైపు ఎఫ్ఐఐలు వెళ్లిపోతుండడం, భౌగోళిక-రాజకీయ పరిణామాలు ఇందుకు కారణం. సానుకూల సెంటిమెంట్ నెలకొంటే మళ్లీ కొనుగోళ్లు పెరగొచ్చు. ప్రస్తుతం నాన్ ఫెర్రస్ మెటల్స్, ఐరన్ అండ్ స్టీల్, ఇన్‌ఫ్రా, ఆటోమొబైల్, పవర్ సెక్టార్లో కాస్త మూమెంటమ్ కనిపిస్తోంది.

స్టాక్ రికమెండేషన్స్

గోద్రేజ్ ఆగ్రో: ఈ ఏడాది జూలై నుంచి ఈ షేర్ డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తూ మరోసారి కీలక మద్దతు స్థాయికి చేరుకుంది. గత శుక్రవారం 4.09% లాభంతో రూ.715 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు స్వల్పకాల వ్యూహంతో రూ.700పై స్థాయిలో కొనుగోలు చేయవచ్చు. రూ.825 టార్గెట్ పెట్టుకోవాలి. స్టాప్‌లాస్ :రూ.675.

టీవీఎస్ మోటార్స్: కొన్ని నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం పుల్‌బ్యాక్ అయింది. కీలక 20 ఈఎమ్ఏ వద్ద కదలాడుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. ఈ సెక్టార్‌పై సానుకూల ప్రభావం ఉంది. గత శుక్రవారం రూ.3,414 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.3,550 టార్గెట్ ధరతో రూ.3,400 శ్రేణిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.3,370.

మ్యాక్స్ హెల్త్: జీవితకాల గరిష్ఠానికి చేరాక ఈ షేర్లలో దిద్దుబాటు మొదలై ఇప్పటికే 15% మేర పతనమైంది. పరిస్థితులు అనుకూలిస్తే మళ్లీ పుంజుకోవచ్చు. గత శుక్రవారం రూ.1123 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు స్వింగ్ ట్రేడ్ చేయొచ్చు. రూ.1250/1300 టార్గెట్ ధరతో రూ.1100 శ్రేణిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ. 1070.

మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్స్: కొన్ని నెలలుగా సైడ్‌వేస్‌లో చలిస్తున్న ఈ షేర్లలో రిలేటివ్ స్ట్రెంత్ పుంజుకుంటోంది. గత శుక్రవారం రూ.279 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.340 టార్గెట్ ధరతో రూ.270 స్థాయిలో ప్రవేశించవచ్చు. స్టాప్‌లాస్ : రూ.250.

ఏయూ బ్యాంకు: జూలై నుంచి క్రమంగా దిద్దుబాటుకు లోనైన ఈ షేర్లు ప్రస్తుతం పుంజుకుంటున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.743 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.840 టార్గెట్ ధరతో రూ.740/720 శ్రేణిలో పెట్టుబడి పెట్టవచ్చు. స్టాప్‌లాస్ : రూ. 700.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

రూ.2,000 కోట్లతో చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు

దేశవ్యాప్తంగా 72,300 స్టేషన్లు; నోడల్ ఏజెన్సీగా భెల్.. కేంద్రం మార్గదర్శకాలు జారీ



న్యూఢిల్లీ: విద్యుత్ వాహనాల వ్యాప్తికి సమస్యగా మారిన చార్జింగ్ స్టేషన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రభుత్వ నిర్వహణలో రూ.2,000 కోట్ల పెట్టుబడితో దేశవ్యాప్తంగా 72,300కు పైగా చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. పీఎం-ఈ డ్రైవ్ కింద ఏర్పాటు చేసిన రూ.10,900 కోట్ల ప్రత్యేక నిధి నుంచి ఈ పథకానికి అవసరమైన రూ.2,000 కోట్లు ఖర్చు చేస్తారు. భెల్‌ను ఈ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు నోడల్ ఏజెన్సీగా నియమించారు.

ప్రధాన మార్గదర్శకాలు

- ప్రభుత్వ కార్యాలయాలు, నివాస సముదాయాలు, ఆస్పత్రులు, విద్యా సంస్థల్లో ఏర్పాటు చేసే ఈవీ చార్జింగ్ స్టేషన్లకు పూర్తి సబ్సిడీ.
- కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణ కింద నగరాలు, రహదారులు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, ఓడ రేవులు, పెట్రోల్ బంకుల వద్ద ఏర్పాటు చేసే చార్జింగ్ స్టేషన్ల యంత్ర పరికరాలపై 70% నుంచి 80% సబ్సిడీ.
- నగరాల్లోని రోడ్లు, షాపింగ్ మాల్స్, మార్కెట్ కాంప్లెక్స్‌ల వద్ద ఏర్పాటు చేసే చార్జింగ్ స్టేషన్ల పరికరాల ధరపై 80% వరకు సబ్సిడీ.
- బ్యాటరీ స్వాపింగ్, బ్యాటరీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు 80% వరకు సబ్సిడీ.
- నిబంధనల అమలు, పనితీరు ఆధారంగా సబ్సిడీ విడుదల.
- పది లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలు, స్మార్ట్ నగరాలు, మెట్రోతో అనుసంధానమైన పట్టణాలు, రాష్ట్రాల రాజధానులు, జాతీయ, రాష్ట్ర రహదారులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రాధాన్యత.

మరో పావు శాతం రెపో కోత?

- ఎస్‌బీఐ రిసెర్చ్ అంచనా
- నేటి నుంచి ద్రవ్య విధాన కమిటీ భేటీ
- బుధవారం ఆర్‌బీఐ పాలసీ



ముంబై: ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) నేటి నుంచి మూడు రోజుల పాటు భేటీ అవుతోంది. వచ్చే రెండు నెలల పాటు అమలులో ఉండే ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధానాన్ని బుధవారం మల్హోత్రా ప్రకటించనున్నారు. అయితే ఈ సారి కూడా కీలక రెపోరేటును ఎంపీసీ యథాతథంగా ప్రస్తుత 5.5 శాతం వద్దే ఉంచుతుందా లేక మరో పావు శాతం తగ్గిస్తుందా అనే అంశంపై ఆర్థిక నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఎస్‌బీఐ రీసెర్చ్ మాత్రం రెపోరేటును ప్రస్తుత 5.5 శాతం నుంచి 5.25 శాతానికి కుదించే అవకాశం ఉందని అంచనా వేసింది. రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం 4% కన్నా దిగువనే ఉండడం ఇందుకు ప్రధానంగా దోహదం చేస్తుందని తెలిపింది. క్రిసిల్ ప్రధాన ఆర్థికవేత్త ధర్మకీర్తి జోషి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

మళ్లీ యథాతథ స్థితే !

రిటైల్ ద్రవ్యోల్బణం అదుపులోనే ఉన్నప్పటికీ ఈ సారి కూడా రెపోరేటును యథాతథంగా 5.5 శాతం వద్ద కొనసాగించే అవకాశమే ఎక్కువనే వాదన కూడా వినిపిస్తోంది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ట్రంప్ సుంకాల ప్రభావంపై ఇంకా ఒక అంచనాకు రాలేకపోవడం ఇందుకు కారణమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. 'అక్టోబరు 1న వెలువడే భేటీలోనూ ఎంపీసీ రెపోరేటులో మార్పులు చేసే అవకాశం తక్కువ. ప్రస్తుతం అంత అవసరం సైతం లేదు' అని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ప్రధాన ఆర్థికవేత్త మదన్ సబ్నవిస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. జీఎస్‌టీ 2.0 నేపథ్యంలో రిటైల్ ద్రవ్యోల్బణం పెద్దగా పెరిగే ప్రమాదం లేకపోవడం, జీడీపీ వృద్ధి రేటుకూ ఢోకా లేకపోవడం కూడా ఆర్‌బీఐ నిర్ణయాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

24,600 దిగువన మరింత బలహీనం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మొత్తం ఐదు రోజులూ ఎడతెరిపి లేని డౌన్‌ట్రెండ్‌లో ట్రేడయి 670 పాయింట్ల నష్టంతో గత శుక్రవారం 24,650 వద్ద ముగిసింది. ర్యాలీ అనంతరం మూడు వారాలుగా బలమైన కరెక్షన్‌లో ట్రేడవుతుండడం మరింత అప్రమత్త సంకేతం. గత వారం ఊహించిన దాని కన్నా ఎక్కువ కరెక్షన్ సాధించడమే కాకుండా కీలక స్థాయి 25,000 కన్నా దిగజారింది. భారీ అమ్మకాల ఒత్తిడి కారణంగా మిడ్‌క్యాప్-100 సూచీ 2,700 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 940 పాయింట్ల మేరకు నష్టపోయాయి. మార్కెట్లో ప్రధాన ట్రెండ్ బలహీనంగానే ఉంది. గత వారం నిట్టనిలువుగా పతనమైనందు వల్ల టెక్నికల్ రికవరీకి ఆస్కారం ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ముందుగా మార్కెట్ స్థిరపడాలి. కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: మైనర్ రికవరీ బాట పట్టినట్టయితే భద్రత కోసం మైనర్ నిరోధం 24,800 వద్ద నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 25,000. ఇదే స్వల్పకాలిక నిరోధం కావడం వల్ల ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 24,600 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలం కావడం మరింత బలహీనత సంకేతం. ప్రధాన మద్దతు స్థాయి 24,300. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనత ప్రదర్శిస్తుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 24,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారంలో డౌన్‌ట్రెండ్‌లో ట్రేడయి ఈ నెలకు కనిష్ఠ స్థాయి 54,400 వద్ద ముగిసింది. ప్రధాన నిరోధ స్థాయి 55,000. ప్రధాన మద్దతు స్థాయి 54,000. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. అప్రమత్తత తప్పదు.

పాటర్న్: మార్కెట్ దీర్ఘకాలిక సైడ్‌వేస్ ట్రెండ్‌లో ఉంది. గత కొద్ది నెలలుగా స్వల్పకాలిక ఎగుడు దిగుడులు, డౌన్‌ట్రెండ్ పాటర్న్‌లు ఏర్పడ్డాయి. సానుకూలత కోసం 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	25,800, 24,860
మద్దతు	24,600, 24,520

ఈ వారంలో రెండు ఐపీఓలు

న్యూఢిల్లీ: ఈక్విటీ మార్కెట్లో ఈ వారం రెండు ప్రాథమిక పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ) విడుదల కానున్నాయి. అహ్మదాబాద్‌కు చెందిన సుబా హోటల్స్ ఇష్యూ సోమవారం ప్రారంభమై బుధవారం ముగుస్తుంది. కోవర్కింగ్ విభాగంలోని వియ్ వర్క్ ఇష్యూ వచ్చే శుక్రవారం ప్రారంభమై అక్టోబరు 7వ తేదీన ముగుస్తుంది. రూ.75.47 కోట్ల సమీకరణ లక్ష్యంగా మార్కెట్లోకి వస్తున్న సుబా హోటల్స్ షేరు ధర శ్రేణిని రూ.105-111గా ప్రకటించింది.

- వియ్ వర్క్ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఇష్యూ జారీ చేస్తోంది. ఈ కంపెనీ బెంగళూరు, పుణె, హైదరాబాద్, గురుగ్రామ్, నోయిడా, ఢిల్లీ, చెన్నై నగరాల్లో కార్యాలయాలు నిర్వహిస్తోంది.
- స్పిరిట్ తయారీ కంపెనీ ఆల్కోబ్రూ డిస్టిలరీస్, ఫిన్‌టెక్ కంపెనీ పే నియర్‌బై, ప్రెసిషన్ కాంపోనెంట్స్ తయారీదారు ఎంఐఎం, కేబుల్ తయారీలోని లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా, డిజిటల్/ఐటీ కన్సల్టింగ్ రంగంలోని సీఎస్ఎం టెక్నాలజీస్‌తో పాటు బిహారీ లాల్ ఇంజనీరింగ్ కంపెనీలు ఐపీఓల జారీకి అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు సమర్పించాయి.

25000 పైన బుల్లిష్

(సెప్టెంబరు 29-అక్టోబరు 3 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గ్రహ శక్తి

నిఫ్టీ గతవారం 25201-24629 పాయింట్ల మధ్యన కదలాడి 672 పాయింట్ల నష్టంతో 24655వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24974, 24864, 24932, 24162 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి : 25000 బ్రేక్‌డౌన్ స్థాయి : 24300

నిరోధ స్థాయిలు : 24850, 24950, 25050 (24750 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 24450, 24350, 24250 (24550 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	550
వరంగల్	502	గోదావరి	540
చిత్తూరు	543	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	117
వరంగల్	105	గుంటూరు	120
కరీంనగర్	105	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	97
కర్నూలు	105	నెల్లూరు	102
విశాఖపట్నం	122	అనంతపురం	102
గోదావరి	117		

చిత్రజ్యోతి

SINCE 1965

వినయ విధేయ రామ



రామ్‌చరణ్ ఇండస్ట్రీలో హీరోగా 18 ఏళ్ల కెరీర్‌ను పూర్తిచేసుకున్నారు. 2007లో పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'చిరుత' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు చరణ్. 'మగధీర', 'రంగస్థలం', 'ఆర్ఆర్ఆర్' లాంటి సినిమాలతో బాక్సాఫీసు దగ్గర సత్తాచాటారు. ప్రస్తుతం ఆయన బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' సినిమాలో నటిస్తున్నారు. ఇందులో చరణ్ ఊరమాస్ లుక్‌లో కనిపించనున్నారు. ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. "మా 'పెద్ది' 18 ఏళ్ల సినీ కెరీర్‌ను పూర్తిచేసుకోవడం ఎంతో సంతోషకరం. తెరపై ఘనమైన వారసత్వాన్ని కొనసాగిస్తూనే, బయట వినయ విధేయతలు కలిగి ఉండడం చరణ్ ప్రత్యేకత. నటుడిగా తనకంటూ ఓ ప్రత్యేకమైన పంథాను ఏర్పాటు చేసుకున్నాడు. 'పెద్ది' నుంచి త్వరలోనే మరిన్ని సర్‌ప్రైజులు ఉండబోతున్నాయి' అని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



గొప్ప బ్లాక్‌బస్టర్‌గా నిలుస్తుంది

ఎన్టీఆర్

'నా బాల్యంలో మా అమ్మమ్మ కొన్ని కథలు చెప్పారు. అవి నా కెంతో బాగా నచ్చేవి. ఆ కథల నుంచి ఓ దర్శకుడు 'కాంతార' లాంటి గొప్ప 'సినిమా తీస్తాడని నేను ఏ రోజూ ఊహించలేదు. నా సోదరుడు రిషబ్‌శెట్టి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. 'కాంతార: చాప్టర్ 1' కోసం ఆయన పడిన కష్టం నేను కళ్లారా చూశాను. ఇలాంటి సినిమా తీయడం మామూలు విషయం కాదు. ఒక గొప్ప బ్లాక్‌బస్టర్‌గా నిలుస్తుంది' అని జూనియర్ ఎన్టీఆర్ అన్నారు. రిషబ్‌శెట్టి కథానాయకుడిగా నటించిన 'కాంతార: చాప్టర్ 1' చిత్రం అక్టోబర్ 2న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రిషబ్ అరుదైన నటుడు, దర్శకుడు. 24 విభాగాలను డామినేట్ చేయగల ప్రతిభా పాటవాలు ఆయన సొంతం. ఈ చిత్రం మనందరినీ రంజింపచేస్తుంది. ఈ సినిమాను ఆదరించి, రిషబ్ కష్టానికి మీ ఆశీర్వాదాలు అందజేయండి' అని అభిమానులను కోరారు. రిషబ్‌శెట్టి మాట్లాడుతూ 'ఎన్టీఆర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవ్వడం సంతోషాన్నిచ్చింది. 'కాంతార' చిత్రానికి గొప్ప విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులకు రుణపడి ఉంటాను. ఈ చిత్రాన్ని కూడా అదే స్థాయిలో విజయవంతం చేయాలి' అని ప్రేక్షకులను కోరారు. 'కాంతార 1'లో కీలకమైన పాత్ర పోషించాను, ఈ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటుంది అని కథానాయిక రుక్మిణి వసంత్ తెలిపారు.

కృష్ణమ్మకు వరద పోటు!

» ప్రకాశం బ్యారేజీకి 6.57 లక్షల క్యూసెక్కులు

» బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ



ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరవళ్లు

అమరావతి/విజయవాడ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరదతో కృష్ణమ్మ పోటెత్తుతోంది. విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగడంతో బ్యారేజీకి 6,57,473 క్యూసెక్కుల వరద వస్తోంది. బ్యారేజీ గేట్లను పూర్తిస్థాయిలోకి ఎత్తి 5,66,860 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. ఈ ఏడాది రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేయడం ఇదే మొదటిసారి. దీంతో నది ఒడ్డున స్నానాలను అధికారులు నిషేధించారు. దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులు జల్లు స్నానాలు మాత్రమే ఆచరించాలని సూచించారు. కాగా, ఆదివారం నాటికి 1,080 టీఎంసీల కృష్ణా జలాలు కడలి పాలయ్యాయి. సోమవారం మరో 20 టీఎంసీలు కలిపి మొత్తం 1,100 టీఎంసీల వరకూ సముద్రంలో కలిసే అవకాశం ఉందని జలవనరుల శాఖ వర్గాలు చెబుతున్నాయి.

అప్రమత్తంగా ఉండండి: అధికారులతో అత్యవసర భేటీలో సీఎం

కృష్ణా, గోదావరి నదుల్లోకి వస్తున్న భారీ వరదపై అప్రమత్తతో వ్యవహరించాలని జల వనరులు, విద్యుత్తు, విపత్తుల నిర్వహణ శాఖలను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆదివారం ఆయా శాఖ అధికారులతో సీఎం అత్యవసర సమావేశం నిర్వహించారు. వరద ఉధ్రుతిపై నిరంతరం పరిశీలన చేస్తూ తగు చర్యలు చేపట్టాలని అప్రమత్తం చేశారు. వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా రిజర్వాయర్ల నుంచి కాలువల ద్వారా నీటిని మళ్లించి చెరువులన్నింటినీ నింపేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని రియల్‌టైమ్‌లో అంచనా వేయాలని తెలిపారు. వరద నీటి యాజమాన్య విధానాలను అమలు చేయాలని స్పష్టం చేశారు. సాధ్యమైనన్ని ఎక్కువ చెరువులను నింపాలన్నారు. కృష్ణాతో పాటు గోదావరి నదిలోనూ 10.12 లక్షల క్యూసెక్కుల వరద ఉందని, సోమవారం నాటికి ఇది 11.50 లక్షల క్యూసెక్కులకు పెరగవచ్చని సీఎంకు అధికారులు వివరించారు. గతేడాది కంటే భూగర్భ జలమట్టం 2.07 మీటర్ల మేర పెరిగిందని తెలిపారు. వరదలపై అప్రమత్తంగా ఉంటూ ఆస్తి, ప్రాణనష్టం లేకుండా కార్యాచరణ చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంపై రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. ప్రజలకు అత్యవసర సాయం అందించాలని, తాగునీటికి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

పెరిగిన గోదావరి నీటిమట్టం

పోలవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరిగింది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న అదనపు జలాలను స్పిల్‌వే 48గేట్ల నుంచి అధికారులు దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 32.600 మీటర్లు, దిగువన 24.060 మీటర్లు నీటి మట్టం నమోదైనట్టు జల వనరుల శాఖ అధికారులు తెలిపారు.

దసరాకు ముసురు.. 1న అల్పపీడనం

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సమయంలో ఉత్తర కోస్తా ప్రాంతంలో ముసురు వాతావరణం నెలకొనే అవకాశం ఉంది. ఈ నెల 30న ఉత్తర అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఆవరించనుంది. దీని ప్రభావంతో 1న అల్పపీడనం ఏర్పడనుంది. ఇది వాయవ్యంగా పయనించే క్రమంలో బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. 2న రాత్రి ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటుతుందని విశ్లేషించారు. 1న కోస్తాలో.. ప్రధానంగా ఉత్తర కోస్తాలో వర్షాలు పడతాయని, 2న వర్షాలు పెరుగుతాయని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. కాగా, సోమవారం ఉత్తరాంధ్ర, నంద్యాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

న్యాయవాదుల సంక్షేమంపై ఏపీ బార్ కౌన్సిల్ కీలక నిర్ణయాలు

మరణానంతర ప్రయోజనం 9లక్షలకు పెంపు

అమరావతి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని న్యాయవాదుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏపీ బార్ కౌన్సిల్ పలు కీలక నిర్ణయాలు తీసుకొంది. బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో వీటిని వెల్లడించారు. ఇప్పటి వరకు న్యాయవాది మరణిస్తే కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం రూ.6లక్షలు ఇస్తుండగా, దీనిని రూ.9లక్షలకు (ఇందులో రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ రూ.4లక్షలు) పెంచారు. న్యాయవాదులు, వారి జీవిత భాగస్వాములకు వైద్య సహాయం కింద రూ.1.5లక్షలు ఇస్తుండగా, రూ. 2.5లక్షలకు పెంచారు. మరోవైపు ఈనెల 26న జరిగిన సంక్షేమ కమిటీ సమావేశంలో మరణించిన న్యాయవాదుల కుటుంబ సభ్యులకు రూ.2.86 కోట్లను చెల్లించారు. అనారోగ్యంతో బాధపడుతున్న 85మంది న్యాయవాదులకు రూ.74.20 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ముగ్గురు న్యాయవాదులకు పదవీ విరమణ ప్రయోజనాలు రూ.9లక్షలు అందజేశారు. న్యాయవాదుల క్లర్కుల సంక్షేమ కమిటీ సమావేశంలోనూ పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటివరకు రూ.4లక్షలుగా ఉన్న మరణాంతర ప్రయోజనాన్ని రూ.4.50లక్షలకు పెంచారు. వైద్య సహాయం నిమిత్తం ఇస్తున్న రూ.80వేలను రూ.లక్షకు పెంచారు. అక్టోబరు 1 నుంచి ఈ నిర్ణయాలు అమలులోకి వస్తాయని ఛైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. దేశంలోని ఏ బార్ కౌన్సిల్‌లోనూ ఇంత పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం చేయడంలేదన్నారు.

జీఎస్టీ 2.0పై రైతులకు అవగాహన సదస్సులు

జీఎస్టీ 2.0పై రైతాంగానికి అవగాహన కల్పించేందుకు దసరా నుంచి దీపావళి వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల, గ్రామ స్థాయిలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు ఆదివారం తెలిపారు. ఈనెల 30, వచ్చే నెల 1న జిల్లా, మండల, రైతుసేవా కేంద్రం స్థాయిలో వ్యవసాయ పనిముట్ల ప్రదర్శన, ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహిస్తామన్నారు.

రాజధానిలో సొంతింటికి మంత్రి నారాయణ ఏర్పాట్లు

మంగళగిరి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురపాలకశాఖమంత్రి పి.నారాయణ రాజధాని అమరావతిలో సొంతింటి నిర్మాణానికి సర్వం సిద్ధం చేసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గృహానికి సమీపంలోనే మంత్రి నారాయణ కూడా ఓ ప్లాటును కొనుగోలు చేశారు. వెలగపూడి గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 93 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి మొత్తం 4500 చదరపు గజాల ఏకరూప ప్లాటుగా మార్చారు. 1455 చదరపు గజాల విస్తీర్ణంలో జీ+1 భవన సముదాయ రూపంలో ఏడాదిలోగా నిర్మాణాన్ని పూర్తి చేయనున్నారు. విజయదశమి రోజున శంకుస్థాపనకు ముహూర్తం నిర్ణయించారు. దీని నిర్మాణ పనులను ఎస్ఆర్ఆర్ కనస్ట్రక్షన్స్ సంస్థ చేపడుతోంది.



'బతుకమ్మ'... సమానత్వానికి ప్రతీక

సామాన్యుల ఇళ్ల ముంగిళ్ల నుంచి బతుకమ్మను విశ్వవిద్యాలయం మెట్లు ఎక్కించిన మొట్టమొదటి పరిశోధకురాలు బండారు సుజాతా శేఖర్. ఊరూరా తిరిగి గ్రామీణ మహిళల నాలుక మీద లిఖితమైన కొన్నివందల బతుకమ్మ పాటలను ఆమె సేకరించారు. వాటిలోని పౌరాణిక, సామాజిక, సాంస్కృతిక, భాషా విశేషాల స్ఫూర్తిని ఎలుగెత్తి చాటారు. కనుమరుగవుతున్న మరికొన్ని పాటలకు పునర్జీవం పోశారు. బతుకమ్మ సంబురంలోని సామాజిక దీప్తిని తన పరిశోధనతో లోకానికి చాటిన ఆమెను 'నవ్య' పలకరించింది.

"తెలంగాణ అంతటా ఇప్పుడు బతుకమ్మ ఆడుతున్నారని సంతోషపడాలా? ఆ పేరుతో చాలామంది డీజే పాటలతో, దాండియాలతో పిచ్చి గంతులేస్తున్నారని బాధపడాలా? అనేది తెలియడం లేదు. ఇవాళ కొన్ని వందల మంది పాడుతున్న 'చిత్తు చిత్తుల బొమ్మ...' లాంటి పాటలెన్నింటినో నా పరిశోధన ద్వారా పాతికేళ్ల కిందట వెలుగులోకి తెచ్చాను. మా సొంతూరు నల్గొండ జిల్లా దేవరకొండ. మా అమ్మ బండారు అనసూయమ్మనోట బతుకమ్మ పాటలు వింటూ పెరిగిన నాకు ఆ పాటలంటే ప్రాణం. పరిశోధనంటూ చేస్తే... బతుకమ్మమీదే చేయాలని అనుకున్నాను. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ అడ్మిషన్ ఇచ్చేముందు ఎనిమిదితో కూడిన ప్యానల్ నన్ను ఇంటర్వ్యూ చేశారు. అప్పటికే దేవరకొండ దగ్గర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నాను. "బతుకమ్మ మీద పరిశోధన చేస్తాను" అని నేను అనగానే... ""భుజాన సంచి తగిలించుకొని ఊరూరా తిరుగుతావా?" అని అడిగారు. "ఊర్లో కూర్చొంటే పీహెచ్‌డీ సీట్లు వస్తాయా?" అన్నారు. అదృష్టవశాత్తూ నాకు పాటలు వచ్చు కనుక అవి పాడి వినిపించాను. బతుకమ్మ పాటలపై నా పరిశోధన ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ రాసిన 30 పేజీల సినాప్సిస్ కూడా ఇచ్చాను. అది ప్యానల్‌కు బాగా నచ్చడంతో పీహెచ్‌డీలో ప్రవేశం కల్పించారు. తెలుగు జానపద సాహిత్యం పురాగాథ పరిశోధకురాలు రావి ప్రేమలత మేడమ్‌ను పర్యవేక్షకురాలిగా నియమించారు. అలా బతుకమ్మ పాటలు - పౌరాణిక, సామాజిక, సాంస్కృతిక, భాషా విశేషాలపై 1998లో పరిశోధన ప్రారంభించాను. నాలుగేళ్లలో పీహెచ్‌డి పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నాను.

ఊరూరా తిరిగి...

బతుకమ్మ పాటల సేకరణ అంత సులువుగా సాగలేదు. దసరా, సంక్రాంతి, వేసవి సెలవుల్లోనే కాదు... కొన్నిసార్లు ప్రత్యేకంగా స్కూలుకు సెలవుపెట్టి మరీ పాటల కోసం తెలంగాణ ఉమ్మడి పది జిల్లాలలోని చాలా గ్రామాలు తిరిగాను. బతుకమ్మకు ఇప్పుడున్నంత ప్రాచుర్యం ఆనాడు లేదు. తెలంగాణ ఉద్యమం పుణ్యమా అని ఇప్పుడు ఊరూ - వాడా బతుకమ్మ పండుగను ఘనంగా చేస్తున్నారు. చిన్న, పెద్ద అంతా కలసి ఉత్సాహంగా ఆడుతున్నారు. ఆ రోజుల్లో ఇంత సందడి లేదు. పాటలు వచ్చిన కొద్దిమంది పెద్దవాళ్ళకు తోడుగా గృహిణులు కొంతమంది చేరి, తొమ్మిది రోజులపాటు బతుకమ్మ ఆడుతుండేవారు. అమ్మాయిలైతే తమకు సంబంధం లేదన్నట్టు దూరంగా ఉండేవారు. బతుకమ్మ పాటలు పాడే వారిని వెతుక్కుంటూ ఎన్నో గ్రామాలకు వెళ్లాను. "పాటలు రికార్డు చేసుకుంటాను, పాడండి" అని అడిగితే, "నుడుగులు' (పాటలు) ఏమి చేసుకుంటావమ్మా!" అని విసుక్కునే వారు. కొంత మంది అయితే "పో పోవమ్మా! పనిపాటలేదా?" అని చిరాకుపడేవాళ్లు. ఇంకొంతమంది సిగ్గుపడేవారు. అలా రకరకాల అనుభవాలు. ఒక్కొక్కరి దగ్గర కొన్ని గంటల తరబడి కూర్చొని, పాటలు సేకరించాను. అక్షరం ముక్క రాని ఆడవాళ్లు అలవోకగా పాటలు అల్లి లయబద్ధంగా పాడుతుంటే అవన్నీ రాసుకున్నాను. పండితులకు ఎంత మాత్రం తీసిపోని విధంగా వారంతా కొన్ని వందల పాటలు ఆశువుగా పాడడం ఒక అద్భుతం. ప్రతి మహిళ నాకు ఒక వాగ్దేవిగా కనిపించేది. ఊరూరా తిరిగి సెల్‌ఫోన్లు లేని ఆ రోజుల్లో 700కుపైగా పాటలు సేకరించాను.

బతుకమ్మ పాటలు...

ఈ తొమ్మిది రోజులూ ఆడవాళ్లందరూ కలిసి సాధక బాధకాలను, కష్టసుఖాలను పాటగా అల్లి పాడుకోవడం ఈ పండుగలో చూస్తుంటాం. అత్తకోడళ్లు, యారాళ్లు, అన్నాచెల్లెళ్లు ఇలా... నిత్యజీవితంలో ఎదుర్కొనే కడగండ్ల మీదా బోలెడు బతుకమ్మ పాటలున్నాయి. సాంఘిక ఆచారాలు, వస్తు సంస్కృతి, కళలు, జానపద విజ్ఞానం కలగలసిన బతుకమ్మ పాటలలో కథా గేయాలు, అలాగే కథారహితమైన గేయాలు కనిపిస్తాయి. జానపదుల నోళ్లలో జీవం పోసుకున్న ఆ పాటల్లోని ఛందస్సు, అలంకారాలు, నవరస పోషణ అబ్బురపరుస్తుంది. దుర్మార్గుల ఆకృత్యాలకు బలైన ఒక మహిళ గాథను 'అండాలమ్మ పాట'గా నేటికీ భువనగిరి జిల్లాలో బతుకమ్మ పండుగ నాడు పాడుతున్నారు. 'పంద్రాగస్టుని ఉయ్యాలో, పండుగొచ్చిందమ్మ ఉయ్యాలో' అంటూ దేశ స్వాతంత్ర్యానంతరం హైదరాబాద్ రాష్ట్రంలో తలెత్తిన అరాచకాలు ఇతివృత్తంగా మరొకచోట పాడతారు. నల్గొండ జిల్లాలోని జాన్‌పహాడ్‌హాలోని ఉరుసు ఉత్సవాన్ని వర్ణిస్తూ మతసామరస్యాన్ని కొనియాడుతూ ఇంకో పాట ఆలపిస్తారు. ఇలా మహిళల భావాలు, స్వభావాలు, రామాయణ, మహాభారత గాథలు, స్థానిక చరిత్ర, ఇంట, బయట ఆడవాళ్లకు ఎదురయ్యే ఒడుదొడుకులు, వాటిని ఎదుర్కొనే ఉపాయాలు ఇతివృత్తంగా 'కోల్', 'ఉయ్యాలో', 'వలలో' లాంటి మకుటాలతో సాగే బతుకమ్మ పాటలలోని పౌరాణిక, సామాజిక, భాషా, సాంస్కృతిక విలువలను నా పరిశోధనలో వివరించాను. అది పుస్తకంగానూ వచ్చింది. ఇప్పటికి మూడు ముద్రణలు అయ్యాయి.

ఒక్కోచోట ఒక్కోలా ఆట...

బతుకమ్మ పండుగ చేసుకునే తీరు తెలంగాణ అంతటా దాదాపుగా ఒక్కటే. అయినా, పాటల రూపాంతరాలు, ఆటలో అడుగులు మాత్రం ఒక్కోచోట ఒక్కోలా ఉంటాయి. ఒక పాట ఒకచోట సానుకూల దృక్పథంతో సాగితే మరొక చోట హితబోధ రీతిలో పాడతారు. వరంగల్, కరీంనగర్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో వలయాకారంలో తిరుగుతూ కోలాటం ఆడుతూ బతుకమ్మను కొలుస్తారు. చప్పట్లు కొట్టేప్పుడు శరీర కదలికల్లోనూ శ్రామిక మహిళలకు, గృహిణులకు మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తుంటుంది. మరికొన్ని గ్రామాలలో మహిళలు బతుకమ్మను వాయినంగా ఇచ్చిపుచ్చుకుంటారు. కొన్ని ఊర్లలో మగవాళ్లు బతుకమ్మను పేర్చడం చూశాను. వాళ్లే నెత్తినపెట్టుకొని చెరువుకు తీసుకెళతారు. మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలలో బాలికలతో బొడ్డెమ్మ పండుగ బాగా జరుపుతారు. హన్మకొండ, నల్గొండ ప్రాంతాలలోని కొన్ని గ్రామాలలో భూస్వాముల అరాచకాలు భరించలేక బతుకమ్మ పండుగ చేయరు. ఇంకొందరు కలిసిరాలేదని ఈ పండుగ చేసుకోరు. మలిదశ తెలంగాణ ఉద్యమకాలం నుంచి మాత్రం ప్రతి ఇల్లు బతుకమ్మకు లోగిలిగా మారింది. సకల జనుల పండుగ అయింది.

మహిళల వల్లే బతికింది...

బతుకమ్మను బతికించింది ముమ్మాటికి గ్రామీణ మహిళల మౌఖిక సాహిత్యమే. కొన్నివందల ఏళ్లనాటి బతుకమ్మ పండుగ సంప్రదాయం ఈనాటికి కొనసాగిస్తున్నామంటే అదంతా అమ్మల పుణ్యమే. ఒకనాడు తెలంగాణ బిడ్డల పలకరింపునకు పెద్దగా నోచుకోని బతుకమ్మను ఇవాళ దేశదేశాలలోని తెలంగాణ వారంతా కలసి ఘనంగా ఆడుతున్నారు. రెండు దశాబ్దాల కిందట ముంబయిలోని మన వలస శ్రామికుల వీధిలో ఇద్దరు లేదా ముగ్గురు మహిళలు మాత్రమే బతుకమ్మ ఆడేవారు. ఇప్పుడు అక్కడ పండుగ నాడు వందలమంది మహిళలు జమవుతున్నారు. బతుకమ్మ ఆడుతున్నారు. నేను 'బతుకమ్మ' సినిమాకు ఆరుపాటలు అందించాను. నా భర్త శేఖర్ సహకారంతో 'బతుకమ్మ ఫౌండేషన్' నెలకొల్పాను. మా స్తోమత మేరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రధానోపాధ్యాయురాలిగా నిరుడు ఉద్యోగ విరమణ చేసిన నాటి నుంచి పూర్తి సమయం సాహిత్య సృజనకు కేటాయిస్తున్నాను. అణా గ్రంథమాల వ్యవస్థాపకులలో ఒకరైన తెలంగాణ వైతాళికుడు కేసీగుప్త జీవిత జీవిత చరిత్ర రాయడం నాకు దక్కిన మరొక అరుదైన అవకాశం. తీజ్ పండుగకు, బొడ్డెమ్మకు సారుప్యత ఉన్నా... బతుకమ్మ మన నేల సాహిత్య, సాంస్కృతిక, జీవన విధానానికి ప్రతీక. అది మన అస్తిత్వం. దాండియా, డీజేలకు దూరంగా సహజసిద్ధంగా బతుకమ్మను ఆడుదాం."

• సాంత్వన్

అంతరాల దొంతరలకు అతీతం

పూలు అంగట్లో కొని పేర్చమని బతుకమ్మ అడగలేదు. పెద్ద బతుకమ్మను పేర్చాలని పోటీలుపడి మరీ పేర్చడం, అందులో కృత్రిమపూలు వాడడం పండుగ స్ఫూర్తికి విరుద్ధం. పొలాలవెంట సులువుగా దొరికే తంగెడు, గునుగు, బీర, కాకర, జిల్లేడు, గుమ్మడి, బంతి, చామంతి, ముత్యపు పూలతో పూజించడమే అమ్మకు అసలైన ఆరాధన. బతుకమ్మను పేర్చడం, మధ్యలో నింపడంలోనూ కళాత్మకత ఉట్టిపడుతుంది. తెలంగాణ తల్లి సిగలో పూసే తీరొక్క పూలన్నీ ఒకచోట ఆలయ గోపురంగా కొలువుదీరినట్టుగా 'మనుషులంతా ఒక్కటే' అన్నది బతుకమ్మ సందేశం. రకరకాల పూల పేర్పు సమానత్వానికి ప్రతీక. రంగురంగుల పుష్పాల రాశి... ఐకమత్యానికి నిదర్శనం. బతుకమ్మ అందరికీ అమ్మ. బతుకమ్మ ఆటకు కులభేదాలు లేవు. మహిళలందరూ అంతరాల దొంతరలకు అతీతంగా... అంతా కలసిమెలసి సంతోషంగా ఆట, పాటలతో చేసుకునే పండుగ బతుకమ్మ.



దుర్గా నవరాత్రులు



నేటి అలంకారం
శ్రీ సరస్వతీ దేవి

శ్రీ సరస్వతీ దేవి (మూలా నక్షత్రం)
ఆశ్వీయుజ శుద్ధ సప్తమి, సోమవారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఈ రోజున శ్రీ సరస్వతీ దేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. ఈ శరన్నవరాత్రుల్లో మూలా నక్షత్రానికి అధిక ప్రాముఖ్యం ఉంది. మూలా నక్షత్రం అమ్మవారి జన్మ నక్షత్రం. దుర్గాదేవి చదువుల తల్లి సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చే రోజు ఇది. బ్రహ్మ చైతన్య స్వరూపిణిగా సరస్వతీదేవిని పురాణాలు వర్ణించాయి. ఆసనంగా శ్వేతపద్మాన్ని అధిష్ఠించి, వీణ, దండ, కమండలాలు, అక్షమాల ధరించి, అభయముద్రతో భక్తుల అజ్ఞాన తిమిరాలను ఆమె దూరం చేస్తుందని విశ్వాసం. నవరాత్రుల్లో మూలా నక్షత్రం నుంచి విజయదశమి వరకు విశేష పుణ్యదినాలుగా భక్తులు పరిగణించి, అమ్మను ఆరాధిస్తారు. మహాకాళి, మహాలక్ష్మీ, మహాసరస్వతిగా త్రిశక్తి స్వరూపిణి అయిన దుర్గాదేవి తన అంశలోని నిజస్వరూపాన్ని సాక్షాత్కరింప చేయడమే ఈ రోజు చేసే అలంకార ప్రత్యేకత. త్రిశక్తుల్లో సరస్వతి మూడో శక్తి రూపం. సంగీత సాహిత్యాలకు అధిష్ఠాన దేవత. ఈ తల్లిని ఆరాధించడం వల్ల బుద్ధి వికాసం, విద్యాలాభం, కలుగుతాయి. చింతామణి, జ్ఞాన, నీల, ఘట, కిణి, అంతరిక్ష, మహాసరస్వతులుగా సప్త నామాలతో అలరారే వాగ్దేవి ప్రాణుల నాలుకపై నర్తించే బుద్ధిప్రదాయిని. ఆమెను కొలిస్తే విద్యార్థులకు చదువు బాగా వస్తుందనీ, జ్ఞానజ్యోతులను ఆమె ప్రసాదిస్తుందనీ, వాక్శుద్ధి, మంచి బుద్ధీ ఇస్తుందనీ నమ్మిక.

నైవేద్యం:
దధ్యోదనం, పాయసం, ఇతర తీపి పదార్థాలు
అలంకరించే చీర రంగు: తెలుపు
అర్చించే పూలు: కలువ పూలు
పారాయణ చెయ్యాల్సింది:
సరస్వతీ స్తోత్రాలు

వజ్రాల మొలకలు

సంకల్పం

చదువుకొనే రోజుల్లో ఒక దృశ్యం... ఆయన దృక్పథాన్ని మార్చేసింది. మానసిక వికలాంగులు... వారి తల్లిదండ్రులు పడుతున్న మనోవేదన గుండెల్ని పిండేసింది. అప్పుడే నిర్ణయించుకున్నారు... అలాంటి పిల్లలకు అండగా ఉండాలని. దానికి కార్యరూపం ఇస్తూ... రెండు దశాబ్దాల కిందట 'హిడెన్ స్ప్రౌట్స్ స్కూల్' ప్రారంభించారు. మానసికంగా ఎదుగుదల లేని చిన్నారులకు ఉచితంగా పాఠాలు బోధిస్తున్నారు. వారిలోని నైపుణ్యాన్ని వెలికితీసి... ఆత్మవిశ్వాసం నింపుతున్న కండిపిల్లి శ్రీనివాసరావును 'నవ్య' పలుకరించింది.



"అది 1997-98 మధ్య కాలం. నేను విశాఖపట్టణం బుల్లయ్య కాలేజీలో చదువుతున్న సమయం. ఒక రోజు మా కాలేజీలో మానసిక వికలాంగుల కోసం ఓ కార్యక్రమం జరిగింది. అందులో తమ పిల్లల పరిస్థితి చూసి కొందరు తల్లిదండ్రులు ఎంతో ఆందోళనకు గురవుతున్నారు. 'దేవుడు మాకెందుకు ఈ కష్టాన్ని ఇచ్చాడు' అంటూ తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఒకరిద్దరితో మాట్లాడినప్పుడు... 'ఆ పిల్లలను చూసుకొంటూ ఇంటి వద్దే ఉండటంవల్ల బయటకు వెళ్లి పనులు చేసుకోలేకపోతున్నాం. సరైన సంపాదన లేక కడుపు నిండా తినలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి' అని బాధగా చెప్పారు. ఇవన్నీ చూసి తట్టుకోలేకపోయాను. వారికి అండగా నిలబడి, భరోసా కల్పించాలని ఆ క్షణమే నిర్ణయించుకున్నాను.

అధ్యయనం తరువాత...

ఏదో చెయ్యాలనే తపన అయితే ఉంది. కానీ ఏంచేయాలి? ఎక్కడ మొదలుపెట్టాలి? అవగాహన కోసం మానసిక వికలాంగుల కోసం నిర్వహిస్తున్న పాఠశాలలు, సంస్థలను సందర్శించాను. వారిలో కొందరు కొంత డబ్బు తీసుకొని సేవలు అందించడం గమనించాను. స్థోమత కలిగినవారు సరే... మరి పేద పిల్లల పరిస్థితి ఏమిటి? అందుకే అలాంటి వారందరికీ ఉచితంగా విద్యాబుద్ధులు నేర్పించేందుకు ఒక పాఠశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాను. కానీ సరైన సేవలు అందించాలంటే వారి సమస్యలపై నాకు పూర్తి అవగాహన అవసరం. దాని కోసం 'మెంటల్లీ రిటార్డేషన్'లో స్పెషల్ బీఈడీ చేశాను.

పదిమందితో మొదలై...

బీఈడీ పూర్తవగానే 2006లో విశాఖపట్టణంలోనే 'సొసైటీ ఆఫ్ హిడెన్ స్ప్రౌట్స్ స్పెషల్ స్కూల్ ఫర్ మెంటల్లీ ఛాలెంజ్‌డ్ చిల్డ్రన్' ప్రారంభించాను. నాడు పదిమంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ స్కూల్‌లో ఇప్పుడు 150 మంది చదువుతున్నారు. మొదట్లో పిల్లలను నా బైక్‌పై తీసుకువచ్చి, బడి అయిపోగానే మళ్లీ వాళ్ల ఇళ్ల వద్ద దిగబెట్టేవాడిని. ఈ సమయంలో వారి తల్లిదండ్రులు తమ పనులు చేసుకొనేవారు. దీంతో చాలావరకు వారికి ఇబ్బందులు తప్పడంతో తమ పిల్లలను భారంగా భావించడం మానేశారు. వాళ్ల సంతృప్తి, సంతోషం చూసి పాఠశాలను ఎప్పటికప్పుడు విస్తరించుకొంటూ వచ్చాను.

చదువు ఒక్కటే కాదు...

ఇక్కడ చదువుతో పాటు బిహేవియర్ మాడిఫికేషన్, ఒకేషనల్ ట్రైనింగ్, బుక్ బైండింగ్, స్పీచ్, ఫిజియో థెరపీ కూడా ఉంటాయి. పిల్లలను మరింత ఉత్సాహపరిచేందుకు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహిస్తుంటాం. చిన్నారులను ఇళ్ల వద్ద నుంచి బడికి తెచ్చేందుకు నాలుగు బస్సులు అందుబాటులో ఉంచాం. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 3.30 వరకు తరగతులు ఉంటాయి. మధ్యాహ్నం పోషకాలతో కూడిన ఆహారం పెడతాం. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా సేవా దృక్పథంతో 21 ఏళ్లుగా పాఠశాలను నడిపిస్తున్నాం.

అందరి సహకారంతో...

మా పాఠశాల నిర్వహణకు నెలకు ఐదు లక్షల రూపాయలు ఖర్చవుతాయి. టీచర్లు, థెరపిస్టులు, వంటవారు, ఆయాలు అంతా కలిపి ఇక్కడ మొత్తం 30 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వారి జీతభత్యాలకు మూడు లక్షలు వరకు ఉంటాయి. భోజనం, ఇతర అవసరాల కోసం మరో రెండు లక్షలు ఖర్చవుతాయి. ఇందులో కొంత మొత్తం దాతలు, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని 'సోషల్ జస్టిస్' సంస్థ ద్వారా అందుతోంది. అదిపోనూ మిగిలింది నేను భరిస్తున్నాను. ఏది ఏమైనా పిల్లల మోముపై చిరునవ్వు చెదరకూడదు. వారి తల్లిదండ్రులు మనో వేదనతో కుంగిపోకూడదు. ఇదే నా లక్ష్యం. భవిష్యత్తులో హాస్టల్ సదుపాయం కూడా కల్పించేందుకు కృషి చేస్తున్నా."

• బూటు శ్రీనివాస్, విశాఖపట్నం
ఫొటోలు: రవీ

ఇబ్బందులు ఎదురైనా...



మా సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను గుర్తించిన ప్రభుత్వం స్థానిక ఎంవీపీ కాలనీలో కొంత స్థలాన్ని కేటాయించింది. అందులో పాఠశాల భవనాలు ఏర్పాటు చేశాను. అయితే 2021లో వైసీపీ నాయకుల ప్రోద్బలంతో అధికారులు ఆ భవనాలు కూల్చేశారు. కానీ నేను వెనక్కి తగ్గలేదు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పెదవాల్తేరులో ఒక భవనం తీసుకుని సేవలు కొనసాగించాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూల్చివేసిన భవనాల స్థానంలో రేకుల షెడ్లు ఏర్పాటు చేసి, మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించాను. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, భారత మాజీ క్రికెటర్ ఎంఎస్‌కే ప్రసాద్ తదితరులు నాకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారు.

బ్యాలే... ఎక్కువగా మహానగరాల్లో కనిపించే విదేశీ నృత్య కళ ఇది. బ్యాలే దీన్ని దేశంలోని ఇతర ప్రాంతాలవారికీ చేరువ చేయాలని సంకల్పించింది ధ్వని కొఠారీ దాల్మియా. భరతనాట్యం, కూచిపూడి, కథక్‌లా భారతీయ నాట్యాల సరసన బ్యాలేను నిలపాలనే ప్రయత్నం ఆమెది. బ్యాలే ఒక కళ మాత్రమే కాదని, అది ఒక జీవన విధానమని చెబుతున్న 27 ఏళ్ల ధ్వని... 'నేషనల్ బ్యాలే స్కూల్ ఆఫ్ ఇండియా' నెలకొల్పి నవతరాన్ని అటువైపు ప్రోత్సహిస్తోంది.

విభిన్నం

బ్యాలే 'ధ్వని'... భళా



"అందరిలా నేనూ కలలు కన్నాను. కానీ... చదువు... ఆపై కొలువు... ఈ మూస జీవితానికి భిన్నంగా ఉండాలనుకున్నాను. ఎందుకో తెలియదు... చిన్నప్పుడే నేను బ్యాలే నృత్యంపై మనసు పారేసుకున్నాను. కాలేజీకి వచ్చేసరికి అందులోనే కెరీర్‌ను వెతుక్కోవాలని దృఢంగా నిశ్చయించుకున్నాను. పాఠశాల విద్యాభ్యాసం అవ్వగానే బ్యాలేలో శిక్షణ మొదలుపెట్టాను. దాని మీద పూర్తి స్థాయిలో శ్రద్ధ పెట్టాలన్న ఉద్దేశంతో ఇంజినీరింగ్ లాంటి కోర్సుల వైపు వెళ్లకుండా, మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో డిగ్రీ చదివాను. ముంబయి మహానగరం మాది. నేర్చుకొనే క్రమంలో తెలిసింది... ముంబయిలో మినహా ఇతర నగరాల్లో ఈ నృత్యానికి పెద్దగా ఆదరణ లేదని. రష్యా, ఫ్రాన్స్‌ల్లో అభివృద్ధి చెందిన అత్యద్భుత నాట్యరీతి ఇది. అంతటి అద్భుత కళారూపాన్ని భారత్‌లోని అన్ని ప్రాంతాలకు చేరవేయాలని ఆ క్షణమే అనుకున్నాను.

అంతర్జాతీయ వేదికపై...

నేర్చుకొనే క్రమంలో నేను అనేక ప్రదర్శనలు ఇచ్చాను. 2017లో డిగ్రీ పూర్తవగానే వియన్నాలో జరిగిన 'యూరోపియన్ బ్యాలే గ్రాండ్ ప్రి'లో పాల్గొనే అవకాశం వచ్చింది. అప్పుడు నేను ముంబయిలోని 'ఇండియన్ అకాడమీ ఆఫ్ రష్యన్ బ్యాలే' (ఐఏఆర్‌బీ)లో సాధన చేస్తున్నాను. భారత్ నుంచి నలుగురికి మాత్రమే గ్రాండ్ ప్రికి అర్హత దక్కింది. అందులో నేనూ ఉన్నాను. ఎంతో ఉత్సాహంతో పోటీలకు సిద్ధమవుతుంటే కాలి బొటనవేలికి తీవ్ర గాయమైంది. చాలా రోజులు నాట్యానికి దూరం కావాల్సి వచ్చింది. అయినా అధైర్యపడలేదు. ఈవెంట్‌కు కొద్ది రోజుల ముందు కోలుకున్నాను. పట్టుదలగా రోజుకు ఐదారు గంటలు కఠోర సాధన చేశాను. నా ప్రయత్నం వృథా కాలేదు. ఆ గ్రాండ్ ప్రిలో మంచి ప్రదర్శన ఇచ్చాను.

నాట్యాలయం...

అయితే 'యూరోపియన్ బ్యాలే గ్రాండ్ ప్రి' తరువాత నేనేంటో నాకు తెలిసివచ్చింది. అత్యుత్తమ డ్యాన్సర్‌గా గుర్తింపు తెచ్చుకోవాలంటే మరింత నైపుణ్యం సంపాదించాలి. దాని కోసం క్రొయేషియా, ఆ తరువాత హంగేరీలో శిక్షణ తీసుకున్నాను. అది నాలో ఆత్మవిశ్వాసం పెంచింది. ఈ అపురూప నాట్యాన్ని నేటి తరానికి పరిచయం చేయాలని సంకల్పించాను. ఆ ప్రయత్నంలో భాగంగానే 2019లో 'నేషనల్ బ్యాలే స్కూల్ ఆఫ్ ఇండియా' (ఎన్‌బీఎస్‌ఐ) నెలకొల్పాను. నాటి నుంచి స్కూల్ వ్యవస్థాపకురాలిగా, ఆర్టిస్టిక్ డైరెక్టర్‌గా బ్యాలేను దేశ వ్యాప్తంగా అన్ని పట్టణాలకు విస్తరించేందుకు కృషి మొదలుపెట్టాను.

నవతరం అడుగులు...

ఈ ఆరేళ్ల కాలంలో ముంబయిలోనే పది శాఖలు ప్రారంభించగలిగాను. అందుకు ప్రధాన కారణం... కొత్త కళను ఆహ్వానించి, అందులో ఆస్వాదనం పొందాలనే నవతరం ఆకాంక్ష. మా బ్యాలే స్కూల్ ప్రారంభానికి ముందు దీన్ని పూర్తి స్థాయి నాట్యంగా అభ్యసించేవారు అరుదుగా కనిపించేవారు. ఇప్పుడు వందల మంది యువత ఆసక్తి చూపుతున్నారు. మా స్కూల్లోనే రెండు వందల మందికి పైగా శిక్షణ పొందారు. నాలానే కొందరు ఇందులోనే తమ కెరీర్‌ను వెతుక్కొంటున్నారు. ఇది శుభ పరిణామం. ఇక్కడ ఒక్కటి చెప్పాలనుకొంటున్నాను... బ్యాలే అంటే కేవలం ఒక నాట్య రీతి మాత్రమే కాదు. లేదంటే తరగతి గదిలో నేర్చుకొని వదిలేసే విద్య కాదు. ఇది ఒక జీవన విధానం. ఈ దిశగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాను.

ముంబయి దాటి...


మా నాట్యాలయంలో శిక్షణ పొందిన వారిలో చాలామంది అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలు ఇచ్చారు. వారిని చూసినప్పుడు నాకు ఎంతో గర్వంగా ఉంటుంది. 'ఈ కళ పట్ల ఇంత మంది ఉత్సాహం చూపుతున్నప్పుడు ముంబయికి మాత్రమే ఎందుకు పరిమితం కావాలి అని అనిపించింది. దాంతో ఇతర మెట్రో నగరాలైన బెంగళూరు, ఢిల్లీల్లో కూడా మా నాట్యాలయం ప్రారంభించాలని అనుకున్నా. ఆ తరువాత ఇతర మహానగరాలకు విస్తరించాలన్నది ప్రణాళిక. అందుకు ప్రయత్నాలు కూడా మొదలుపెట్టా. కానీ అనుకోకుండా భోపాల్ నుంచి ఆహ్వానం అందింది. ఆర్కేడీఎఫ్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రుచి కపూర్ నుంచి ఒక రోజు ఫోన్ వచ్చింది. 'మా నగరంలో మీ స్కూలు ఎందుకు ప్రారంభించకూడదు' అంటూ ఆమె అడిగారు. తనకు కూడా నాలాగానే బ్యాలే అంటే అమితమైన ఇష్టం అని మాటల్లో అర్థమైంది. అప్పటికీ నేను నిర్ణయం తీసుకోలేకపోయాను. కానీ రుచి మాత్రం పట్టు వదల్లేదు. 'మీరు ఇక్కడకు రావాలి. ఇలాంటి విభిన్నమైన కళ కోసమే ఇక్కడి ప్రజలు ఎదురు చూస్తున్నారు. వాళ్లకూ నేర్చుకొనేందుకు ఒక అవకాశం ఇవ్వండి' అన్నారు. ఆమె మాటలు నాలో ఉత్సాహం నింపాయి. అలా ఇటీవలే తొలిసారి ముంబయి దాటి భోపాల్‌లో ఎన్‌బీఎస్‌ఐ బ్రాంచి ప్రారంభించాను. యువతే కాదు, చిన్నారులు సైతం బ్యాలే మీద ఎంతో మక్కువ కనబరిచారు. అది చూసి నాకు ఆశ్చర్యం వేసింది.

చిన్న పట్టణాలకు కూడా...

భోపాల్ అనుభవం నా ఆలోచనలను పూర్తిగా మార్చేసింది. కేవలం మెట్రో నగరాల్లోనే బ్యాలేకు ఆదరణ ఉంటుందని భావించిన నా అంచనా తప్పని రుజువైంది. అందుకే ఇకపై చిన్న పట్టణాల్లో కూడా మా స్కూలు నెలకొల్పాలని నిర్ణయించుకున్నా. ఉద్దండులైన రష్యన్ మాస్టర్స్ వద్ద నేను శిష్యరికం చేశాను. సంప్రదాయ రష్యన్ బ్యాలేలో వగనోవా అనే ప్రక్రియ ఒకటి ఉంది. అందులో సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశాను. అయితే యూరప్‌లోనో, రష్యాలోనో నేర్చుకున్నది యథాతథంగా ఇక్కడ నేర్పించడం అన్ని సందర్భాల్లో కుదరదు. అలా చేస్తే ఆసక్తి సన్నగిల్లుతుంది. అందుకే అదే నాట్యాంశాన్ని మన నేపథ్యానికి తగినట్టుగా విభిన్నంగా, వినూత్నంగా నేర్పిస్తున్నాను. దానివల్ల బ్యాలే కూడా ఎక్కడి నుంచో దిగుమతి చేసుకున్నట్టు కాకుండా... మన నృత్య రీతుల్లో ఒకటిగా వర్ధిల్లుతుంది. ఆ దిశగా నా ప్రయత్నం నిరంతరం సాగుతూనే ఉంటుంది."

గుండెకు ఏఐ చికిత్స..!





అంతర్జాతీయంగా ప్రెసిషన్ మెడిసిన్.. రీజనరేటివ్ మెడిసిన్‌పై ప్రత్యేక దృష్టి

మనదేశంలోనూ ఊపందుకున్న పరిశోధన.. వైద్యం అందుబాటులోకి వస్తే విప్లవమే

వ్యక్తులు వందేళ్లకుపైగా జీవించే అవకాశం

నేడు వరల్డ్ హార్ట్ డే

అమరావతి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఏటా లక్షల మంది గుండె జబ్బులతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో ఈ మరణాలను తగ్గించేందుకు నూతన వైద్య సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. అంతర్జాతీయంగా ప్రెసిషన్ మెడిసిన్, రీజనరేటివ్ వైద్యం ద్వారా వ్యక్తి వంద సంవత్సరాలకుపైబడి జీవించే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. నూతన విధానంలో గుండె సమస్యలను ముందుగానే గుర్తించి, దానికి అనుగుణంగా గుండెను రీజనరేట్ చేసే వైద్య విధానాలు అందుబాటులో రానున్నాయి. సోమవారం అంతర్జాతీయ 'హార్ట్ డే' సందర్భంగా హృదయ పరిరక్షణ, వైద్యంపై ప్రముఖ వైద్యులు కీలక సూచనలు చేశారు.

ప్రెసిషన్ మెడిసిన్..

ప్రెసిషన్ మెడిసిన్.. అనేది వ్యక్తిగతీకరించిన చికిత్స. జీనోమిక్ డేటా, జీవనశైలి, పరిసరాల ఆధారంగా ఈ విధానంలో చికిత్స అందిస్తారు. ఒకే వ్యాధి అందరికీ ఒకే విధంగా ఉండదు. వ్యక్తుల జన్యువుల ఆధారంగా అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. ఆయా వ్యక్తులకు వేర్వేరు ఔషధాలు, డోసులు అవసరమవుతాయి. ఈ క్రమంలో జీనోమిక్ డేటా ఆధారంగా శరీర తత్వాన్ని బట్టి మందుల వాడకం ఉంటుంది. మరోవైపు కృత్రిమ మేధ(ఏఐ) ద్వారా డ్రగ్ టాక్సిసిటీ, షుగర్, బీపీ, గుండె జబ్బు, అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించే వెసులుబాటు వచ్చింది. ప్రస్తుతం రోగి సమస్య చెబితే, అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఏ అవయవంలో సమస్య ఉందో గుర్తిస్తారు. కానీ, సమస్య ఆధారంగానే నేరుగా అనారోగ్య సమస్యలను గుర్తించే విధంగా ఏఐ అందుబాటులోకి వచ్చింది. మెషిన్ లెర్నింగ్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, కంప్యూటర్ విజన్ సహకారంతో క్లినికల్ నిర్ణయాలు మరింత ఖచ్చితంగా తెలుసుకోవచ్చు. దీనివల్ల అనారోగ్య సమస్యను ముందే గుర్తించడం వల్ల చికిత్స సులువు కావడంతోపాటు రోగి ఆయా సమస్యల నుంచి త్వరిగతిన వంద శాతం బయటపడే అవకాశాలున్నాయి.

రీజనరేటివ్ మెడిసిన్..

రీజనరేటివ్ మెడిసిన్‌ని శరీర కణజాల పునర్నిర్మాణం అంటారు. స్టెమ్ సెల్స్, జీన్ థెరపి, టిష్యూ ఇంజనీరింగ్ ద్వారా దెబ్బతిన్న అవయవాలను తిరిగి పునరుద్ధరించే విధానం అందుబాటులోకి వస్తోంది. దీనిద్వారా గుండె పోటు తర్వాత గుండె కండర కణజాలం(హార్ట్ మజిల్ టిష్యూ) పునర్నిర్మించుకోవడం సాధ్యమవుతుంది. ఇప్పుడు అన్ని దేశాల్లో గుండెపోటు సమస్యలు తీవ్రమయ్యాయి. గత పదేళ్ల నుంచి 30 ఏళ్ల వారిలో కూడా ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. గుండెపోటు మరణాల సంఖ్యా భారీగా ఉంది. ఈ సమస్యల నివారణకు హార్ట్ మజిల్ టిష్యూ పునర్నిర్మించుకోవడంపై అంతర్జాతీయంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇప్పటికే చైనా, రష్యా దాదాపు పూర్తి చేశాయి. మన దేశంలోనూ పరిశోధనలు జరుగుతున్నాయి.

ఐపీఎస్‌సీ విప్లవం..

రీజనరేటివ్ మెడిసిన్‌లో ఇండ్యూస్డ్ ప్లూరిపోటెంట్ స్టెమ్ సెల్స్(ఐపీఎస్‌సీ) అత్యాధునిక పరిష్కారంగా ఉంది. ఎంబ్రియోనిక్ స్టెమ్ సెల్స్‌తో వచ్చే సమస్యలు, ఇమ్యూన్ రిజెక్షన్ సమస్యలను ఐపీఎస్‌సీ ద్వారా తప్పించుకోవచ్చు. రోగి చర్మ బయాప్సీ సెల్స్‌ను ల్యాబ్‌లో రీప్రోగ్రామ్ చేసి లివర్, కిడ్నీ, గుండె మొదలైన అవయవాలను తిరిగి సృష్టించవచ్చు. దీనివల్ల ఇతర వ్యక్తుల అవయవాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం అన్ని దేశాల్లో అవయవాల కోసం బ్రెయిన్ డెడ్ దాతలపై ఆధారపడుతున్నారు. కానీ, అవయవాలు అవసరమైన స్థాయిలో దాతలు లేరు. ఫలితంగా అవయవాలు అందుబాటులో లేక చికిత్స మధ్యలో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో కూడా హృదయ సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న వారు ఎక్కువ మంది ఉంటున్నారు. రోగి చర్మ బయాప్సీ సెల్స్‌ను ల్యాబ్‌లో రీప్రోగ్రామ్ చేసి లివర్, కిడ్నీ, గుండె మొదలైన అవసరమైన అవయవాలను తిరిగి సృష్టించే వెసులుబాటు అందుబాటులోకి వస్తే ఈ సమస్య తీరుతుందని నిపుణులు భావిస్తున్నారు. రోగి కణజాలం ఉపయోగించడం వల్ల సురక్షితమైన, వ్యక్తిగతీకరించిన చికిత్స సాధ్యమవుతుంది. ఐపీఎస్‌సీ సాంకేతిక ద్వారా రోగి శరీరానికి కొత్త అవయవాలను తయారు చేసి, భవిష్యత్తులో ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరాన్ని పూర్తిగా తగ్గించే అవకాశం ఉంది.

టిష్యూ పునరుద్ధరణే నూతన విధానం



ఎవరికి గుండె జబ్బులు వచ్చే ప్రమాదముందో ముందే అంచనా వేసి డ్యామేజ్ అయిన హార్ట్ మజిల్ టిష్యూలు పునరుద్ధరించడమే నూతన వైద్య విధానం. సైన్స్, జెనోమిక్స్, ఏఐ కలిసినప్పుడు మానవ ఆరోగ్యానికి సరికొత్త విప్లవం ఆవిర్భవిస్తుంది. కానీ, ప్రతి ఒక్కరూ గుండెను కాపాడుకోవడం కోసం సరైన జీవనశైలి అలవాటు చేసుకుంటే మంచిది. దీనికి తోడు త్వరలో అందుబాటులోకి వచ్చే ప్రెసిషన్ మెడిసిన్, రీజనరేటివ్ మెడిసిన్ మానవ జీవితాన్ని శతాధిక సంవత్సరాల పాటు ఆరోగ్యవంతంగా నిలబెట్టగలుగుతాయి.

- డాక్టర్ రమేశ్ బాబు, చీఫ్ కార్డియాలజిస్ట్, ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్

పేదలకు రుణాలిస్తే ఎగ్గొడతారన్న

బ్యాంక్‌ల ముందు ధర్నా చేయండి

- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు చంద్రబాబు, లోకేశ్ కృషి
- మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడి



పిడుగురాళ్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల పేరుతో రూ.వేల కోట్లు అప్పు తీసుకుని ఎగ్గొట్టినా ఏమీ చేయని బ్యాంకులు.. పేదవాళ్ల ఇంటికోసమో, పిల్లల వివాహాల కోసమో, చిన్నపాటి వ్యాపారాల కోసమో రుణం అడిగితే ఎగ్గొడతారని చెబుతున్నాయని రాష్ట్ర సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అలాంటి బ్యాంకుల ముందు ధర్నాలు చేయాలని పేదలకు సూచించారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఆదివారం జరిగిన 'అనుగురాజు యాదవ్' విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవనాధారం కోసంగొర్రెలు కొనుగోలు చేసుకోవాలనుకునే వారికి రుణాలిచ్చేందుకు కొన్ని బ్యాంక్‌లు సవాలక్ష కొర్రీలు వేస్తున్నాయని విమర్శించారు. అదే సమయంలో పారిశ్రామిక వేత్తలకు రూ.వేల కోట్ల అప్పులు ఇస్తున్నాయని తెలిపారు. వీటిని తీసుకున్నవారు తర్వాత కాలంలో ఎగ్గొట్టినా బ్యాంకులు ఏమీ చేయలేవన్నారు. సీఎం చంద్రబాబు ఆలోచనకు తగ్గట్టుగా బీసీ యువత ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని సూచించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు చంద్రబాబు, లోకేశ్ కృషి చేస్తున్నారని తెలిపారు. పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థితికి తీసుకొచ్చేందుకు యాదవ సామాజికవర్గం పెద్దలు తోడ్పాటునందిస్తారన్నారు. ఈ సమావేశంలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, చీరాల ఎమ్మెల్యే కొండయ్య యాదవ్, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ యాదవ్, రాష్ట్ర యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ గోళ్ల నరసింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్-విజయవాడ 8 వరసల రహదారి

- ఫిబ్రవరిలో పనులు ప్రారంభం!: టీ మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65)ని 8 వరసలుగా విస్తరించే పనులు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. టెండర్ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణను కలిపే ఈ ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే రోడ్లలో ఇది కూడా ఒకటని తెలిపారు. ఎన్‌హెచ్-65పై ఇప్పటికే 17 బ్లాక్ స్పాట్లు గుర్తించి ఫ్లై ఓవర్లు నిర్మిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. ఇటీవల కేంద్ర మంత్రి గడ్కరీని కలిసినప్పుడు ఈ అంశాన్ని గుర్తుచేశానని, తెలుగు రాష్ట్రాల ప్రజలకు ప్రమాదరహిత రహదారిని అందుబాటులోకి తెస్తామని చెప్పినట్లు తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యతతో హైదరాబాద్-విజయవాడ రహదారిని నిర్మిస్తామని గడ్కరీ చెప్పారన్నారు. ఈ 8 వరసల రహదారి పనులు పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 2 గంటల్లో చేరుకోవచ్చని మంత్రి చెప్పారు. అదేక్రమంలో భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి 230 కి.మీ. గ్రీన్ ఫీల్డ్ హైవే పట్ల కూడా కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా ఉన్నారన్నారు. డీపీఆర్, అంచనాల రూపకల్పన త్వరలో పూర్తవుతాయని, గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయని చెప్పారు. ఇది తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో కీలకంగా నిలుస్తుందన్నారు.

అరకు కాఫీకి అవార్డుపై సీఎం హర్షం

అమరావతి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఫైనాన్షియల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగంలో చేంజ్ మేకర్ ఆఫ్ ద ఇయర్ -2025 అవార్డును అరకు కాఫీ దక్కించుకోవడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు. అరకు కాఫీ తోటల సాగులో గిరిజన రైతులు అవిశ్రాంతంగా.. అంకితభావంతో కృషి చేశారని ప్రశంసించారు. అరకు కాఫీ తోటల సాగులో గిరిజన రైతులు స్థిరమైన ఆదాయాలను పొందడంతోపాటు ప్రపంచ స్థాయి గుర్తింపునూ సాధించారని అన్నారు. అద్భుతమైన విజయాన్ని దక్కించుకున్న గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్‌కు అభినందనలు తెలిపారు.

బెదిరిస్తే భయపడేవారెవరూ లేరు

- అసెంబ్లీకి వచ్చే దమ్ములేని నాయకుడు జగన్: మంత్రి సత్యకుమార్

అనంతపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): విష సంస్కృతిని అలవర్చుకున్న వైసీపీ డిజిటల్ బుక్ పేరుతో బెదిరిస్తే భయపడేవారెవరూ లేరని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన అనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీకి వచ్చే దమ్ములేని నాయకుడు జగన్ అని, ప్యాలెస్‌లో కూర్చుని కలలు కనడమే ఆయన పని అని విమర్శించారు. ప్రజలపై దాడులు చేయడం, తలలు నరకడం.. తొక్కించడం.. రప్పరప్ప అనడం.. జగన్ వ్యక్తిత్వమని విమర్శించారు. వైసీపీ నాయకులు అధికారం కోల్పోవడంతో వారి మానసిక పరిస్థితి బాగోలేదని ఎద్దేవా చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తే అంతు చూస్తామంటున్న ఆ పార్టీ నేతలు.. అధికారంలోకి వచ్చేదీ లేదు.. సచ్చేదీ లేదు అని వ్యాఖ్యానించారు.

వైసీపీది అప్రజాస్వామిక ప్రవర్తన: యనమల

అమరావతి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జగన్, అతని ఎమ్మెల్యేలది అప్రజాస్వామిక ప్రవర్తన అని, అది వారందరినీ అనర్హతకు గురిచేసే ప్రమాదముందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలందరిపైనా అనర్హత కత్తి వేలాడుతోందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 190(4) ప్రకారం అనర్హత నుంచి తప్పించుకోవడానికి వైసీపీ వారికి రెండే మార్గాలు ఉన్నాయని తెలిపారు. ఒకటి.. ఎమ్మెల్యేలు తమ గైర్హాజరీని సెలవుగా పరిగణించాలని కోరవచ్చని, దాన్ని పాలకపక్షం ఆమోదించాల్సి ఉంటుందని, రెండోది సభకు హాజరుకావడమని పేర్కొన్నారు. ఈ రెండింటిలో ఏది జరగకపోయినా వారిపై వేటు ఖాయమని యనమల తెలిపారు.

సమర్థత, అనుభవం ఫలితమే

చార్జీల తగ్గింపు

- విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టాం
- రూ.1,000 కోట్లు ఆదా చేశాం
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

> రాష్ట్ర విద్యుత్ అవసరాలను.. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ముందుగానే సమీక్షించుకుని తక్కువ ధరకు కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకున్నాం. ఇతర రాష్ట్రాలతో మాట్లాడుకుని స్వాపింగ్ విధానాన్ని అవలంబించి వెయ్యి కోట్లు ఆదా చేయగలిగాం.
>
> జీఎస్టీ సంస్కరణలతో మన రాష్ట్ర ప్రజలకు రూ.8 వేల కోట్లు ఆదా అవుతాయి. రాష్ట్రానికి వచ్చే ఆదాయం తగ్గినా సంస్కరణల వల్ల జనం ఆర్థికంగా బలోపేతమవుతారు.
>
> రోజుకు 150 టీఎంసీల చొప్పున.. ఏటా 6 వేల టీఎంసీల నీళ్లు సముద్రం పాలవుతున్నాయి. ఒక రోజు సముద్రంలో కలిసే నీటిని ఉపయోగించుకుంటే కరువనేది లేకుండా చేయొచ్చు.
>
> - సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలో ఎప్పుడు చూసినా ట్రూ-అప్ ప్రతిపాదనలే ఉండేవి. కానీ తొలిసారి ట్రూడౌన్ వచ్చేలా చేశాం. ఇలా ఆదా చేసిన డబ్బుతో ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గిస్తున్నాం. సమర్థతకు.. అనుభవానికి వచ్చిన ఫలితమిది. దీని వల్ల ప్రజలపై రూ.1,000 కోట్ల భారం తగ్గింది.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. వ్యవస్థలను గాడిలో పెట్టి, సక్రమంగా నిర్వహించినప్పుడు, సంస్కరణలను సమర్థంగా అమలు చేసినప్పుడు ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. టీడీపీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలతో ఆయన ఆదివారం టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జీఎస్టీ సంస్కరణలతో పన్నుల తగ్గి సామాన్య ప్రజలకు లబ్ధి చేకూరగా.. విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టి తక్కువ ధరకు కరెంటు కొనుగోళ్లు చేపట్టడం వల్ల సుమారు రూ.వెయ్యి ఆదా చేయగలిగామన్నారు. జీఎస్టీ సంస్కరణలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలని నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని మించిన స్థాయిలో 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. జీఎస్టీ సంస్కరణల ఫలాలను ప్రజలకు వివరించేందుకు అక్టోబరు 19 వరకు పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అందులో భాగంగా సుమారు 60 వేల సమావేశాలు నిర్వహించి, 1.60 కోట్ల కుటుంబాలను కలిసి, జీఎస్టీ 2.0 ప్రయోజనాలను వారికి వివరించాలన్నారు. 'జీఎస్టీ 2.0 సంస్కరణలు దేశ చరిత్రలో నూతన అధ్యాయం. పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతో లబ్ధి చేకూరుతుంది. ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ మార్పులను జీఎస్టీ ఉత్సవ్‌లో భాగంగా ప్రజలకు వివరిద్దాం. ఈ సంస్కరణల ప్రభావం పారిశ్రామిక, ఆటోమొబైల్, ఫార్మా వంటి రంగాలపై పూర్తిగా కనిపిస్తోంది. ఆ రంగాల అభివృద్ధికి ఇవి దోహదపడతాయి. ద్విచక్ర వాహనాలు, ఏసీలు, కార్లు వంటి వాటిపై జీఎస్టీ బాగా తగ్గింది. ప్రజలు నిత్యం ఉపయోగించే వస్తువుల ధరలు భారీగా తగ్గాయి. ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయంపై ధన్యవాదాలు తెలుపుతూ అసెంబ్లీలో తీర్మానం చేశాం. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ఏడాదిలో ప్రజలకు ఏం చేశామో వివరించాం. అదే తరహాలో జీఎస్టీ ఉత్సవ్ కార్యక్రమాన్ని కూడా చేపట్టాలి' అని పిలుపిచ్చారు. ఇంకా ఏమన్నారంటే..

గత ప్రభుత్వం నాశనం చేసింది..

గత ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థను నాశనం చేసింది. ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టింది. దీంతో విద్యుత్ చార్జీల కొనుగోళ్ల భారం ప్రజలపై పడింది. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టాం. ప్రభుత్వ డబ్బులే కదా.. ఖర్చయిపోతే మనకేంలే అనుకోలేదు. ప్రతి రూపాయినీ బాధ్యతాయుతంగా ఖర్చు చేస్తున్నాం.

సూపర్ సిక్స్.. సూపర్ హిట్

సూపర్ సిక్స్ పథకాలు హిట్ అయ్యాయి. ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది. మెగా డీఎస్సీ.. మెగా హిట్ అయింది. నియామక పత్రాలు అందించే కార్యక్రమంలో పాల్గొనప్పుడు వారి కళ్లలో ఆనందం చూసి చాలా సంతోషించా. 15 నెలల కాలంలో 4.71 లక్షల మందికి ఉద్యోగాలిచ్చాం. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, దీపం-2.0 వంటి పథకాలు సక్సెస్ చేశాం. అన్న క్యాంటీన్ల ద్వారా పేదల కడుపులు నింపుతున్నాం. మరే ఇతర రాష్ట్రంలోనూ ఇవ్వనన్ని పింఛన్లు ఇస్తున్నాం. హంద్రీ-నీవా పూర్తి చేసి కుప్పంకు నీళ్లు ఇచ్చాం. పోలవరం పూర్తి చేస్తున్నాం. ఇతర సాగునీటి ప్రాజెక్టులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నాం. అక్టోబరు 4న 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. ప్రతి లబ్ధిదారుకూ రూ.15 వేలు ఇస్తాం. ఏ ఎన్నిక వచ్చినా కూటమి పార్టీలదే గెలుపు అన్నట్లుగా ఉండాలి. ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై అనునిత్యం ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నాం. అదే విధంగా నేతల పనితీరు మీదా ఫీడ్‌బ్యాక్ తెప్పించుకుంటున్నాం. పార్టీ, ప్రజల కోసం పనిచేసే వారే నాకు దగ్గరవుతారు. మాటలు చెప్పి కాలక్షేపం చేసేవారికి నా దగ్గర స్థానం లేదు.

తప్పుడు ప్రచారమే వైసీపీ ఆచారం

రాష్ట్రంలో ప్రభుత్వంపై ఫేక్ ప్రచారం చేయడమే వైసీపీ పనిగా పెట్టుకుంది. తప్పుడు పోస్టులు పెడుతూ తప్పుడు సమాచారాన్ని ప్రజల్లోకి పంపుతున్నారు. వాళ్లు పెట్టే ఒక్క పోస్టుకూ ఆధారం ఉండదు. వ్యక్తిత్వ హననాలకు పాల్పడుతున్నారు. వైసీపీ నుంచి గెలిచిన 11 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రారు. మండలిలో మాత్రం రకరకాల డ్రామాలు ఆడుతున్నారు. ప్రభుత్వం చేసే మంచి పనినే కాదు.. వైసీపీ చేసే దుష్ప్రచారాలను.. డ్రామాలను కూడా ప్రజలకు వివరించాలి. ఈ బాధ్యతను నేతలు, కార్యకర్తలు తీసుకోవాలి.

కరెంటు చార్జీలు మరింత తగ్గిస్తాం

- జగన్ ట్రూఅప్‌తో బాదితే.. మేం ట్రూడౌన్‌తో ఊరట ఇస్తున్నాం: గొట్టిపాటి

విద్యుత్ చార్జీలు పెంచబోమని, వీలైతే తగ్గిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం తాడేపల్లిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో సుమారు రూ.1,000 కోట్లను ఆదా చేసి, ప్రజలకు లబ్ధి చేకూర్చామని.. రానున్న రోజుల్లో విద్యుత్ చార్జీల భారాన్ని మరింతగా తగ్గిస్తామని ప్రకటించారు. 'జగన్ ఐదేళ్లూ ట్రూఅప్ అంటూ జనాలను బాదితే.. మేం 15 నెలల్లోనే ట్రూడౌన్ అంటూ విద్యుత్ చార్జీల నుంచి ఊరట కలిగించాం. ఆదా చేసిన మొత్తాన్ని ఈ ఏడాది నవంబరు నుంచి యూనిట్‌కు 13 పైసల చొప్పున విద్యుత్ బిల్లుల్లో సర్దుబాటు చేసి వినియోగదారులకు లబ్ధి చేకూరుస్తాం. 2014లో లోటు విద్యుత్ నుంచి 2109 నాటికి మిగులు విద్యుత్ సాధించే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే. 2019లో జగన్ వచ్చాక విద్యుత్ వ్యవస్థను నాశనం చేశారు. మళ్లీ లోటులోకి తీసుకెళ్లారు. 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.18 వేల కోట్ల భారం మోపారు. ఇంధన రంగానికి రూ.1.25 కోట్లు నష్టం కలిగించారు. వైసీపీ ప్రభుత్వం ప్రావిజనల్ కలెక్షన్ పేరుతో 2024-25లో యూనిట్‌కు అదనంగా 40 పైసలు వసూలు చేసుకునేలా ధరను నిర్ణయించింది. అందులో 13 పైసలు ఆదా చేసిన కూటమి ప్రభుత్వం.. తిరిగి వాటిని ప్రజలకు ఇస్తోంది. జగన్ కక్ష సాధింపుధోరణితో పీపీఏ రద్దు చేయడంతో అంతర్జాతీయ సమాజంలో తలదించుకోవడంతోపాటు రూ.9వేల కోట్ల పెనాల్టీ కట్టాల్సి వచ్చింది. 17 శాతం ఉన్న షార్ట్ టర్మ్ విద్యుత్ కొనుగోళ్లను కూటమి ప్రభుత్వం 6.8 శాతానికి తీసుకొచ్చింది. స్వాపింగ్ విధానాన్ని ప్రవేశపెట్టి మన వద్ద అదనపు విద్యుత్ ఉన్నప్పుడు.. పంజాబ్, హరియాణా రాష్ట్రాలకు ఇచ్చి మనకు అవసరం ఉన్నప్పుడు వారి నుంచి తీసుకునే దిశగా పనిచేస్తున్నాం. ఏఐ పరిజ్ఞానం ద్వారా వాతావరణ పరిస్థితులు అధ్యయనం చేస్తూ విద్యుత్ డిమాండ్ అంచనా వేయగలుగుతున్నాం. తద్వారా డిమాండ్‌కు తగినట్లు సరఫరా చేయగలుగుతున్నాం' అని వివరించారు.



తన నివాసానికి వచ్చిన సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం పవన్

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

- త్వరగా కోలుకుని రండి
- పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు సూచన
- హైదరాబాద్‌లో జనసేనానికి పరామర్శ
- 4న 'ఆటోడ్రైవర్ల సేవలో'పై చర్చ
- 16న ప్రధాని రాష్ట్ర పర్యటనపైనా

అమరావతి/హైదరాబాద్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తీవ్ర జ్వరంతో కొద్దిరోజులుగా బాధపడుతున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. జ్వరం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆదివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో జనసేనాని నివాసానికి సీఎం వెళ్లారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జ్వర తీవ్రత తగ్గిందని, దగ్గు ఎడతెరిపి లేకుండా వస్తోందని పవన్ చెప్పారు. పరీక్షలు చేసి క్రానిక్ బ్రాంకైటిస్ మూలంగా దగ్గు వస్తున్నట్లు వైద్యులు చెప్పారని, దగ్గు కారణంగా గొంతు నొప్పి కూడా ఉందన్నారు. అక్టోబరు 4న 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ అంశంపై డిప్యూటీ సీఎంతో చంద్రబాబు చర్చించారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని విజయవంతంగా అమలు చేయగలిగామని, తద్వారా మహిళలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతోందని సీఎం అన్నారు. ఈ పథకం కారణంగా ఆటో డ్రైవర్లకు ఇబ్బంది కలుగకూడదన్న ఉద్దేశంతో వారికి కూడా ఏటా రూ.15 వేల చొప్పున ఆర్థిక భరోసా కల్పించే నిర్ణయాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఆటో డ్రైవర్ల కోసం చంద్రబాబు చేసిన ఆలోచన గొప్పదని, స్త్రీశక్తిలాగే ఈ పథకం కూడా అందరి మన్ననలు పొందుతుందని పవన్ విశ్వాసం వ్యక్తంచేశారు. జీఎస్టీ 2.0 సంస్కరణల్లో భాగంగా రాష్ట్రంలో చేపట్టనున్న జీఎస్టీ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహణపై ఇద్దరూ చర్చించారు. అక్టోబరు 16న ప్రధాని మోదీ శ్రీశైలం రానున్న సందర్భంగా రోడ్‌షో నిర్వహణ విజయవంతం చేసే ప్రణాళికపైనా మాట్లాడుకున్నారు. వీటిపాటు డీఎస్సీ అంశం కూడా ఇద్దరి మధ్య చర్చకు వచ్చింది. మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి, ఒకే సారి 15,941 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వడాన్ని పవన్ ప్రస్తావించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించి యువతలో మనోధైర్యాన్ని, స్ఫూర్తిని నింపారని సీఎంను ప్రశంసించారు.



తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో దుర్గమ్మల నృత్యరూపకం

మ్యూజిక్.. జోష్

మ్యూజికల్ నైట్స్‌కు జన ప్రవాహం

- విజయవాడ ఉత్సవ్‌లో అలరించిన రామ్ మిరియాల, సాకేత్

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్'లో ఆదివారం నాటి మ్యూజికల్ నైట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గొల్లపూడి ఎగ్జిబిషన్‌లోని కళావేదికపై ప్రముఖ సింగర్ రామ్ మిరియాల తన గాత్ర మాధుర్యంతో యువతను ఉర్రూతలూగించారు. ఏకంగా స్టేజీ వద్దకు చొచ్చుకు వచ్చి డ్యాన్సులతో అదరగొట్టారు. పున్నమిఘాట్‌లో సాకేత్ టీమ్ మ్యూజికల్ నైట్ అదరహో అనిపించింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో కళాప్రదర్శనలు సాంస్కృతిక వైభవాన్ని చాటాయి. సంగీత కచేరీలు, జానపద, శాస్త్రీయ నృత్యాలు, నాటిక, నాటకాల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఘంటసాల సంగీత కళాశాలలో కూడా నృత్య ప్రదర్శనలు, జానపదాలు, మిమిక్రీ, మ్యాజిక్ షోలు ఉర్రూతలుగించాయి. హాస్యనాటికలు కడుపుబ్బ నవ్వించాయి. 'పల్నాటి యుద్ధం' నాటక ప్రదర్శన అద్భుతంగా సాగింది.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ







పున్నమిఘాట్‌లో నృత్య ప్రదర్శన, గొల్లపూడి ఎగ్జిబిషన్‌లో సింగర్స్ రామ్ మిరియాల, సాకేత్ సందడి



జాషువాకు నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

జాషువా గొప్ప దేశ భక్తుడు: బీజేపీ చీఫ్ మాధవ్

» విజయవాడలో గుర్రం జాషువా జయంతి

అమరావతి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గుర్రం జాషువా గొప్ప దేశభక్తుడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గుర్రం జాషువా జయంతి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సమరసతా స్వరం.. జాతీయతా గళం పేరుతో గుర్రం జాషువా జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు భాషలో జాతీయ కవులు లేరా అన్న ప్రశ్న వేసుకున్నప్పుడు జాతీయ స్థాయి కవిగా జాషువా ఆయనంటే ఏమిటో ఆయన రచనల ద్వారా తెలుస్తుందన్నారు. గుర్రం జాషువా గొప్ప దేశ భక్తుడని, జాతి యావత్తు గుర్తుంచుకునేలా రచనలు చేసిన మహోన్నత వ్యక్తి అని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ శ్లాఘించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ జాషువా కవితా సౌరభం వెలకట్టలేనిదని, జాషువా ఆశించింది నేడు బీజేపీ చేస్తోందని తెలిపారు.

విద్యతోనే కురుబల అభ్యున్నతి

» కురుబల ఆత్మీయ సదస్సులో మంత్రి సవిత



మంగళగిరి సిటీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యతోనే కురుబల అభ్యున్నతి సాధ్యమని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. మంగళగిరిలోని ఆర్ ఆర్ కన్వెన్షన్ సెంటరులో ఆదివారం జరిగిన కురుబ, కురువ, కురుమ సామాజిక వర్గీయుల రాష్ట్రస్థాయి ఆత్మీయ సమావేశానికి ఆమె హాజరయ్యారు. కురుబ, కురుమ, కురువలు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అమరావతిలో భక్త కనకదాస కాంస్య విగ్రహం, తిరుపతిలో కనకదాస పీఠం ఏర్పాటుపై సీఎం చంద్రబాబుతో చర్చించామన్నారు. సీఎం చంద్రబాబు ప్రోత్సాహంతో కురుబలకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కురుబలను గెలిపించుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తిరుపతిలో వచ్చే నెల 5న జరుగనున్న భక్త కనకదాస కాంస్య విగ్రహావిష్కరణకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంత్రి సవిత ఈ సందర్భంగా ఆవిష్కరించారు. సమావేశంలో కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప పాల్గొన్నారు.

హైదరాబాద్ హైవేపై పండగ రద్దీ

చౌటుప్పల్ టౌన్, కేతేపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఏపీలోని వివిధ జిల్లాలకు వెళ్లే వాహనాలతో రహదారులపై రద్దీ నెలకొంది. నగర శివారులు, చెక్‌పోస్టులు, టోల్‌ప్లాజాల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ప్రధానంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి-65పై ఆదివారం వందలాదిగా వాహనాలు బారులు తీరాయి. సోమవారం నుంచి శుక్రవారం వరకు బతుకమ్మ, దసరా పండుగలు ఉండడం, శనివారం సెలవు తీసుకుంటే వారం రోజులపాటు సొంతూళ్లలో ఉండొచ్చనే ఆలోచనతో నగరవాసులు పయనమయ్యారు. హైవే వెంట ఉన్న హోటళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, కాకినాడ, గుంటూరు ప్రాంతాలకు చెందిన వారు కార్లు, ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో స్వగ్రామాలకు తరలి వెళ్తున్నారు. పండగ వాహనాలకు తోడు భారీ లారీలు, ఇతర వాహనాలు తోడవడంతో రహదారిపై వాహనాల సంఖ్య అధికమైంది.

లక్ష కోట్ల భూములు ఏమయ్యాయి?

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది (ఆగస్టు) వరకు ఎంత మేర ప్రభుత్వం భూములు కేటాయించింది? వాటి విలువ ఎంత? భూకేటాయింపు ప్రయోజనాలు నెరవేరాయా? అవి ఆచరణలో ప్రజలు, ప్రభుత్వానికి ఉపయోగపడుతున్నాయా? లేక ఆ భూములను అడ్డం పెట్టుకొని కొందరు వ్యక్తులు లబ్ధిపొందుతున్నారా? దుర్వినియోగం జరిగితే అది ఏ స్థాయిలో ఉంది? ఇలాంటి అంశాలపై సర్కారు ఫోకస్ పెట్టింది. ఇకపై భూములను మార్కెట్ ధరకు విక్రయించడం ఆపేసి, నిర్దిష్ట కాలపరిమితికి పూర్తిస్థాయిలో లీజు ప్రాతిపదిన ఇవ్వాలనుకుంటోంది. ప్రభుత్వ పరిశీలన కొలిక్కి వచ్చిన తర్వాత భూ కేటాయింపు విధానంలో మార్పులు తీసుకురావాలని భావిస్తోంది.

ఏపీఐఐసీ, నెడ్‌క్యాప్‌కు చౌకగా..

ఉమ్మడి ఏపీలో 2012లో ఆనాటి ప్రభుత్వం భూ కేటాయింపు విధానం తీసుకొచ్చింది. అమలు కోసం భూ పరిపాలనా ప్రధాన కమిషనర్(సీసీఎల్‌ఏ) నేతృత్వాన ఏపీ భూ నిర్వహణా సంస్థ(ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ-ఏపీఎల్‌ఎమ్‌ఏ)ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు, సంస్థలు, వ్యక్తులకు ఏపీఎల్‌ఎమ్‌ఏ ద్వారానే భూములు కేటాయిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఈ ఏడాది ఆగస్టు వరకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కలిపి రూ.లక్ష కోట్ల విలువైన భూములను కేటాయించారు. కొన్ని భూములను మార్కెట్ ధరకు, మరి కొన్నింటిని నామమాత్రపు ఫీజుకు కేటాయించారు. ఇలా 13 ఏళ్ల వ్యవధిలో 1,82,270 ఎకరాల భూములు ఇచ్చారు. 1,490 ప్రతిపాదనల ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకు కేటాయించారు. భూ కేటాయింపుల్లో సింహభాగం ఏపీఐఐసీదే కోటా. పరిశ్రమలు, కంపెనీల స్థాపన, ల్యాండ్ బ్యాంక్ పేరిట ఇప్పటి వరకు ఏపీఐఐసీకి 64,788 ఎకరాలను కేటాయించారు. ఇందులో ఎక్కువ భాగం పరిశ్రమలను ప్రోత్సహించాలన్న ఆలోచనతో అతి తక్కువ ధరకే కేటాయించిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. ఇవికాకుండా సోలార్, విండ్, ఇతర విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల కోసం 42,084 ఎకరాలను కేటాయించారు. ఇందులో సింహభాగం జగన్ ప్రభుత్వంలోనే ఇచ్చారు. ఇటు ఏపీఐఐసీకి, అటు నెడ్‌క్యాప్‌కు కలిపి వేల ఎకరాలు జగన్ ప్రభుత్వ హయాంలోనే కారుచౌకగా కట్టబెట్టారు. ఇందులో పంటలు పండే సాగు భూములు కూడా ఉన్నాయని గుర్తించారు. ఈ భూముల వాస్తవిక విలువ ఎంతన్నది మరోసారి నిశిత పరిశీలన చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏపీఐఐసీ, నెడ్‌క్యాప్‌లకే 1.08 లక్షల ఎకరాలు ఇచ్చారు. కానీ వాటిపై ఆశించిన పెట్టుబడులు రాలేదు. ఈ నేపథ్యం లో ఈ భూములపై నిశిత పరిశీలన చేయాలనుకుంటోంది.

ప్రైవేటుకు 28,893 ఎకరాలు

పారిశ్రామికేతర అవసరాలు అంటే.. వ్యక్తులు, సంస్థలు, ట్రస్టులు, విద్యాసంస్థలు, సామాజిక అవసరాలకు కలిపి ప్రైవేటు రంగంలోని వారికి గత 13 ఏళ్ల వ్యవధిలో 28,893 ఎకరాలపైనే కేటాయించారని గుర్తించారు. ఈ భూముల విలువ కనీసం పాతిక వేలకోట్లపైనే ఉంటుందని అంచనా. ఇందులో అత్యంత ఖరీదైన భూములున్నాయి. విశాఖ, విజయవాడ, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు వంటి నగరాలు, అత్యంత ఖరీదైన ప్రాంతాల్లోని భూములను ప్రైవేటు సంస్థలు, సంఘాలు, వ్యక్తులకు ఇచ్చారు. ఎకరం 5 కోట్లు ఉన్న భూమిని కూడా ఏడాదికి రూ.వెయ్యి లీజు చొప్పున కేటాయించిన ఉదంతాలు అనేకం బయటకొస్తున్నాయి. ఇక మాజీ సైనికులు, రాజకీయ బాధితులు, రాష్ట్రానికి పేరు తీసుకొస్తున్నారని వ్యక్తులకు ఇస్తున్న భూముల ఖరీదు కోట్లల్లో ఉంటుంది. ఇలా విశాఖలో ఇచ్చిన వందల కోట్ల విలువైన భూములు ఎన్నో పరాధీనం అయ్యాయని ప్రభుత్వం గుర్తించింది. ఇక కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రైల్వేలకు కలిపి ఇప్పటి వరకు 8,985 ఎకరాలు కేటాయించారు. ఇందులో రైల్వే ప్రాజెక్టులకు 1,740 ఎకరాలు ఇచ్చారు. ఇవన్నీ ప్రభుత్వ భూములే. ప్రైవేటు భూములకు పరిహారం ఇచ్చారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం పరిహారం లేకుండానే ఇచ్చేసింది.

బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు

జగన్ ప్రభుత్వ హయాంలో ఏపీఐఐసీ ద్వారా జరిగిన భూ కేటాయింపులు, వాటి ధరలు, దక్కిన ప్రయోజనాలపై ప్రభుత్వం నివేదికలు కోరింది. జిల్లాల వారీగా ఏపీఐఐసీ మేనేజర్ల నుంచి నివేదికలు కోరినట్లు తెలిసింది. ఇండస్ట్రియల్ జోన్ల పరిధిలో ఎంతెంత భూములు ఇచ్చారు? వాటి వినియోగం ఎలా ఉంది? భూమి కేటాయించినప్పుడు నిర్ణయించిన క్లాజుల అమలు పర్యవేక్షణ, స్థానికులకు ఉద్యోగాల కల్పన వంటి అంశాలపై నివేదికలు కోరినట్లు సమాచారం. అయితే కొన్ని కంపెనీలు, సంస్థలు తీసుకున్న భూముల్లో కేవలం 30-60 శాతం వినియోగించి, మిగిలిన భూములను తనఖా పెట్టి భారీగా రుణాలు తీసుకున్నట్లుగా గుర్తించారు. కొన్ని అయితే ఇచ్చిన మొత్తం భూమిని తనఖా పెట్టి రుణాలు పొందినట్లుగా గుర్తించారు. రుణాలను తిరిగి చెల్లించని పక్షంలో బ్యాంకులు ఆ భూములను వేలం వేసే పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో ఏపీఐఐసీ వద్ద ఉన్న ల్యాండ్‌బ్యాంక్ వినియోగంపై సమగ్ర సమీక్ష చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఇకపై పరిశ్రమలు, కంపెనీలు, ప్రైవేటు సంస్థలు, విద్యాసంస్థలు, ట్రస్టులకు లీజు ప్రాతిపదికనే భూములు ఇవ్వాలనుకుంటోంది.

ముగ్గురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్

» మృతుల్లో ఒకరు మహిళా మావోయిస్టు

» ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఘటన

» ముగ్గురిపై మొత్తం 14 లక్షల రివార్డు



బసంతి కుంజాం మృతదేహం

చింతూరు/చర్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఒక మహిళా మావోయిస్టు సహా ముగ్గురు మావోయిస్టులను భద్రతా దళాలు ఎన్‌కౌంటర్ చేశాయి. ఛత్తీస్‌గఢ్‌లోని అడవుల్లో ఆదివారం జరిగిందీ ఎన్‌కౌంటర్. విశ్వసనీయ సమాచారం మేరకు కాంకేర్, గరియాబంద్ జిల్లాల సరిహద్దులోని చింద్‌ఖడక్ గ్రామ సమీప కొండలపై మావోయిస్టులు ఉన్నారని కాంకేర్ ఎస్పీ ఇందిరా కల్యాణ్‌కు సమాచారం అందింది. దీంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ), సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్), కోబ్రా, ఎస్టీఎఫ్ బలగాలను పంపించారు. వీరికి మావోయిస్టులు తారసపడటంతో ఎదురు కాల్పులు జరిగాయి. మృతులను సీతానది ఏరియా కమిటీ కార్యదర్శి సర్వన్ మద్కం అలియాస్ విశ్వనాథ్, నగిరి ఏరియా కమిటీ సభ్యుడు రాజేశ్ అలియాస్ రాకేశ్ హేమ్లా, మెయిన్‌పూర్-నువాపాడ రక్షణ బృందం సభ్యురాలు బసంతి కుంజాం అలియాస్ హిడ్మేగా గుర్తించారు. కాల్పులు జరిగిన స్థలంలో 'ఎస్ఎల్ఆర్, 303 రైఫిల్, 12 బోర్ తుపాకీలను స్వాధీనం చేసుకున్నారు. మృతులు ముగ్గురిపై మొత్తంగా రూ.14లక్షల రివార్డు ఉందని బస్తర్ రేంజ్ ఐజీ సుందరరాజ్ చెప్పారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మరికొందరు మావోయిస్టులు మృతి చెంది ఉంటారన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్ల 252 మంది మావోయిస్టులు మృతి చెందారని, వీరిలో 223 మంది కాంకేర్ జిల్లాతో సహా బస్తర్ డివిజన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో చనిపోయారని పేర్కొన్నారు. మిగిలిన 27 మంది రాయపూర్ డివిజన్‌లోని గరియాబంద్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్లలో, మరో ఇద్దరు మావోయిస్టులు దుర్గ్ డివిజన్‌లోని మేహ్లా-మన్‌పూర్ అటవీ ప్రాంతంలో మృతి చెందారని తెలిపారు. కాగా, యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా ఆదివారం కేంద్ర బలగాలు తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మీదుగా పూజారి కాంకేర్ అడవుల్లోకి ప్రవేశించాయి.



విడదల రజినీపై వైసీపీ 'డిజిటల్ బుక్'లో చేసిన ఫిర్యాదు

ఇల్లు, కారు, ఆఫీసుపై.. రజినీ దాడి చేయించారు

» వైసీపీ మాజీ మంత్రి విడదలపై 'డిజిటల్ బుక్ యాప్'లో ఫిర్యాదు

చిలకలూరిపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ కొత్తగా అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ బుక్ యాప్ ద్వారా మాజీ మంత్రి విడదల రజినీపై నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం ఆదివారం ఫిర్యాదు చేశారు. 2022లో చిలకలూరిపేటలోని నవతరం పార్టీ కార్యాలయం సహా తన ఇల్లు, కారుపై రజిని దాడి చేయించారని తెలిపారు. ఆమెపై తగిన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు 'డిజిటల్ బుక్' ద్వారా జగన్‌కు ఫిర్యాదు చేశారు. దాడికి సంబంధించిన ఫొటోలను కూడా ఆయన పంపారు. డిజిటల్ బుక్‌లో ఫిర్యాదు నమోదు అయినట్టు వచ్చిన టికెట్‌ను సుబ్రహ్మణ్యం మీడియాకు విడుదల చేశారు.

నాపై వ్యతిరేక వార్తలు రాస్తే తాటతీస్తా

» విలేకరులపై నెల్లిమర్ల జనసేన ఎమ్మెల్యే భర్త చిందులు



విలేకరులను హెచ్చరిస్తున్న లోకం ప్రసాదు(వెనుక)

విజయనగరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): 'నాపై కొన్ని పత్రికల్లో అసత్య కథనాలు వస్తున్నాయి. ఇకపై ఎవరైనా వెధవ వేషాలు వేసినా.. నాకు వ్యతిరేకంగా వార్తలు రాసినా తాటతీస్తా' అని విజయనగరం జిల్లా నెల్లిమర్ల జనసేన ఎమ్మెల్యే లోకం నాగమాధవి భర్త లోకం ప్రసాదు విలేకరులను హెచ్చరించారు. భోగాపురంలోని జనసేన ఆఫీసులో ఆదివారం ఎమ్మెల్యే తన తన భర్త, పార్టీ నేతలతో కలిసి సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విలేకరులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతలోనే ఆమె భర్త ప్రసాదు ఆవేశంతో ఊగిపోతూ.. కొన్ని పత్రికలు తనపై అసత్య కథనాలు రాస్తున్నాయని, ఇకపై అలాంటి వారి తాటతీస్తానని హెచ్చరించారు. 'నేను చాలా మొండివాడిని. నన్ను ఎవరూ ఏమీ పీకలేరు. నేను ఎవరికీ భయపడేదిలేదు. ఎమ్మెల్యే భర్తకు హక్కులు ఉండవా? ఇకపై తడాఖా చూపిస్తా' అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


MARUTI SUZUKI
NEXA
THIS NAVRATRI, FIND INSPIRATION IN EVERY MILE.
AVAIL GST BENEFITS OF UP TO ₹1 07 000*
NOW STARTING AT ₹10 76 500 FOR GRAND VITARA AND ₹11 52 300 FOR XL6.
GRAND VITARA
XL6
NEXA SAFETY SHIELD
*OFFER VALID TILL 30TH SEPTEMBER 2025 ONLY
CONSUMER OFFERS OF UP TO ₹1 63 000^
EXCHANGE BONUS OF UP TO ₹1 00 000^
UP TO 100% WAIVER ON CAR LOAN PROCESSING FEE**
SCAN TO CONNECT TO A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY @ WWW.NEXAEXPERIENCE.COM
Contact us at 1800-200-6392 1800-102-6392
For detailed T&C kindly visit nearest dealership. Maruti Suzuki India Limited reserves the rights to discontinue offers without notice and offers may vary across variants. ^Offers include consumer offer, exchange bonus and institutional or rural offers (wherever applicable) on select models/variants. Finance is at the sole discretion of the financer. 3 years or 100 000 km, whichever is earlier. Above offers are valid until stocks last. Black glass shade on the vehicle is due to the lighting effect. Images used are for illustration purposes only. Car colour may vary due to printing on paper. Revised prices effective from September 22, 2025. *Prices subject to applicable GST rates as notified by the Government. **By selected finance partners.